శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapakasham.in

# ప్రజాపక్షం


ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 64 | ఆదివారం | 01-02-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ గజుల సౌమ్య శనివారం రాత్రి మృతి చెందినట్లు నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్ తెలిపారు. నిజామాబాద్‌లో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో ఆమెపై ముఠా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే నిమ్స్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.



## వ్యాపారిపై కాల్పులు

- రూ.6 లక్షలు దోపిడీ..
- హైదరాబాద్ నడిబొడ్డున ఘటన అప్రమత్తమైన పోలీసులు
- రంగంలోకి ప్రత్యేక బృందాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నడిబొడ్డు కోఠిలోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద ఎటిఎంలో డబ్బులు జమ చేసేందకు వచ్చిన బట్టల వ్యాపారిపై అంగతకులు కాల్పులు జరిపి అతని వద్ద ఉన్న రూ.6 లక్షల నగదు దోచుకెళ్లిన సంఘటన శనివారం ఉదయం తరువాయి 12లో

# బడ్జెట్ దిశ ఎటు?



## అభివృద్ధి వర్సెస్ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు!

### నేడు పార్లమెంటులో 9వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** దేశంలోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక, రాజకీయ ఉద్రిక్తతల నడుమ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టనున్న 2026–27 వార్షిక బడ్జెట్‌లో ఉండబోయే అంశాలపై ఉత్కంఠ నెలకొంది. బడ్జెట్ అభివృద్ధి పథంలో బలమైన అడుగులు వేయడానికి అనువుగా ఉంటుందా లేక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాల ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించడంతోనే సరిపుచ్చుతారా? అన్నది బిలియన్ డాలర్ల ప్రశ్న. స్వతంత్ర భారత చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆదివారం ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్, అంతటి ప్రత్యేకతను సంతరించుకుంటుందా అన్నది చూడాలి. ఉపాధి నుంచి ధరల సూచీ నిలకడలేకుండా పైపైకి ఎగబాకడం వరకు ఎన్నో అంశాలను బడ్జెట్ ప్రతిబింబించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, జీవన ప్రమాణాల మెరుగు వంటి అంశాలు ప్రభుత్వం తీసుకునే ఆర్థిక విధాన నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆదాయపు పన్ను, జిఎస్‌టి కోతలు, మౌలిక వసతులపై భారీ వ్యయం, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి చర్యలు భారత ఆర్థిక వ్యవస్థకు కొంత ఊపునిచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్ల వంటి సమస్యల నుంచి అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు లేదా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య భారతర్థిక వ్యవస్థ తట్టుకొని నిలబడడానికి ఈ చర్యలు కొంత వరకూ ఊతమిచ్చాయి. కానీ, ఇవన్నీ తాత్కాలిక సహాయక చర్యలే తప్ప, దీర్ఘకాలిక వృద్ధికి కొత్త వేగాన్ని అందించలేకపోయాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థే అనిశ్చితితో కుదేలవుతున్న వేళ, భారతదేశం తన వృద్ధిని అంతర్గతంగా నిలబెట్టుకోవాల్సిన అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో, ఈ బడ్జెట్ వినియోగం, పెట్టుబడులు, ఉత్పాదకత అనే మూడు అంశాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్లే విధంగా ఉండాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటికే ఫిస్కల్ లోటును స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో తగ్గించే మార్గంలో నడుస్తోంది. కానీ, పన్ను కోతల వల్ల ఆదాయ వనరులు క్షీణించడం ఈ ప్రయాణాన్ని క్లిష్టతరం చేసింది. జిఎస్‌టి రేట్ల సరళీకరణ, నేరుగా పన్నుల్లో ఉపశమనాలు ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెంచాయి. ఒకవైపు వృద్ధికి ఊతమిచ్చేందుకు వ్యయం పెంచాల్సిన అవసరం, మరోవైపు లోటును అదుపులో ఉంచాల్సిన బాధ్యత.. ఈ రెండు మధ్య సమతుల్యత సాధించడం ఆర్థిక మంత్రికి అత్యంత కఠినమైన పని. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఖర్చులను కత్తిరించకుండా, ఖర్చుల నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఉత్పాదక వ్యయం, వ్యర్థ వ్యయం మధ్య స్పష్టమైన తేడా చూపించగలిగితేనే ఫిస్కల్ క్రమశిక్షణతో కూడిన వృద్ధి సాధ్యమవుతుంది. ఇటీవల కాలంలో ద్రవ్యోల్బణం కొంత తగ్గినప్పటికీ, సామాన్య మధ్యతరగతి, గ్రామీణ వినియోగంలో మాంద్యం ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. ఉపాధి అవకాశాలు తగినంతగా పెరగకపోవడం, వాస్తవ ఆదాయాలపై ఒత్తిడి కొనసాగడం వినియోగాన్ని నిరోధిస్తున్నాయి. ఈ పరిస్థితిలో బడ్జెట్ కేవలం పన్ను ఉపశమనాలకే పరిమితం కాకుండా, ఉపాధి సృష్టి ద్వారా ఆదాయ భద్రతను పెంచే దిశగా తరువాయి 2లో

### ఈసారి వక్తగా రండి..

## సిఎంకు ఆహ్వానం

- 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) పాలసీ సింపోజియం'కు వక్తగా హాజరుకావాలని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ విజ్ఞప్తి
- భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక నేత రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ (హెచ్‌కెఎస్) తొలిసారిగా నిర్వహించనున్న ''ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) పాలసీ సింపోజియం'' కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ప్రధాన వక్తగా ఆహ్వానించింది. ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సుకు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక నాయకుడిగా సిఎం రేవంత్ రెడ్డి నిలిచారు. వచ్చే మార్చి నెలలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ డీన్ జెరెమీ వైన్‌స్టీన్ తో కలిసి సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తరువాయి 2లో



### రైలు కింద పడి

## ముగ్గురు ఆత్మహత్య

- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారే
- చర్లపల్లి – ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఘటన

ప్రజాపక్షం/చర్లపల్లి

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైలు కింద పడి ఆత్మ హత్య చేసుకున్న విషాద ఘటన చర్లపల్లి–ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జిఆర్‌పి సిఐ సాయిఈశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల తరువాయి 2లో

## విచారణకు హాజరవుతా



### సిట్ అధికారులకు మాజీ సిఎం కెసిఆర్ లేఖ

- రెండోసారి నోటీసుపై తీవ్ర అభ్యంతరం
- చట్టప్రకారం ఇవ్వలేదని ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారుల విచారణకు ఆదివారం నందినగర్‌లోని తన నివాసంలో హాజరవుతానని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సిట్ అధికారులకు లేఖ పంపారు. అయితే సిట్ అధికారులు రెండోసారి ఇచ్చిన నోటీసులపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు. నాకు ఇచ్చిన నోటీసు అక్రమం. నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు. ఇంటి గోడలకు నోటీసులు అంటించడం ఏంటి. ఇది సరైన పద్ధతి కాదు. చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నా విచారణకు సహకరిస్తా. రేపు నందినగర్ నివాసంలో విచారణకు హాజరవుతా అని లేఖలో కెసిఆర్ పేర్కొన్నారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని ఈ సందర్భంగా సిట్ అధికారులకు కెసిఆర్ స్పష్టం చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎసిపికి తనను విచారించే అధికార పరిధి లేదని లేఖలో కెసిఆర్ పేర్కొన్నారు. 'నోటీసుల జారీలో సుప్రీంకోర్టు తరువాయి 2లో

## అత్యధిక స్థానాలే లక్ష్యం

- మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలి
- పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం





ప్రజాపక్షం/హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశనం చేశారు. ఈ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను విజయం సాధించేలా వ్యూహ రచనలు చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన నేతలతో జూమ్ సమావేశం నిర్వహించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు,డిసిసి అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్న తరువాయి 2లో

### 30 లక్షల ఎప్‌స్టీన్

## పత్రాలు విడుదల

వీడియోలు, ఫొటోలు కూడా

ట్రంప్, బిల్‌గేట్స్‌పై లైంగిక ఆరోపణలు

వాషింగ్టన్: అమెరికాలో వందలమంది పెద్దల జాతకాలను తన గుప్పెట్లో పెట్టుకుని ఆడించి చివరకు జైలులో మరణించిన జెఫ్రీ ఎప్స్టీన్ రహస్యంగా దాచిపెట్టిన లక్షలాది పత్రాలు, వీడియోలు, ఫోటోలను అనేక మలుపులు, వివాదాల తర్వాత అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ శనివారం విడుదల చేసింది. ఈ పత్రాలలో ప్రపంచ కుబేరుడు, మహాదాత బిల్‌గేట్స్ రష్యా భామలతో లైంగిక కార్యకలాపాలు నిర్వహించాడని, ఈ కారణంగా ఆయన సుఖ వ్యాధుల బారిన తరువాయి 12లో

## అడవితల్లుల వనప్రవేశం

- ప్రశాంతంగా ముగిసిన మేడారం జాతర
- తిరుగు ప్రయాణమైన భక్తులు
- మేడారం-పస్రా దారిలో భారీగా ట్రాఫిక్ జామ్





ప్రజాపక్షం/మేడారం /హనుమకొండ

నాలుగు రోజు పాటు ఉద్విగ్న భరితంగా సాగిన మేడరం సమ్మక్క సారలమ్మ మహాజాతర జాతర శనివారం తల్లుల వన ప్రవేశంతో ఘనంగా ముగిసింది. శనివారం సాయంత్రం సమ్మక్కను చిలకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి సాగనంపారు. సల్లంగ జూడు తల్లీ.. వెళ్లొస్తాం రెండేళ్లకు మళ్లీ.. అంటూ భక్తులు చివరి మొక్కులు మొక్కుకున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా అధికారుల సమక్షంలో అమ్మవార్లను వనప్రవేశం చేసే ఘట్టాన్ని పూర్తి చేశారు. జాతర నాలుగో రోజూ కూడా భారీగా లక్షలాది మంది తరలి వస్తుండడంతో మేడారం పరిసరాలన్నీ కిక్కిరిసి పోయాయి. జాతరలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనంతో రోజంతా కిటకిటలాడింది. కాగా శనివారం చివరి రూజు కూడ పలువురు వీఐపిలు సమ్మక సారలమ్మలనుదర్శనం చేసుకున్నారు. పలువురు రాష్ట్ర హైకోర్టు జడ్జీలు, డిఐజి తదితర అధికారులు సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. రాత్రి వరకూ దర్శనాల కోసం భక్తులు క్యూలో నిలబడ్డారు. ఇప్పటి వరకు ఒక కోటి 15 లక్షల మంది భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాక సమీప దక్షిణాది రాష్ట్రాల నుండి తరలి వచ్చినట్లు మేడారం జాతరను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం నాటికి మరో 5 లక్షల మంది భక్తులు తరలి రానున్నారన్న అంచనాలు వేశారు. దీంతో ఈసారి దాదాపుగా కోటికి పైగా మంది ప్రజలు తరలి వచ్చారని బావిస్తున్నారు. భక్తుల రద్దీ తగ్గితే ఆంక్షలను తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**జాతరలో నరకయాతన ; గంటల తరబడి జర్నీ**

తెలంగాణ కుంభమేళా, మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సర్కారు తరువాయి 12లో

### రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డు

## రేపు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం





- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేయనున్నట్లు తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రకటన
- ''భారత రాజ్యాంగం-భావప్రకటన స్వేచ్ఛ'' అనే అంశంపై స్మారకోపన్యాసం చేయనున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని, సిపిఐ అగ్రనేత రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డును 2025 సంవత్సరానికి గానూ దేశంలోఅనేక చారిత్రాత్మక తీర్పులను వెల్లువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప రెడ్డి ప్రకటించారు. అవార్డు ప్రదానోత్సవం ఫిబ్రవరి 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యాలయం రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరుగుతుందని, తరువాయి 12లో

## జిహెచ్‌ఎంసి బడ్జెట్ రూ.11,460 కోట్లు

- ఆమోదించిన పాలకమండలి
- మొక్కుబడిగా బడ్జెట్ సమావేశం
- బడ్జెట్‌పై సభ్యుల సందేహాలను నివృత్తి చేయని అధికారులు
- వాస్తవాలకు విరుద్ధంగా బడ్జెట్ : ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్
- అంకెల గారడీ : కార్పొరేటర్ శ్రవణ్





# ఇజ్రాయెల్ భారీ దాడి: 30మంది మృతి

## నేడు రఫా క్రాసింగ్ పునఃప్రారంభం

**గాజా :** గాజాపై ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగింది. శనివారం తెల్లవారుజాము నుండీ గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్‌లోని తాత్కాలిక గుడారాలపైన, గాజా వ్యాప్తంగా జరిపిన ఈ దాడుల్లో ఆరుగురు పిల్లలతో సహా 30 మంది పాలస్తీనియన్లు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. హమాస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గత ఏడాది అక్టోబరు 10వ తేదీన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ సైన్యం చేసిన అతిపెద్ద దాడి ఇదే. గుడారాలపై దాడులతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి, ఒకే కుటుంబంలో తండ్రి, ముగ్గురు పిల్లలు, మనుమలు మరణించారనీ నజీర్ ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. అదేవిధంగా షిఫా ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం, గాజా సిటీలోని అపార్ట్‌మెంట్ భవంతులపై జరిగిన



దాడుల్లో ముగ్గురు పిల్లలు మరణించారు. పోలీస్ స్టేషన్‌పై జరిపిన దాడిల్లో నలుగురు పోలీసులు సహా 11 మంది మరణించారు. రఫా క్రాసింగ్‌ను గాజాలోకి రాకపోకలకు వీలుగా పునఃప్రారంభించేందుకు రంగం సిద్ధమైన ఒకరోజు ముందు ఈ దాడులు జరిగాయి. ఈజిప్టు నుండి గాజాలోని నేరుగా వాహనాల రాకపోకలకు వీలుగా, సహాయాన్ని భారీ ఎత్తున తరలించేందుకు అవకాశం ఉన్న అతిపెద్ద అకాశమార్గమైన రఫా క్రాసింగ్‌ను 2024 మే నెలలోనే ఇజ్రాయెల్ సైన్యం మూసివేసింది. ఇప్పటివరకూ కొన్ని వందలసార్లు ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని హమాస్ అనేక సార్లు ఆరోపణలు చేస్తూ వచ్చింది. గత ఏడాది అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత నుండీ ఇజ్రాయెల్ సైన్య ం అనేక వంకలుపెడుతూ పాలస్తీనియన్లపై దాడులు చేసి హత మారుస్తూనే ఉంది. ఈ విధంగా 110 రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 509 మంది పాలస్తీనియన్లు బలయ్యారు. 2023 అక్టోబరు ఏడో తేదీన దాడుల పరంపర ప్రారంభమైన తర్వాత నుండి ఇప్పటివరకూ 72,000 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. మరో 1.72 లక్షలమంది గాయపడ్డారు. దాదాపు 10,000 మంది పైగా గాజాలో పేరుకుపోయిన శిథిల్లాల్లో కూరుకుపోయి విగతజీవులయ్యారు.

# న్యాయబద్ధమైన చర్చలకు సిద్ధం:ఇరాన్

**టెహ్రాన్ :** ఏ క్షణంలోనైనా యుద్ధ జ్వాలలు చెలరేగే పరిస్థితులు నెలకున్న పశ్చిమ ఆసియాలో నెలకున్న తరుణంలో న్యాయబద్ధమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఐతే ఈ చర్చలు న్యాయబద్ధంగా ఉండాలని ఇరాన్ విదేశీమంత్రి అబ్బాస్ ఆరాఘ్చి అన్నారు. అదేసమయంలో ట్రంప్ కూడా పాత్రికేయులతో శనివారం మాట్లాడుతూ, ఇరాన్ చర్చలకు సుముఖంగా ఉందని ప్రకటించారు. అమెరికాతో అణు ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే యుద్ధాన్ని ఎదుర్కొవాలని గడచిన కొద్ది రోజులుగా ట్రంప్ తన బెదిరింపులను తీవ్రతరం చేశారు. యుద్ధం వస్తే దీటుగా ప్రతిఘటించేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు ఇరాన్ కూడా ఇప్పటికే పలుసార్లు స్పష్టం చేసినప్పటికీ ఐక్యరాజ్యసమితికి కూడా ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించమని కోరింది. న్యాయబద్ధమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఆరాఘ్చి ప్రకటించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఐదు విడతలుగా అమెరికా–ఇరాన్ మధ్య అణు చర్చలు కొనసాగినప్పటికీ ఫలించలేదు. కాగా ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కూడా ప్రభుత్వ టెలివిజన్‌లో జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇరాన్‌లో గత ఏడాది డిసెంబరు 28 నుండి 18 రోజులపాటు కొనసాగిన అల్లర్లను అమెరికా,ఇజ్రాయెల్,యూరోపియన్ యూనియన్‌లే రెచ్చగొట్టాయని విమర్శించారు. తమదేశంలో హింసాత్మక అల్లర్లను రెచ్చగొట్టడం ద్వారా ఉద్రిక్తతలు సృష్టించాయని విమర్శించారు. "అనేకమంది అమాయకులైన ప్రజలు ఆయుధాలు సమకూర్చుకుని వీధుల్లోకి వచ్చేలా చేశారు, ప్రజలమధ్య తగాదాలు,ద్వేషం సృష్టించి దేశాన్ని విభజించడానికి ప్రయత్నం చేశారు" అని విమర్శించారని అధికారిక స్టూడెంట్ న్యూస్‌నెట్‌వర్క్ ప్రకటించింది.

# అమెరికా ఆంక్షలకు క్యూబా తిరస్కృతి

## చైనా సహా పలు దేశాల మద్దతు

**హవానా :** క్యూబాపై అమెరికా విధించిన తాజా ఆంక్షలను క్యూబా కమ్యూనిస్టుపార్టీ మొదటి కార్యదర్శి, ఆ దేశ అధ్యక్షుడు మిగ్యుల్ డయాజ్ కానెల్ తిరస్కరించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తమ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టుకుంటామన్నారు. క్యూబాను అస్థిరీకరించేందుకు ఈ ఆంక్షలను ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈనెల 29వ తేదీన ట్రంప్ వైట్‌హౌస్ నుండి క్యూబాపై అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇప్పటికే క్యూబా ఆరు దశాబ్దాలుగా ఆంక్షల నిర్బంధంలో ఉంది. క్యూబా వల్ల అమెరికా జాతీయ భద్రతకు ముప్పు ఉందని, అంతర్జాతీయ ఉగ్రవాద గ్రూపులు, దుష్టశక్తులతో క్యూబా సంబంధాలు కొనసాగిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ట్రంప్ సంతకం చేసిన ఉత్తర్వులు శుక్రవారం నుండి అమలులోకి వచ్చాయని క్యూబా అధికార పత్రిక ప్రకటించింది. వెనిజులాపై దాడి తర్వాత క్యూబాకు తీవ్ర సరఫరా సమస్యలు ఎదురయ్యాయి. అమెరికా విధించిన కొత్త ఆంక్షలను వ్యతిరేకిస్తూ చైనా సహా పలు దేశాలు క్యూబాకు మద్దతు ఇచ్చాయి. చైనా విదేశాంగమంత్రి గువో జయాకున్ బీజింగ్‌లో రోజువారీ పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించారు. క్యూబాపై ఆంక్షలు తక్షణం ఎత్తివేయాలని కోరారు. క్యూబా ప్రజలు తమ దేశాన్ని అభివృద్ధిచేసుకునే హక్కులను అమెరికా హరిస్తోందని విమర్శించారు. లాటిన్ అమెరికాలో శాంతి స్థిరత్వానికి విఘాతం కలగకుండా అటంకాలను తొలగించాలని ఆయన కోరారు. వాషింగ్టన్ అనుసరిస్తున్న బలవంతపు విధానాలవల్ల క్యూబాకు ఈ పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా ఎలాంటి ఆటంకాలు, సమస్యలు సృష్టించినాగానీ వాటిని అధిగమించగల శక్తిసామర్థ్యాలు, ఐక్యత క్యూబా ప్రజలకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. టంప్ మరోసారి అబద్ధాల ప్రచారానికి తెరతీశారని, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే పేరుతో సామూహిక ఆర్థిక ఊచకోతకు పాల్పడుతోందని క్యూబా విశ్లేషకులు విమర్శించారు. ఉగ్రవాదులతో క్యూబా చేతులు కలపలేదని, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థలకు బాసటగాలేదని అమెరికాకు తెలుసునని, అనేక దశాబ్దాలుగా క్యూబాను లొంగతీసుకునేందుకు ఇదే నాటకం కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు.




# అమెరికాకు మళ్లీ షట్‌డౌన్ సమస్య

**వాషింగ్టన్ :** అమెరికాను మళ్లీ షట్‌డౌన్ సమస్య వెంటాడుతున్నది. సోమవారం సెనెట్ సమావేశంలో ఆర్థిక బిల్లులను గనుక ఆమోదించకపోతే మళ్లీ అమెరికాలోని అనేక ప్రభుత్వ విభాగాలు షట్‌డౌన్‌లోకి వెళ్లే ప్రమాదం వచ్చింది. ఇంతకు ముందు ఆర్థిక కేటాయింపులకు గడువు అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రితో పూర్తి కావడంతో పాక్షికంగా షట్‌డౌన్ ప్రారంభమైంది. సోమవారం సమావేశంలో బిల్లులు ఆమోదం పొందకపోతే మళ్లీ సమస్య ముదిరిపాకాన పడుతుంది. ఐతే దేశంలో ట్రంప్ పట్ల ఉన్న వ్యతిరేకత, వలస విధానంలో లోపాలు,ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, ముఖ్యంగా మిన్నెపొలిస్‌లో ఐసిఇ ఏజెంట్ల చేతుల్లో ఇద్దరు హత్యకు గురికావడం ఈ నేపథ్యంలో సెనేటర్లు ప్రధానాంశంగా ముందుకు తెచ్చారు. ఈ హత్యల విషయంలో దర్యాప్తు నిష్పాక్షికంగా జరగాలని, విధాన మార్పులుండాలని కొందరు డెమోక్రటిక్ సెనేటర్లు హెచ్చరిస్తున్నారు. లేకపోతే వారు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. దీనివల్ల మళ్లీ ముఖ్యమైన హోం,భద్రతా విభాగాలు, ఇతర అత్యవసరంలేని విభాగాల ఉద్యోగులు వేతనం లేని సెలవులతో ఇళ్లల్లో కూర్చోవలసి వస్తుంది. గత ఏడాది అక్టోబరులో కూడా అమెరికా చరిత్రలో ఎన్నడూలేని రీతిలో షట్‌డౌన్ కుదిపేసి ట్రంప్ ప్రభుత్వ అసమర్థతకు తార్కాణంగా నిలిచింది. అమెరికాలో ఎన్నడూలేనివిధంగా 43 రోజులు సుదీర్ఘకాలం షట్‌డౌన్ కొనసాగింది. ట్రంప్ వైఖరి కారణంగా అధికార, ప్రతిపక్షాలమధ్య ఒక ఒప్పందం కుదరలేదు.

**వలస సమస్యపై అమెరికావ్యాప్తంగా ప్రదర్శనలు**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాన్ని ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. స్కూళ్లు, దుకాణాలు మూతపడ్డాయి. ప్రధానంగా హ్యూస్ట న్, బోస్టన్‌లలోని పలు ప్రాంతాలలో ఐసిఇకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల్లో వందలమంది పాల్గొన్నారు. మిన్నెపొలిస్‌లో కూడా గడచిన 20 రోజులుగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రముఖ రాజకీయ నేతలు, సెనేటర్లు, మేధావులు, మానవహక్కుల సంఘాలు మిన్నెపొలిస్‌లో ఐసిఇ ఏజెంట్లు చేసిన రెండు హత్యలను తీవ్రంగా పరిగణిస్తూ ఉండటంతో ట్రంప్ కూడా దిగివచ్చారు. ఈ ఘటన అత్యంత విషాదకరమైనదని ఆయన అన్నారు. ఐసిఇ అధికారుల చర్యలపై భిన్న కథనాలు వినిపిస్తూ ఉండటంతో దర్యాప్తును ముమ్మరం చేశారు. నిరాయుధుడైన అమెరికన్ పౌరుడు, వృద్ధాశ్రమంలో నర్సుగా పనిచేస్తున్న అలెక్స్ ప్రెట్టీ హత్య అమెరికన్లను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది. రోజులు గడుస్తున్నప్పటికీ సమస్య మరపు లేకుండా వారిని కుదిపేస్తోంది.

# చైనాతో వ్యాపారం చేయకపోవడమే మూర్ఖత్వం





## ట్రంప్‌కు కీర్ స్టార్మర్ చురక

**లండన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శలు,హెచ్చరికలమధ్య బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మూడు రోజుల చైనా పర్యటన విజయవంతంగా ముగిసింది. షాంఘై పర్యటన తర్వాత ఆయన లండన్‌కు తిరిగి చేరుకున్నారు. చైనాతో వ్యాపారం అత్యంత ప్రమాదకరమని ట్రంప్ చేసిన ఆరోపణలు,హెచ్చరికలను స్టార్మర్ కొట్టిపారేశారు. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాతో వ్యాపారం ప్రమాదకరం అని ట్రంప్ చెప్పగా, అంతపెద్ద ఆర్థిక వ్యవస్థతో వ్యాపారం చేయకపోవడమే పెద్ద మూర్ఖత్వమని స్టార్మర్ అన్నారు. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై చైనాతో చర్చిస్తే 100 శాతం సుంకాలు విధిస్తానని కెనడా ప్రధానమంత్రికి ట్రంప్ చేసిన హెచ్చరికను పదే పదే ఆయన ప్రస్తావిస్తున్నారని స్టార్మర్ విమర్శించారు. రెండు బిలియన్ డాలర్ల ఎగుమతులను, పెట్టుబడులను తన పర్యటన సాధించిందన్నారు. చైనాలో తన పర్యటన వాస్తవ ప్రాతిపదికపై చూసినప్పుడు విజయవంతంగా ముగిసిందని అన్నారు. అంతకంటే ముఖ్యంగా చైనా మార్కెట్లను అనుసంధానం చేసుకున్నామన్నారు. చైనా ప్రపంచంలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అనీ, హాంగ్‌కాంగ్‌ను కూడా కలుపుకుని చూసినప్పుడు కూడా ఒక నిప్పుకోడి తరహాలో తలను తలక్రిందులుగా ఇసుకలో దూర్చుకుని కూర్చోవడం, మనం వారితో వ్యాపారం చేయకుండా దూరంగా ఉండిపోవడం మూర్ఖత్వమే అవుతుందని అన్నారు. ట్రంప్‌తో ఇటీవలికాలంలో స్టార్మర్ విభేదిస్తూ వస్తున్నారు. మొదట గ్రీన్‌లాండ్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడంపై విభేదించారు. రెండోసారి ఆఫ్ఘనిస్థాన్‌లో నాటో కూటమి దళాలు ముందుపీఠిన నిలబడిన పోరాడకుండా తప్పించుకున్నాయని ట్రంప్ చేసిన ఆరోపణలను వ్యతిరేకించారు. ఆ తర్వాత చైనా పర్యటన విషయంలో కూడా ట్రంప్ అభిప్రాయాలతో స్టార్మర్ ఏకీభవించకుండా విభేదించారు.

## విచారణకు హాజరవుతా (మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారన్నారు.. ఎన్నికల అఫిడవిట్లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదన్నారు. ప్రస్తుతం నివసిస్తున్న చోటే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోందన్నారు. హరీష్ రావు నోటీసుల విషయంలో పోలీసులు డబుల్‌స్టాండరడ్స్ పాటిస్తున్నారన్నారు. 'పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తా. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధం. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటా. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చు. కానీ నేను ఆపని చేయడం లేదు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచన చేస్తున్నాను. పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయి' అని లేఖలో కేసీఆర్ ఆవేదన చెందారు. అంతేకాదు.. ఏపీ హైకోర్టులోని 'పీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు.

**నందినగర్‌లోనే విచారణ..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం విచారణకు కెసిఆర్ హాజరవుతారని తెలపడంతో నందినగర్‌ను పోలీసులు దిగ్బంధం చేశారు. కెసిఆర్ నివాసానికి కిలో మీటర్ దూరం వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.బిఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తారనే సమాచారం మేరకు పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ముగ్గురు ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

ప్రకారం బోడుప్పల్ హరితరణం కాలనీకి చెందిన విజయశాంతిరెడ్డి(38)కు మార్తె చేతనరెడ్డి, కుమారుడు విశాల్‌రెడ్డిలు చర్లపల్లిఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య 206/48 కిలోమీటర్ బోర్డు వద్ద 12.30 గంటలకు రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందారని గూడ్స్‌రైలు లోకో పైలట్ వాకీటాకీ ద్వారా రైల్వే స్టేషన్ మాస్టర్ సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిఆర్‌పి సిఐ సాయిఈశ్వర్‌గౌడ్, ఎస్‌మాధవ్, ఏఎస్‌ఐ బిఎస్‌రావులు సంఘటన స్థలానికి చేకుకుని పరిశీలించి మృత దేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు విజయశాంతిరెడ్డి సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం చేస్తుంది. కుమార్తె ఇంటర్ సెకండ్ ఇయర్, కుమారుడు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. భర్త దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.10 గంటలకు రైల్వే స్టేషన్‌లో కారు(టిఎస్ 08 జెసి 5224)పార్కింగ్ చేసి స్టేషన్ ప్లాట్‌ప్లారంపై 11.20 గంటలకు నడుచుకుంటు వెళ్లి 12 గంటలకు రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందారు. 194 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్థానాలే లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో పార్టీ వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం , ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధికి సంబంధించిన ప్రచారం తదితర కీలక అంశాలపై చర్చించారు. నామినేషన్ల పర్వం ముగిసిన నేపథ్యంలో ఇకా ప్రచారంపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని, ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా నామినేషన్ల దాఖలు చేసిన అసంతృప్తి నాయకులను బుజ్జగించడంతో పాటు బలమైన అభ్యర్థులు బరీలో ఉండేలా చూడాలన్నారు. అత్యధిక స్థానాలను గెలుపోందడమే లక్ష్యంగా పార్టీ నాయకులంతా అందరూ కలిసి కట్టుగా ఏకతాటిగా పని చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనం చేశారు.

## సిఎంకు ఆహ్వానం (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా కీ నోట్ ప్రసంగం ఇవ్వడాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే, కృత్రిమ మేధస్సు (ఎఐ) మౌలిక వసతులు, విధానాలపై ప్రపంచ స్థాయి నేతలు, టెక్ నిపుణులతో జరిగే ప్యానల్ చర్చలలో పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన సమావేశంలో స్కూల్ ప్రతినిధి రుక్సాండా రెనిటాతో పాటు ఇతర నిర్వాహకులు సిఎం రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా ఆహ్వాన పత్రం అందజేశారు. ఎఐ పాలసీ రూపకల్పనలో ప్రపంచ స్థాయిలో జరుగుతున్న చర్చల్లో తెలంగాణ నాయకత్వానికి లభించిన ఈ ఆహ్వానం రాష్ట్రానికి గర్వకారణమని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# జిహెచ్‌ఎంసి బడ్జెట్ రూ.11,460 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రస్తుత పాలక మండలి చిట్టచివరి బడ్జెట్ సమావేశం జరిగింది. ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనున్న నేపథ్యంలో శనివారం నిర్వహించిన చివరి పాలక మండలి సమావేశం ఉద్వేగభరిత వాతావరణంలో ముగిసింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల అంచనా బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం తెలిపింది. శనివారం ఉదయం 11 గంటలకు మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో ఇటీవల అకాల మరణం చెందిన చంపాపేట్ బిజెపి కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డికి సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించింది. ప్రజా సమస్యలపై ఆయన చేసిన సేవలను సభ్యులు గుర్తు చేసుకున్నారు. బడ్జెట్‌పై అన్ని పార్టీల సభ్యులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వాస్తవాలకు విరుద్ధంగా అంకెల గారడీగా బడ్జెట్ ఉందని ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తీవ్ర స్థాయిలో ఆంక్షేపించారు. వాస్తవాలకు విరుద్ధంగా బడ్జెట్ ఉందని బిఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్ సామల హేమ అన్నారు. అప్పుల్లో కూరుకపోయిన జిహెచ్‌ఎంసికి సిఎం రేవంత్ రెడ్డి నిధులు కేటాయించి, అభివృద్ధి పథంలో తీసుకెళ్లుతున్నారని కాంగ్రెస్ ఉప్పల్ కార్పొరేటర్ రజిత రెడ్డి తెలిపారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు సిఎం, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, చివరికి మేయర్ నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ కోరారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకుంటామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హామీ ఇవ్వడంతో, మేయర్ పాలకమండలి సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేశారు. సభ్యులు బడ్జెట్‌పై లేవనేత్తిన వివిధ అంశాలకు అధికారులు నిర్ధిష్టమైన సమాధానాలు ఇవ్వకుండానే సమావేశం ముగించడం గమనర్హం. దీంతో బడ్జెట్ భేటీ మొక్కుబడి సమావేశంగా ముగిసింది.

**కాంగ్రెస్– బిఆర్‌ఎస్ మధ్య మాటల యుద్ధం**

సమావేశం చివరిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కెసిఆర్ హయాంలో జిహెచ్‌ఎంసి అప్పుల పాలైందని, ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్ రజిత రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. దీనికి బిఆర్ఎస్ సభ్యులు తీవ్రంగా స్పందించడంతో సభలో కొద్ది సేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మేయర్ గద్వాల విజయలక్ష్మి జోక్యంతో ఇరు వర్గాలు శాంతించడంతో సమావేశం తిరిగి కొనసాగింది.

మేయర్ గద్వాల విజయలక్ష్మి భావోద్వేగ ప్రసంగం

ఇది తనకు చివరి కౌన్సిల్ సమావేశమని పేర్కొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మి భావోద్వేగానికి లోనయ్యారు. 'ఇది భావోద్వేగ క్షణం. ఐదేళ్ల పదవీ కాలంలో నగరాభివృద్ధికి అందరం కలిసి పనిచేశాం. ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు సమర్థంగా పని చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు కూడా అందుకున్నాం. నా మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరుకుంటున్నాను. పదవి ముగిసినా నా బాధ్యత మరువను. హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందేందుకు నా వంతు కృషి చేస్తాను' అని మేయర్ అన్నారు.

**ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ వ్యాఖ్యలు**

రూ.11,460 కోట్ల భారీ బడ్జెట్‌ను ఆమోదించినందుకు మేయర్, కమిషనర్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. 'ఇంత పెద్ద బడ్జెట్ కేటాయించిన తర్వాత నగరంలోని ప్రతి గల్లీలో రోడ్లు, నాలాల శుభ్రత, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కావాలి. బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫలితాలు అందించాలి' అని అన్నారు. గ్రీన్ బడ్జెట్‌లో రూ.590 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించిన ఆయన, నల్లగండ్ల ప్రాంతంలో పెద్ద థీమ్ పార్కుతో పాటు మరో రెండు థీమ్ పార్కుల ప్రతిపాదనను ప్రస్తావించారు. పాలకమండలి ముగిసిన అనంతరం మూడు కార్పొరేషన్‌లుగా జిహెచ్‌ఎంసిని విభజిస్తారనే ప్రచారం జరుగుతుందని, మరి మూడు కార్పొరేషన్‌లకు ఈ బడ్జెట్‌ను ఏవిధంగా విభజిస్తారని ప్రశ్నించారు. 20 సంవత్సరాలుగా ఆస్తిపన్ను పెంచడం లేదని చెప్పుతునే రీవిజన్ పేరుతో భారీ మొత్తంలో ఆస్తిపన్ను పెంచుతున్నారని విమర్శించారు.

## బడ్జెట్ ముఖ్యాంశాలు..

మొత్తం బడ్జెట్ అంచనా: రూ.11,460 కోట్లు
రెవెన్యూ ఆదాయం : రూ.6,441 కోట్లు
క్యాపిటల్ రిసీట్స్ : రూ.5,019 కోట్లు
మొత్తం ఖర్చు : రూ.4,057 కోట్లు
రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు
జిహెచ్‌ఎంసికి రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లు
కొత్తగా విలీనమైన మున్సిపాలిటీలకు కేటాయింపులు : రూ.2,260 కోట్లు
విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన ఆదాయం : రూ.1,860 కోట్లు
గ్రీన్ బడ్జెట్ కేటాయింపు : రూ.590 కోట్లు
భూసేకరణకు : రూ.250 కోట్లు
ఇళ్ల నిర్మాణానికి : రూ.100 కోట్లు.

**విలీన మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై స్పష్టత ఇవ్వాలి : బిజెపి కార్పొరేటర్ శ్రవణ్**

జిహెచ్‌ఎంసి బడ్జెట్ మొత్తం అంకెల గారడీగా ఉందని బిజెపి కార్పొరేటర్ శ్రవణ్ విమర్శించారు. 27 అర్బన్ స్థానిక సంస్థలను విలీనానికి సంబంధించిన అప్పులు, వడ్డీ రేట్లు, ఆదాయ, వ్యయాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. విలీన మున్సిపాలిటీల ఉద్యోగుల జీతాల విషయంలో సమాన విధానం పాటించాలన్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కమర్షియల్ ప్రాపర్టీలు, రెంటల్ ఆదాయంపై పన్నుల వసూలు పెంచాలని సూచించారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన ఈ బడ్జెట్‌లో నగరాభివృద్ధి, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు.

## దిశ ఎటు? (మొదటి పేజీ తరువాయి)

అడుగులు వేయాలి. వినియోగం పెరగాలంటే ప్రజల చేతిలో డబ్బు ఉండాలి. అది స్థిరమైన ఉపాధి ద్వారానే సాధ్యం.యువత ఎక్కువగా ఉన్న మన దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. కానీ పరిశ్రమలు, సేవల రంగం ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యోగాలను సృష్టించలేకపోతున్నాయి. ఈ బడ్జెట్‌లో కార్మిక ఆధారిత తయారీ రంగాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పిఎల్ఐ) వంటి పథకాలను కేవలం ఉత్పత్తి పరిమాణంతో కాకుండా, ఉద్యోగ సృష్టి ప్రమాణాలతో అనుసంధానం చేయడం ఒక కీలక సంస్కరణగా నిలుస్తుంది. అలాగే నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలకు మరింత నిధులు కేటాయించడం ద్వారా యువతను ఉపాధికి సిద్ధం చేయాలి. కాగా, దేశ ఉపాధిలో పెద్ద వాటా ఈ రంగానిదే. కానీ అధిక ముడి సరుకు ధరలు, రుణాల లభ్యత లోపం, అంతర్జాతీయ పోటీ వంటి కారణాలతో ఈ రంగం ఒత్తిడిలో ఉంది. ఈ బడ్జెట్‌లో ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారంటీ పథకాలను విస్తరించడం, సులభమైన నిబంధనలతో రుణాలు అందించడం అత్యవసరం. కేవలం పెద్ద పెద్ద కార్పొరేట్లపై ఆధారపడే వృద్ధి నమూనా సామాజికంగా, ఆర్థికంగా స్థిరంగా ఉండదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలే విస్తృత ఉపాధిని అందించగలవు. ఇక, అమెరికాతో వాణిజ్య చర్చలపై ఉన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, రూపాయి చరిత్రలో కనిష్ట స్థాయికి చేరడం తదితర అంశాలన్నీ భారత ఆర్థిక స్థిరత్వంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. భారతదేశం విధాన స్థిరత్వాన్ని, సంస్కరణల నిరంతరతను వదలదని ఈ బడ్జెట్ మార్కెట్లకు, పెట్టుబడిదారులకు ఒక స్పష్టమైన సంకేతం ఇవ్వాలి. పన్ను విధానంలో ఆకస్మిక మార్పులు కాకుండా, నియంత్రణ సరళీకరణ, వ్యాపార వాతావరణ మెరుగుదల ద్వారా పెట్టుబడిదారుల నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది.ఆదాయ వనరుల సమీకరణ కేంద్ర ఆర్థిక మంత్రి ముందు ఉన్న అతి పెద్ద సవాళ్లలో ఒకటి. పన్ను ఆదాయం పరిమితంగా పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలపై ఎక్సైజ్ డ్యూటీని పెంచే మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉంది. ఇది తాత్కాలికంగా ఖజానాకు ఊరటనిచ్చినా, దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ మార్గాన్ని చాలా జాగ్రత్తగా ఉపయోగించాలి. ఆదాయాన్ని పెంచేందుకు పన్ను పరిధిని విస్తరించడం, పన్ను ఎగవేతలను తగ్గించడం, డిజిటలైజేషన్ ద్వారా అనుసరణను మెరుగుపరచడం తదితర మరింత పటిష్టమైన పరిష్కాలను సూచించాలి. ఇలా వుంటే, పునరుత్పాదక శక్తి, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి రంగాల్లో భారత్ పెద్ద లక్ష్యాలను పెట్టుకుంది. కానీ, ఈ మార్పు కోసం భారీ పెట్టుబడులు అవసరం. అదే సమయంలో చమురు, వాయువు వంటి సంప్రదాయ శక్తి వనరులపై ఆధారాన్ని పూర్తిగా వదిలేయలేని పరిస్థితి. ఈ బడ్జెట్ ఈ రెండు అవసరాల మధ్య సమతుల్యత సాధించాలి. దేశీయంగా గ్రీన్ టెక్నాలజీ తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతి ఆధారాన్ని తగ్గిస్తే, అది ఉపాధి సృష్టికి కూడా దోహదం చేస్తుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ బడ్జెట్‌పై రాజకీయ ఒత్తిళ్లు సహజం. సంక్షేమ పథకాలకు డిమాండ్ పెరుగుతుంది. కానీ సంక్షేమం, ద్రవ్య వినిమయ క్రమశిక్షణ మధ్య సమతుల్యత తప్పనిసరి. తాత్కాలిక రాజకీయ లాభాల కోసం దీర్ఘకాలిక ఆర్థిక ఆరోగ్యాన్ని త్యాగం చేయకూడదు. సంక్షేమ పథకాలను ఉత్పాదక ఆస్తుల సృష్టితో అనుసంధానం చేయగలిగితేనే అవి ఆర్థికంగా నిలకడగా ఉంటాయి. మొత్తానికి, 2026–27 బడ్జెట్ ముందు ఉన్న సవాళ్లు సాధారణమైనవి కావు. ఇది కేవలం సంఖ్యల పత్రం కాదు.. ఒక వ్యూహాత్మక ప్రకటన కావాలి. కొత్త వృద్ధి డ్రైవర్లు, ఉపాధి సృష్టి, పెట్టుబడిదారుల విశ్వాసం, గ్రీన్ మార్పు, ఫిస్కల్ క్రమశిక్షణ వంటివన్నీ ఒకే తాటిపై నడిపించాల్సిన బాధ్యత ఈ బడ్జెట్‌పై ఉంది. ఆశ్చర్యాలకన్నా స్థిరత్వం, పాపులిజం కన్నా బాధ్యత, తాత్కాలిక ఊరటనిచ్చే చర్యల కన్నా దీర్ఘకాలిక సంస్కరణలు అత్యవసరం. ఆ దిశగానే బడ్జెట్ ఉండాలి. అప్పుడే, ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ తన వృద్ధి ప్రయాణాన్ని కొనసాగించగలుగుతుంది.

## అప్పకోసం మిత్రుదేశాల ముందు.. తప్పని పరిస్థితిలో తల వంచాం: పాక్ ప్రధాని

**ఇస్లామాబాద్ :** అప్పులు చేయడంకోసం దేశాల ఎదుట తప్పనిసరి పరిస్థితుల్లో తల దించామని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అన్నారు. ఇస్లామాబాద్‌లో ప్రముఖ వ్యాపారవేత్తలు, ఎదుగమతిదారులతో జరిగిన ఒక సమావేశంలో షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ, పాకిస్థాన్ దివాళా పరిస్థితులను ఎదుర్కొందని, అలాంటి సంక్లిష్ట సమయంలో దిక్కుతోచనిస్థితిలో మిత్ర దేశాల ముందు అప్పుకోసం నిలబడ్డామని, ఈ సందర్భం తమను కుమిలిపోయేట్టు చేసిందని గుర్తుచేసుకున్నారు. పాకిస్థాన్ ప్రధానంగా చైనా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, సౌదీ అరేబియా దేశాలను అప్పుకోసం ఆశ్రయించింది. అడిగినప్పుడు మి త్రదేశాలు లేదనకుండా అప్పులు ఇచ్చాయన్నా రు. సాంకేతికంగా దేశం డీఫాల్ట్ పరిస్థితుల్లో ఉండగా తాము మిత్రదేశాల దగ్గరకు వెళ్ళి అప్పులు అడిగామని, అలా అడగడం తమకు సిగ్గనిపించినా తప్పలేదన్నారు. "మేం అధికా రం స్వీకరించిన నాటికి దేశంలో ఆర్థిక పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి, కుప్పకూలేపరిస్థితికి వచ్చాయి, సామా న్య ప్రజలు భయంకరమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు" అన్నారు. 2023లో పా రి స్‌లో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని షెహబాజ్ షరీఫ్ గుర్తుచేసుకున్నారు. ఐఎంఎఫ్ అప్పును ఖరా రు చేసిన తర్వాత దేశంలో పరిస్థితులు కొంతమేరకు కుదుటపడ్డాయన్నారు. కష్టకాలంలో ఉండగా మిత్రదేశాలు పాకిస్థాన్‌కు పూర్తి అండదండగా నిలిచాయన్నారు. ఆనాడు తాను దేశ సైన్యాధిపతి,రక్షణబలగా ప్రధానాధిపతి, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో కలిసి మిత్రులవద్దకు వెళ్లానని, అనేక దేశాల నాయకులను కలిసి అప్పు కోసం అడిగామన్నారు. "మిత్రులైనప్పటికీ ఏ విధంగా మేం అప్పుడు అడగగలం? వారు మమ్మల్ని నిరాశపరచలేదు, కానీ అలా అప్పు అడగడం తలవంపులు అనిపించింది" అన్నారు. "మనం అప్పుడు అడిగినప్పుడు మ నం మూల్యం చెల్లించాలి, వారు ఏమి అడిగానాసరే ఒప్పుకోవాల్సిన పరిస్థితి, దానని మనం అమలు చేయాలి" అన్నారు. విదేశీ మారకద్రవ్యంకోసం, అప్పులు తీర్చడంకోసం నాలుగు మిత్రదేశాలను ఆశ్రయించామన్నారు. ఈ స మావేశంలో ఆయన పరిశ్రమలకు కొన్ని రాయితీలు ప్రకటించారు. విద్యుత్ టారిఫ్‌లపై రాయి తీ ఇచ్చారు.

# నేటి విద్యార్థులే రేపటి నాయకులు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేటి విద్యార్థులే రేపటి కాబోయే నాయకులు, రాయబారులని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. హైదరాబాద్‌లోని బిజెఆర్ భవన్‌లో శనివారం పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఐవిజన్ యూత్ పార్లమెంట్–2025 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, గౌరవ అతిథిగా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దేశం రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించే అత్యున్నత ప్రజాస్వామ్య సంస్థలని పేర్కొన్నారు. విద్యార్థులు రూపొందించిన వైట్ పేపరును ఆయన భవిష్యత్తు కోసం ప్రస్తుత తరగతి ఆశలు ప్రతిబింబించే ఆకాంక్ష పత్రంగా అభివర్ణించారు. ఈ వైట్ పేపర్‌లో సమకాలీన పరిపాలన, అభివృద్ధి అంశా లు ప్రతిబింబించాయని, బాలికల విశేష భాగస్వామ్యం ప్రశంసనీయం అని అన్నారు. మహిళా సాధికారత భారతదేశంలో నిశ్శబ్దమైన విప్లవాత్మక ప్రజాస్వామ్య మార్పుగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయాల నాణ్యతను మెరుగుపరచడానికి యువత పాల్గొనడం అత్యవసరమని అన్నారు. విద్యార్థి రాజకీయాల నుండి ప్రజా జీవితానికి తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, చదువుకున్న, అవగాహన కలిగిన యువత ప్రజాస్వామ్య సంస్థలతో అనుసంధానం కావాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంట్, మాక్ అసెంబ్లీ, మోడల్ యునైటెడ్ నేషన్స్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు శాసనసభల పని తీరు, ప్రజా విధానం, పరిపాలనపై ఆచరణాత్మక అవగాహన కల్పిస్తాయని, బాధ్యతాయుతమైన భవిష్యత్ నాయకత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ, ఐవిజన్ యూత్ పార్లమెంట్ పఠన పద్ధతి విధానాన్ని దాటి, తరగతి గదులను ప్రజాస్వామ్యానికి జీవంతమైన ప్రయోగశాలలుగా మార్చే లక్ష్యంతో రూపొందించబడిందని తెలిపారు. విద్యార్థులు ఆలోచించడం, ప్రశ్నించడం, చర్చించడం, సహకరించడం, నాయకత్వం వహించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమం జిల్లా విద్యాధికారి రోహిణి, ఇక్షణా మార్కెటింగ్ ప్రతినిధులు అంజలి గుప్తా, అంకుర్ గుప్తా, రోటరీ లేక్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు సునీల్ సరాఫ్, రాజ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హార్వర్డ్‌లో చివరి రోజు బిజీగా సిఎం రేవంత్ రెడ్డి

విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో విస్తృత పరస్పర చర్చలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** '21వ శతాబ్దపు లీడర్షిప్ కోర్సు'ను చేసేందుకు అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్ళిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కోర్సు పూర్తి చేసిన చివరి రోజున పలువురు ప్రతినిధి బృందాలు, వివిధ విభాగాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. హార్వర్డ్‌కు చెందిన వివిధ స్కూళ్ల విద్యార్థులతో పాటు ఎంఐటి, కొలంబియా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాయకత్వం, విజయ సాధన, ఆర్థిక వృద్ధి అభివృద్ధి నమూనాలు, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, రైతులు, మహిళలు, యువతకు సంక్షేమం వంటి పలు అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. సిఎం రేవంత్ రెడ్డి తన దృష్టి కోణం, ఎదుర్కొంటున్న సవాళ్లు, రాష్ట్ర భవిష్యత్తుకు రూపురేఖలు చూపించే 'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ – 2047' గురించి వివరించారు. ఈ విజన్ ద్వారా అన్ని వర్గాల భాగస్వామ్యానికి, సాధికారతకు కలిగే అవకాశాలను ఆయన విశదీకరించారు. నాయకత్వం, విజన్ గురించి చెప్పాలని విద్యార్థులు కోరగా, 'హార్వర్డ్‌లోని ప్రతిష్టాత్మక అధ్యాపకులే బోధించడం సముచితం. నేను ఉపాధ్యాయుడిలా నటించదలుచుకోలేదు. పరస్పర సంభాషణల ద్వారా పంచుకోవడం, నేర్చుకోవడమే నాకు ఇష్టం' అని సిఎం పేర్కొన్నారు. రెండు వైపులా ఆలోచనల మార్పిడి జరిగే చర్చలకే తాను ప్రాధాన్యం ఇస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. భారతదేశ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేసిన సిఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ,హైదరాబాద్ దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ముందుండబోతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు భారత్‌తో, ముఖ్యంగా తెలంగాణతో అనుసంధానమై పనిచేయాలని, 'తెలంగాణ రైజింగ్'కు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని సిఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, అల్మనీలు తెలంగాణ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని సిఎంకు హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని అఫిడవిట్ తీసుకురావాలి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే మన ప్రాణాలను రక్షించుకోవడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాలను కూడా కాపాడుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అలియా ప్రభుత్వ మోడల్ పాఠశాలలో రూ.14 లక్షల రూపాయలతో నిర్మించిన చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సడక్ సురక్షా అభియాన్ నినాదంతో ఈ సంవత్సరం 10 లక్షల మందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 1872లో ప్రారంభించిన హిస్టారికల్ అలియా స్కూల్‌లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌ను ప్రారంభించుకున్నామనీ, జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం ఇక్కడ జరుపుకోవడం గర్వకరణామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఖచ్చితంగా మోటార్ వెహికల్స్ యాక్ట్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. త్వరలో ప్రతి పిల్లవాడు, విద్యార్థి విద్యార్థినులు వారి తల్లిదండ్రుల వద్ద మేము ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తాం అని అఫిడవిట్ తీసుకురావాలని కోరారు. యూనిసెఫ్ సహకారంతో పాఠశాలల్లో ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయో అక్కడ ఎస్‌డిఎఫ్ నిధులతో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి మాట్లాడుతూ రోడ్డు భద్రతా అందరికీ చాలా ముఖ్యమైందన్నారు. తెలంగాణలో సంవత్సరానికి 7 వేల మంది, రోజుకు 20 మంది చనిపోతున్నారని, అందులో పిల్లలు, యువత అధికంగా ఉండడం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయన్నారు. జాయింట్ సిపి జోయల్ డెవిస్ మాట్లాడుతూ రవాణా శాఖ, విద్య శాఖకి సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, యూనిసెఫ్ ప్రతినిధి డా. జెల్ ఎల్ఎల్ ఎం, స్థానిక కార్పొరేటర్ సురేఖ, రిజినల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, డిఇఓ రోహిణి, జెటిసి రమేష్, చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, స్టేట్ ఆర్టీఏ మెంబర్ నవీన్ ,హైదరాబాద్ ఆర్టీఏ మెంబర్ సురేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

కేంద్ర ఆర్థిక మంత్రికి ఎంపి చామల విన్నపం



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాబోయే కేంద్ర బడ్జెట్ 2026లో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రధానమంత్రితో సంబంధిత కేంద్ర మంత్రులకు ఇచ్చిన వినతులను పరిగణలోకి బడ్జెట్లో కేటాయింపులు ఉండాలని కోరారు. 2014లో ఆర్థికంగా బలంగా ఉన్న తెలంగాణ, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత విధానాలు, అశాస్త్రీయ ప్రాజెక్ట్ కేటాయింపుల వల్ల భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఎంపి చామల ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదాలు, నిధుల విడుదల లేకపోవడం వల్ల సుమారు 12 విభాగాలకు చెందిన 47 కీలక అంశాలు నిలిచిపోయాయని ఎంపి వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ II, ఏఆర్ఆర్ఆర్ఆర్ రేడియల్ రోడ్లకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. కొత్త విమానాశ్రయాలు, రైల్వే లైన్లు, జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0లో తెలంగాణను చేర్చాలని, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు తుది ఆమోదం తెలపాలని ఆయన కోరారు. ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. విద్యారంగంలో హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయడంతో పాటు, అదనంగా జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను కేటాయించాలని విన్నవించారు. గోదావరి మూసీ రివర్ లింక్ ప్రాజెక్ట్, సింగరేణి కోల్ బ్లాకుల కేటాయింపు, పిఎం కుసుమ్ పథకం పునరుద్ధరణ వంటి అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపి కోరారు. పేదల గృహ నిర్మాణ పథకాలైన పిఎంఎవైజి, పిఎంఎవైయు కింద మరిన్ని ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి, ఈ బడ్జెట్లో రాష్ట్రానికి న్యాయం చేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఈసారైనా తెలంగాణకు న్యాయం జరగాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత 11 కేంద్ర బడ్జెట్లలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిచిన నేపథ్యంలో అయినా ఈసారి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగినంత నిధులు కేటాయించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ అవసరాలు, అత్యవసర ప్రాజెక్టులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పూర్తి సమాచారం అందించామని మంత్రి తెలిపారు. డ్రై పోర్ట్, టెంపుల్ టూరిజం, ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటునే ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో వ్యతిరేకించారని గుర్తుచేసిన మంత్రి, కేంద్ర పెద్దలను తరచూ కలసి నివేదికలు సమర్పించినప్పటికీ నిధుల కేటాయింపులో మాత్రం నిరంతరం వివక్ష కొనసాగుతుందని ఆరోపించారు. ఈసారి బడ్జెట్ తెలంగాణకు ఆశాజనకంగా ఉండాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈసారి కూడా బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే, రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# ప్రియుడి భార్య, పసికందును తగులబెట్టిన ప్రియురాలు

తల్లి, ఆరు నెలల బాబు మృతి





**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతపల్లి గ్రామంలో దారుణం ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుందేళ్ళ నగేష్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మీసాల సుజాత సంచిలో కారం, పెట్రోల్ బాటిల్, కత్తి తీసుకుని వచ్చి నగేష్ భార్య మమత(32)పై పెట్రోల్ పోసి నిప్పంటించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నగేష్ భార్య మమత తన వివాహేతర సంబంధానికి అడ్డుగా మారుతోందని భావించి, మర్రిగూడ మండలం సరంపేటలో జరిగే జాతర బ్రహ్మోత్సవాలకు వెళ్లడానికి తన ఆరు నెలల బాబుని కూర్చోబెట్టుకొని సిద్ధమై తనను తీసుకెళ్లడానికి వస్తున్న తమ్ముడి కోసం ఎదురుచూస్తున్న సమయంలో మీసాల సుజాత సంచిలో కారంపొడి, కత్తి, పెట్రోల్ బాటిల్ తీసుకొని వచ్చి పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో బాధితురాలు తప్పించుకోలేక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన సమయంలో అక్కడే ఉన్న ఆరు నెలల బాబు కూడా మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. బాధితురాలి అరుపులు విని పరుగెత్తుకొచ్చిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి, గాయపడిన శిశువును వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాబు మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో గ్రామం మొత్తంగా షాక్‌కు గురైంది. ఈఘటనపై గ్రామంలో పోలీసులు బందోబస్తు నడుమ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సుజాతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నాంపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ దూది రాజు ఆధ్వర్యంలో నాంపల్లి, మర్రిగూడెం, చింతపల్లి, ఎస్ఐలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# విప్లవ కవి గద్దర్ ఆశయాలు సమాజ మార్పుకు మార్గదర్శకం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విప్లవ గాయకుడు, ప్రజా కవి, సామాజిక ఉద్యమకారుడు గద్దర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అణగారిన వర్గాల జీవన వాస్తవాలను తన గళంలో, తన కలంలో ప్రతిబింబింపజేసిన గద్దర్ విప్లవ గర్జనగా ప్రజలను చైతన్యపరిచి,పాటల ద్వారా సామాజిక అసమానతలపై ప్రశ్నలు లేవనెత్తిన గొప్ప ప్రజా కవి అని మంత్రి కొనియాడారు. గద్దర్ ఆశయాలైన సమానత్వం, న్యాయం, సామాజిక చైతన్యం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. గద్దర్ స్ఫూర్తి తరతరాలకు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అణగారిన వర్గాల సంక్షేమానికి తన శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

# పెన్షన్, గ్రాట్యుటీ తక్షణమే చెల్లించాలి

ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాం మొదల్కొని ఇప్పటీ వరకు పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, పెన్షన్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లింపులకు సంబంధించి గత ముఖ్యమంత్రి కెసిఆర్ దారిలోనే సిఎం ఎ.రేవంత్ రెడ్డి నడవడం సరికాదన్నారు. పలువురు ఉద్యోగులు వేర్వేరు డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తూ అనారోగ్యంతో ప్రమాదాలకు గురై చనిపోయిన వారికి కూడా పదవి విరమణ బెనిఫిట్స్ రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 2026 సంవత్సరంలో 6వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ పొందుతున్న వారికి పదవి విరమణ పథకం ప్రకారం రావాల్సిన అన్ని లాభాలను వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బాల్‌రాజ్ డిమాండ్ చేశారు.

# తెలంగాణ విజన్ 2047 లక్ష్యసాధన కోసం ప్రభుత్వ అధికారులంతా పని చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ విజన్ 2047 లక్ష్య సాధనే లక్ష్యంగా అధికారులంతా పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అదేశించారు. రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్‌లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. దేవాదాయ, చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి శాఖల పనితీరుపై సమీక్షించిన సిఎస్ యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం (యాదగిరిగుట్ట), వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంతో పాటు ఇతర ప్రముఖ ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో రానున్న వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, ముఖ్యకార్యదర్శులు శైలజా రామయ్యర్, సందీప్ కుమార్ సుల్తానియా, ఎన్.శ్రీధర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తీ, సెర్ప్ సీఈఓ దివ్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ శృతి ఓఝా, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హన్మంతు, దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్. హరీష్, డైరెక్టర్ స్పోర్ట్స్ విసి,ఎండి సోనిబాలా దేవి, డైరెక్టర్ కల్చర్ నరసింహారెడ్డి, ఇంజనీర్ – ఇన్ – చీఫ్ లు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఐక్యతతో విజయం ఖాయం

మైనార్టీ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన విజయం సాధించేందుకు ఐక్యత, క్రమశిక్షణతో కూడిన ప్రచారం, ప్రభావవంతమైన ప్రజా సంప్రదింపులు అవసరమని మైనారిటీ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో శనివారం జహీరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల సన్నాహాలు, బూత్ స్థాయి బలోపేతం, నియోజకవర్గ వ్యాప్తంగా కచ్చితంగా క్షేత్రస్థాయి సమన్వయం అవసరం అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మంత్రి దామోదర రాజ నరసింహ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, ఎంఎల్ఎలు డా.సంజీవ్ రెడ్డి, మదన్ మోహన్‌రావు, తోట లక్ష్మీ కాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి చంద్రశేఖర్, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డితో పాటు వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు హాజరయ్యారు.

# కార్మిక సంఘాలపై 'సుప్రీం' వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్

**న్యూఢిల్లీ:** సర్వోన్నత న్యాయస్థానం కార్మిక సంఘాలపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు, అసోసియేషన్లతో కూడిన ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గృహ కార్మికులకు కూడా పారిశ్రామిక కార్మికులతో సమానంగా అన్ని హక్కులూ వర్తింపజేసేలా గుర్తింపు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యానగల సుప్రీంకోర్టు ధర్మాసనం జనవరి 29వ తేదీన చేసిన ఆరోపణలు వర్గ వివక్షతో కూడుకున్నాయని, దేశంలో అత్యధికంగా ఉన్న అసంఘటితక కార్మికులను ఈ వ్యాఖ్యలు కలచివేశాయని పది కార్మిక సంఘాలతో కూడిన ఐక్యవేదిక శనివారం ఒక ఉమ్మడి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. కార్మికుల సమైక్యవాదం, ఒకేజెండా కింద చేరి చేసే సమ్మెలు దేశంలో అనేక పరిశ్రమలు మూతపడటానికి దారితీస్తున్నాయంటూ చేసిన ఆరోపణలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు అవాంఛనీయమైనవని, వాస్తవదూరమైనవని, పరిశ్రమలు అనేక పనిదినాలను కోల్పోతున్నది కార్మికులవల్ల, కార్మిక సంఘాల సమ్మెలు, ఆందోళనలవల్లా కాదని, కార్పొరేట్ వ్యవస్థల దుర్వినియోగ విధానాలు, అవకతవకలు, లోటుపాట్ల కారణంగానే పరిశ్రమలు మూతపడుతున్నాయని ఐక్యవేదిక స్పష్టం చేసింది. కార్మిక సంఘాలు ఏనాడూ దేశ ఆర్థిక అభివృద్ధికి అడ్డుపడలేదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 19 (1) (సి) అధికరణ కింద కార్మిక సంఘాలన్నీ అధికారికంగా గుర్తింపు పొందిన ప్రజాస్వామ్య సంస్థలేనని, కార్మికుల జీవనాన్ని, వారి మర్యాదను, గౌరవాన్ని, హక్కులను రక్షించే కేంద్రాలని, కానీ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని తెలియజేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి పూర్వమే 1926లో భారత కార్మిక సంఘ చట్టం కింద కార్మిక సంఘాలను ఏర్పాటు చేసేకునే హక్కుకు హామీ లభించిందని జ్ఞప్తికి తెచ్చింది. అత్యంత బాహాటంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వర్గ వివక్షను బహిర్గతం చేశారని పేర్కొంది. సంక్షేమరాజ్యాన్ని ఆశిస్తుందనుకున్న బాధ్యతాయుతమైన సర్వోన్నత న్యాయస్థానం అందుకు బదులుగా ప్రభుత్వాన్ని కార్పొరేట్ అనుకూల విధానాలవైపు, అసమానత,పేదరికం, ఆకలి వంటివాటిని లోతుగా వ్యాప్తిచేసేందుకు బాధ్యురాల్నిచేసేదిగా పురిగొల్పుతోందని పేర్కొంది. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరించేందుకు ప్రభుత్వానికి బాహాటంగా చట్టబద్ధతనిస్తోందని పేర్కొంది. సంక్షేమరాజ్య సాధనకు ఉద్దేశించిన రాజ్యాంగ దార్శనికతను చిన్నచూపు చూస్తుందని, సామాజిక న్యాయ సూత్రాలకు, సమానత్వానికి, రాజ్యాంగం పేర్కొన్న శ్రమైక జీవన సౌందర్యానికి ఈ వ్యాఖ్యలు, ఆరోపణలు విరుద్ధమైనవని స్పష్టం చేసింది. గృహకార్మికులు సహా సామాజిక ఆర్థిక భద్రత లేకుండా అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనహక్కులను, సామాజిక న్యాయాన్ని, ఇతర హక్కులను సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థాన రాజ్యాంగబద్ధ వైఖరి అనుసరించాలని కోరింది. గృహకార్మికులకు, అసంఘటిత కార్మికులకు ఎలాంటి రక్షణలు లేకుండాపోయాయని, వారికి కనీస వేతనాలను తిరస్కరిస్తున్నారని, అసంఘటిత కార్మికులలో ఎక్కువమంది గృహకార్మికులే ఉన్నారని ఐక్యవేదిక స్పష్టం చేసింది. వారి వేతనాలు దోచుకుంటున్నారని, ఎక్కువ పనిగంటలతో వారి శ్రమ దోచుకుంటున్నారని కార్మిక సంఘాల సమైక్యవేదిక సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No.03/GHMC/ALC-51/EE/2025-26 తేదీ: 30-01-2026
పని పేరు: డిజిల్టింగ్ పనులు, అంచనా విలువ: రూ.75.70 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం: 02.02.2026న మ.03.00గం.ల నుండి 09.02.2026న ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సెల్ నెం. 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14794-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ : వనపర్తి సర్కిల్
షార్ట్ ఓపెన్ టెండర్ & ఇ-టెండర్ ప్రకటన
Tender Notice-03/2025-26
టెండర్ నోటీసు నెం: 03/2025-26, స్పెసిఫికేషన్ నెం: W-01/25-26 & W-02/25-26 ప్రకారం వనపర్తి సర్కిల్‌లోని వివిధ విద్యుత్ పనుల కోసం అర్హత గల విక్రేతల నుండి బిడ్లు ఆహ్వానించబడ్డాయి. టెండర్ల అమ్మకం ప్రారంభ తేదీ: 02.02.2026 మరియు టెండర్లను స్వీకరించడానికి చివరి తేదీ: 10.02.2026, మధ్యాహ్నం 13:30 గంటలు. టెండర్ నోటీసుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి www.tgsouthernpower.com వెబ్‌సైట్‌ను సందర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ :: వనపర్తి.
DIPR R.O. No. : 14821-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
NIT No. EOI-L/EE/C40/SBZ/GHMC/2025-2026 తేదీ: 31.01.2026
క్ర.సం.1, ఈ క్రింద పేర్కొన్న ఐటెమ్స్ కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్స్, అథారిటీలు మరియు డీలర్లు, ఏజెన్సీలు, మొ॥ వాటి నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనది: 1 సంవత్సర కాలానికి ఫిబ్రవరి 2026 నుండి డిసెంబర్ 2026 వరకు ఇంటర్‌నెట్ సర్వీస్ అందించడం మరియు దోమల్‌గూడ వద్ద న్యూ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయ భవనానికి నెట్ వర్కింగ్ అందించడం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / దాఖలుకు ఆఖరి తేదీ & సమయం: 02.02.2026న ఉ.10.00గం.ల నుండి 04.02.2026న మ.3.00గం.ల వరకు, కార్యాలయ పేరు & చిరునామా: బిడ్లను తేదీ: 04.02.2026న మ.3.00గం.లకు లేదా అంతకుముందు ఆఫ్‌లైన్‌లో సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-15, జిహెచ్ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్. సెల్ నెం. 7995007437లో తేదీ: 04.02.2026న మ.3.00గం.లకు లేదా అంతకుముందు. పై వస్తువులకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి స్పెసిఫికేషన్లను జిహెచ్ఎంసి వెబ్‌సైట్: https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు.
టు, నోటీసు బోర్డు. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.15, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14838-PP/CL/ADVT/1/2025-26, Date: 31-01-2026

## కౌలు రైతు చట్టంపై
# చర్చించిన రైతు కమిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కౌలు రైతు చట్టం, ఎఫ్‌పిఒ ల ఏర్పాటు పై రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండ రెడ్డి అధికారులతో చర్చించారు. ఇటీవల స్టడీ టూర్ పై ఇతర రాష్ట్రాల్లో పర్యటించిన రైతు కమిషన్.. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి సిద్ధమైంది. ప్రధానంగా కేరళలో కౌలు రైతు విధానం పై కమిషన్ అధ్యయనం చేసింది. కేరళ రాష్ట్రంలో కుటుంబ స్త్రీ ప్రాజెక్టు పేరుతో కౌలు రైతు విధానం అమలవుతోంది. అక్కడి అనుభవాలతోపాటు 2011 లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం కౌలు రైతు చట్టం తెచ్చిన విషయాన్ని గుర్తుచేసుకుంది. తెలంగాణ రాష్ట్ర కౌలు రైతులను దృష్టిలో పెట్టుకొని కొంత మార్పు చేర్పులు చేసి మళ్లీ కౌలు రైతు చట్టాన్ని తీసుకురావాలని కమిషన్ ప్రభుత్వానికి సూచించనుంది. అదేవిధంగా ఈ మధ్యకాలంలో కమిషన్ మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతంలో పర్యటించింది. రైతులు సంఘటితం ఐతేనే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని నాసిక్ లోని సహ్యాద్రి ఫారమ్స్ ఎఫ్‌పిఒ నిరూపించింది. మహారాష్ట్రలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (రైతుల ఉత్పత్తిదారుల సంస్థ) గా ఏర్పడి లాభాలు గడిస్తున్న విషయాన్ని కమిషన్ నాసిక్ స్టడీ టూర్ లో తెలుసుకుంది. అక్కడి ప్రభుత్వం ఎఫ్‌పిఒ ఏర్పాటుకు సపోర్ట్ చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా రైతులు సంఘటితం కావడానికి ప్రభుత్వ సహకారం అవసరమని కమిషన్ భావిస్తుంది. ఇక్కడ కూడా ఎఫ్‌పిఒ ల ఏర్పాటు రైతుల ఆర్థిక అభివృద్ధికి నాంది పలుకుతుందని కమిషన్ ఆలోచన చేస్తుంది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి కౌలు రైతు చట్టం, ఎఫ్‌పిఒ ల ఏర్పాటుపై విధివిధానాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని నిర్ణయం తీసుకుంది.ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తోపాటు సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య సంస్థలు విఫలమైనప్పుడు
# పౌరులు ప్రతిఘటించాల్సిందే
### పౌరహక్కుల పరిరక్షణ సంఘం(ఎపిసిఆర్) సభ్యులు




ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజాస్వామ్య సంస్థలు విఫలమైనప్పుడు, మౌనంగా భాగస్వాములైనప్పుడు, ప్రతిఘటన బాధ్యత భిన్న గుర్తింపులను దాటి ప్రజలు ఏకమై భూమి, విద్య, ఆహారం, నివాసం, గౌరవంతో పాటు న్యాయం వంటి రాజ్యాంగ హక్కులను సాధించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పౌరహక్కుల పరిరక్షణ సంఘం(ఎపిసిఆర్) సభ్యులు తెలిపారు. నాంపల్లిలోని మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లోని నెహ్రూ ఆడిటోరియంలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ సంఘం (ఎపిసిఆర్) ప్రస్తుతం తెలంగాణలో చోటుచేసుకున్న సామూహిక హింస, ద్వేష నేరాలు, వాటిపై ప్రభుత్వ స్పందన తీరును నమోదు చేసిన నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికను గ్రౌండ్ టీమ్, ప్యానెల్ సభ్యులు న్యాయమూర్తి చంద్ర కుమార్, అమీర్ అలీ ఖాన్, ప్రొఫెసర్ హర గోపాల్, నదీమ్ ఖాన్, ప్రశాంత్ భూషణ్, న్యాయమూర్తి అభయ్ థిప్సే కలిసి విడుదల చేశారు. ఈ నివేదిక పది జిల్లాల్లో నమోదు చేసిన పంతొమ్మిది వాంగ్మూలాల ఆధారంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివేదికలోని ప్రతి వాంగ్మూలం ప్రత్యేకమైన సామాజిక, భౌగోళిక నేపథ్యానికి చెందినదైనా, హింస ఎలా జరుగుతోందో, అలాగే బాధ్యతను ఎలా వ్యవస్థాపితంగా తిరస్కరిస్తున్నారో అన్న విషయంలో పునరావృతమైన నమూనాలను వెలుగులోకి తెస్తోందన్నారు. ముస్లిం సముదాయాలపై హింస, కస్టడీ మరణాలు, తప్పుడు క్రిమినల్ కేసులు, లైంగిక హింస, విస్తృత స్థాయి ఆర్థిక విధ్వంసం వంటి అఘాయిత్యాలు అనేక జిల్లాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయనీ, వీటితో పాటు ఆదివాసీ, దళిత సముదాయాలపై కుల ఆధారిత, లింగ ఆధారిత హింస కూడా చోటుచేసుకుంటోందని తెలిపారు. ఈ చర్చ అసలు సంఘర్షణ ఆదివాసీలు, ముస్లింల మధ్య కాదని, విభజన ద్వారా లాభపడే రాజకీయ శక్తులు, అంచున ఉన్న సముదాయాల మధ్యనే ఉందని వక్తలు స్పష్టం చేశారు. అఫర్మేటివ్ యాక్షన్ (రిజర్వేషన్లు), విద్యా సంస్కరణలపై ఇటీవల జరిగిన ఉద్యమాలు సహా, ఆధిపత్య కులాల బాధితత్వ కథనాలు అధికారం, వనరులపై అసమాన ప్రాప్తిని కొనసాగించేందుకు ఉపయోగించే వ్యూహాలుగా గుర్తించబడ్డాయన్నారు. సామూహికీకరణను సవాలు చేయడం, బాధ్యత నిర్ధారణను బలపరచడం, అలాగే న్యాయం, గౌరవం, సహజీవనంపై ఆధారపడ్డ ఐక్యతలను ప్రోత్సహించడం ఈ నివేదిక లక్ష్యంగా పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ స్మైల్'తో
# 5,582 మంది చిన్నారులకు విముక్తి
### అదనపు డిజిపి చారుసిన్హా

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా నెల రోజుల పాటు చేపట్టిన 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమంలో 5,582 మంది చిన్నారులకు విముక్తి కల్పించినట్లు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారుసిన్హా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో జనవరి 1 నుంచి 31 వరకు కొనసాగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 121 సబ్ డివిజనల్ పోలీసు బృందాలు పాల్గొన్నాయని, ఇందులో మొత్తం 605 మంది పోలీసు సిబ్బంది పనిచేశారని ఆమె వివరించారు. ఈ ఆపరేషన్‌లో మహిళా శిశు సంక్షేమ, కార్మిక, ఆరోగ్య శాఖలతో పాటు చైల్ వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు డిసెంబరు 29న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అనంతరం రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, టీ స్టాళ్ల వంటి ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా రక్షించిన వారిలో 5,108 మంది బాలురు, 474 మంది బాలికలు ఉన్నారని, వీరిలో 2,292 మంది బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సహా సుమారు 15 రాష్ట్రాలకు చెందిన వారని చారుసిన్హా వెల్లడించారు. పొరుగు దేశమైన నేపాల్‌కు చెందిన 43 మంది చిన్నారులను కూడా రక్షించినట్లు తెలిపారు. రక్షించబడిన వారిలో 4,567 మంది బాల కార్మికులుగా, 486 మంది వీధి బాలలుగా, 38 మంది భిక్షాటన చేస్తూ, మరో 491 మంది ఇతర పనుల్లో మగ్గుతూ గుర్తించబడ్డారని పేర్కొన్నారు. చిన్నారులతో పనులు చేయిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించామని, ఈ క్రమంలో 1,480 ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసి 1,483 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె వివరించారు. అలాగే కార్మిక శాఖ ద్వారా 1,363 తనిఖీ నివేదికలు జారీ చేసి, కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ. 41.78 లక్షల జరిమానా విధించామన్నారు. రక్షించిన వారిలో 4,978 మంది చిన్నారులను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, ఆశ్రయం లేని 604 మందిని రక్షణ గృహాలకు తరలించడంతో పాటు వలస కార్మికుల పిల్లల కోసం 29 అర్బన్ బ్రిడ్జ్ స్కూళ్లలో 2,375 మందిని చేర్పించామని అదనపు డిజిపి వివరించారు. రాష్ట్రంలో బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరీని నిర్మూలించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అంకితభావంతో శ్రమిస్తుందని ఈ సందర్భంగా అడిషనల్ డిజిపి చారుసిన్హా పునరుద్ఘాటించారు.

## ఎఐ ఆధారిత టాగ్స్‌ను ప్రారంభించిన సిఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రస్తుతం జరుగుతున్న సిఎం కప్–2025 రెండవ ఎడిషన్ సందర్భంగా, టెలంగాణ అసిస్టెన్స్ ఫర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ (టిఎజిఎస్) అనే వినూత్న కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత వేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండి డా. ఎ. సోనిబాలా దేవిలు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభించిన ఈ వేదిక ఆధునిక డిజిటల్ పరిష్కారాల ద్వారా క్రీడా పరిపాలనను బలోపేతం చేయడం, క్రీడాకారులకు మెరుగైన సహాయ సేవలు అందించడం లక్ష్యంగా రూపొందించబడింది. టిఎజిఎస్ వేదికలో ఇంటిగ్రేటెడ్ వెబ్‌సైట్, ఎఐ చాట్‌బాట్, వాట్సాప్ ఆధారిత ఎఐ చాట్‌బాట్ ఉంటాయి. ఇవి క్రీడాకారులు, ఇతర భాగస్వాములకు తెలుగు, ఆంగ్ల భాషల్లో తక్షణ సమాచారం అందించేందుకు రూపకల్పన చేయబడ్డాయి. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ఈ వేదిక ద్వారా ప్రాప్యత, పారదర్శకత, స్పందనాత్మకత మెరుగుపడి, క్రీడాకారులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని శాఖల్లో సాంకేతికత వినియోగం ద్వారా సమగ్ర వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.టిఎజిఎస్ ప్రారంభం ద్వారా క్రీడలు మరియు క్రీడాకారుల సమగ్ర అభివృద్ధి కోసం వినూత్న డిజిటల్ పరిష్కారాలను స్వీకరించడంలో తెలంగాణ రాష్ట్రం మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకుందన్నారు.

# సేవాలాల్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ప్రతిష్టించాలి
### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : గిరిజన బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ప్రతిష్టించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ఈ నెల 10లోపు లంబాడీ ప్రజాప్రతినిధులతో చర్చించాలని, లేనిపక్షంలో 11న సిఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తామని తెలిపారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కుర్ర మోతిలాల్ నాయక్ అధ్యక్షతన "సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని మద్దిమడుగులో పెట్టొద్దని, హైదరాబాద్‌లో ప్రతిష్టించాలి" అంటూ రౌండ్‌టేబుల్ సమావేశంజరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి ఏఐబిఎస్ఎస్ మాజీ జాతీయ అధ్యక్షులు అమర్ సింగ్ తిలావత్, సేవాలాల్ బంజారా సంఘం మహిళా అధ్యక్షురాలు సక్రి బాయి, సరిత బాయి. సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు అభి రామ్ నాయక్. ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ నంగార బేరి లంబాడి హక్కుల పోరాట సమితి గణేష్ నాయక్ తదితర గిరిజన సంఘాలనేతలు హాజరై, మాట్లాడారు. సేవాలాల్ విగ్రహాన్ని బంజారాహిల్స్‌లో ఒక ఎకరం స్థలంలో ఏర్పాటుచేయాలని కోరారు. దేవరకొండలోని మద్దిమడుగులో ఏర్పాటు చేస్తే బంజారా జాతిని అవమానపరిచినట్టేనన్నారు. మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఎస్టిలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. నగరంలో 300 సీట్లకు కేవలం 5 కేటాయించడం పట్ల ఎస్టిల పైప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం వెంకట్ బంజారా, ఓయు జెఎసి నేతలు సంపత్‌నాయక్ రవి నాయక్, సేవాలాల్ నేతలు రాంబాబు నాయక్, హుస్సేన్ నాయక్, భరత్ చౌహన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఐఎఫ్‌ఎస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినయ్‌కుమార్ , ఉపాధ్యక్షుడిగా రత్నాకర్ జౌహరీ, కార్యదర్శిగా డా. ప్రియాంకా వర్గీస్, సంయుక్త కార్యదర్శిగా రంజిత్ నాయక్, కోశాధికారిగా బి. ప్రవీణలు ఎన్నికయ్యారు.అటవీ సంరక్షణకు సంబంధించిన విధులతో పాటు అధికారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.ఎన్నికైన సభ్యులకు అటవీ దళాల ముఖ్య సంరక్షిణాధికారిణి డాక్టర్ సి. సువర్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎన్నికల్లో నిర్దేశిత మద్యం విక్రయాలు జరపాలి
### పోలింగ్ రోజు సినిమాహాళ్లు, మాల్స్ బంద్ చేయాలి
### ఎన్నికల కమిషనర్‌కు ఆర్‌టిఐ మానవ హక్కుల కార్యకర్తల సంఘం వినతి

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు మద్యపాన లైసెన్స్ దారులు పరిమితికి మించి మద్యం విక్రయాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల రోజున షాపింగ్ మాల్స్, సినిమా హాళ్ళు, బార్లు, తదితర వినోద కేంద్రాలను మూసేయాలని తెలంగాణ ఆర్.టి.ఐ మానవ హక్కుల కార్యకర్తల సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం నగరంలోని ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎన్నికల కమిషనర్ రాణికుముదినిని సంఘం అధ్యక్షురాలు దారా మౌనిక, వైస్ ప్రెసిడెంట్ విస్లావత్ చందర్ , కంచరాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ లతో కూడిన ప్రతినిధి బృందంకలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం దారా మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సమాచార హక్కు చట్టపై ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహ రెడ్డి, రాష్ట్ర అవేర్నెస్ ప్రోగ్రాం ఇన్చార్జి సాయి ప్రసాద్, కోశాధికారి సాయి వెంకట్ తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో..
# ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు ఆందోళనకరం
### జాన్ వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో వరుసగా చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని బోడియాతండా ప్రభుత్వ పాఠశాలలో 38 మంది విద్యార్థులు, వనపర్తి జిల్లా కొత్తకోట ప్రభుత్వ బాలికల కళాశాలలో 30 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల అస్వస్థతకు గురవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. ఇలాంటి ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయన్నారు. పర్యవేక్షణ లోపం, పరిశుభ్రత, కలుషిత నీటి వినియోగం వంటి కారణాలతో పాటు, పులిసిపోయిన పెరుగు, ఉప్మా రవ్వ, కుళ్ళిపోయిన కూరగాయలు, నాసిరకం పప్పులు, ముక్కిపోయిన బియ్యం వంటి ఆహారం వడ్డించడం వల్లనే ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పదేపదే జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఘటనలపై గతంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా తీవ్రంగా స్పందించినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల ఆర్థిక భారం పెరిగి, దాని ప్రభావం ఆహార నాణ్యతపై పడుతోందన్నారు. ప్రభుత్వ హాస్టళ్లకు చెల్లించాల్సిన బిల్లులను పూర్తిగా వెంటనే చెల్లించాలని, ఈ ఘటనలకు బాధ్యులైన అధికారులపై, కాంట్రాక్టు సంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



## సెక్షన్ అసిస్టెంట్ గ్రేడ్ - II అధికారి
# కొప్పుల జనార్ధన్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : సెక్షన్ అసిస్టెంట్ గ్రేడ్ II అధికారి కొప్పుల జనార్ధన్ శనివారం రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సహ ఉద్యోగులు కె. వెంకటేశ్వర్ రావు, పిల్ల శ్రీనివాస్, కె.వి. శ్రీనివాసరావు, జి.వి. నర సింహ రావు, ఎస్.ఎ. మహబూబ్ బాషా, కె. అశోక్ కుమార్‌లు ఆత్మీయ వీడ్కోలు పలికారు. నిగర్వి్గా, హితుడుగా, అందరిని ఆప్యాంగా పలుకరించే జనార్ధన్ తన శేష జీవితం కుటుంబ సభ్యులతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, గడపాలని ఆకాంక్షించారు.

## పోచారం స్వగృహ ఫ్లాట్ల దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పోచారం పరిధిలోని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఫ్లాట్లకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 3వ తేదీ వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. పోచారం సద్భావనా టౌన్‌షిప్‌లో ఉన్న 111 డబుల్ బెడ్ రూం ఫ్లాట్లు, 163 సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ల విక్రయానికి గత నెల 21వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ఫ్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు తొలుత జనవరి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించినప్పటికీ, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఫిబ్రవరి 3 వరకు పొడిగించినట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ జి.వి. రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు పొడిగింపు నేపథ్యంలో ఫ్లాట్ల కేటాయింపు కోసం నిర్వహించనున్న లాటరీ తేదీ కూడా మారిందన్నారు. తొలుత ఫిబ్రవరి 4న నిర్వహించాల్సిన లాటరీని ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సింగిల్ బెడ్ రూం ఫ్లాట్లను రూ.13 లక్షలకు, డబుల్ బెడ్ రూం ఫ్లాట్లను రూ.19 లక్షలకు కేటాయిస్తున్నామని పేర్కొంటూ, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఐపిఎస్ అధికారిపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు బాధాకరం..
### తక్షణమే ఆ వ్యాఖ్యలు వెనుకకు తీసుకోవాలి..
### ఐఎఫ్ఎస్ అధికారుల అసోసియేషన్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఐపిఎస్ అధికారి గౌష్ ఆలమ్ పై ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. అధికారిక విధులు నిర్వహిస్తున్న సమయంలో వ్యక్తిగతంగా, మతపరమైన అంశాలను ప్రస్తావిస్తూ శాసన సభ్యులు అనుచితంగా మాట్లాడడం బాధాకరమని తెలిపింది. ఈ వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు లేవని, ఇవి రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఉన్నాయని వెల్లడించింది. ఈ సందర్భంగా గౌష్ ఆలమ్ కు ఐఎఫ్ఎస్ అసోసియేషన్ సంఘీభావం ప్రకటించింది.ఈ ఘటనపై ఎంఎల్ఎ తక్షణమే క్షమాపణ చెప్పాలని, అలాగే సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది.రాజ్యాంగ విలువలకు కట్టుబడి, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా తాము పనిచేస్తున్నామని అసోసియేషన్ తెలిపింది.


# కాంగోలో కుప్పకూలిన గని
- 227 మంది కార్మికులు మృత్యువాత
- మరో ఏడుగురికి గాయాలు

గోమా: ఆఫ్రికా డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో తూర్పు ప్రాంతంలో ఉన్న అత్యంత అమూల్యమైన కాల్టన్ ఖనిజాలున్న రుబయా గనులు కుప్పకూలడంతో 227 మందిపైగా కార్మికులు మరణించారు. ఈ మృతులసంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎలాంటి రక్షణలూలేని ఈ గనుల చరియలు బుధవారంనాడే కుప్పకూలిన ఘటన గురించి ఉత్తర కిము రాష్ట్రంలో తిరుగుబాటువర్గాలకు చెందిన గవర్నర్ నియమించిన అధికార ప్రతినిధి లుబుంబా కంబేర్ ముయిసా శనివారం చెప్పారు. ఈ ఈ ఘటనలో మరో ఏడుగురు గాయపడ్డారు. విషయం వెల్లడించారు. ఇప్పటికీ ఇంకా చాలా మంది చరియలు కుప్పకూలడంవల్ల వచ్చిన బురదలో కూరుకుపోయి ఉన్నారని తెలిపారు. ఈ ఘటన తర్వాత గనుల తవ్వకం కార్యకలాపాలను గవర్నర్ నిలిపివేశారు. ఈ ప్రాంతంలో శిబిరాల్లో ఉన్నవారిని ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఈ గనులను గతంలో తవ్విన నిర్వాహకుడు అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధులతో మాట్లాడుతూ, రుబయాలో పదే పదే చరియలు,గనుల అంచులు విరిడి పడుతూ ఉంటాయన్నారు. టన్నెల్స్‌ను కార్మికులు యంత్రాలతో కాకుండా చేతులతో తవ్వుతున్నారన్నారు. ఈ సొరంగం నిర్మాణాల్లో నాణ్యత లేదని చెప్పారు. ఎలాంటి రక్షణలు, ప్రణాళిక లేకుండా ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ గనుల్లో అత్యంత విలువైన అరుదైన ఖనిజాలు లభ్యం అవుతాయి. ఒక చరియ విరిగి పడితే గనుల తవ్వకంలో ఉన్న అనేకమందికి నష్టం జరుగుతుందని చెప్పారు. తూర్పు కాంగోలోని కీలకమైన ప్రాంతంలో రుబయా గనులు ఉన్నాయి. అనేక దశాబ్దాలుగా ఈ ప్రాంతం హింసతో అట్టుడికిపోతోంది. కాంగోలో అత్యంత సంపదను సృష్టించగల గనులు ఇవే. రువాండా మద్దతుగల ఎం–23 తిరుగుబాటు దారులు కూడా ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ అరుదైన కాల్టన్ ఖనిజాలను కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ల తయారీలో ఉపయోగిస్తారు. 2023లో కాంగో ప్రపంచంలోనే ఎక్కువగా 40 శాతం కాల్టన్‌ను ఉత్పత్తి చేసింది. 2024లో ఎం–23 తిరుగుబాటు ఉగ్రవాదులు ఈ పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నారు. గనులను తమ అధీనంలోకి తెచ్చున్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక తెలిపింది. కాల్టన్ ఎగుమతులపై ఉగ్రవాదులే పన్నులు విధిస్తునానరు. నెలకు కనీసం 8,00,000 డాలర్లు వారు ఈ గనుల ద్వారా సంపాదిస్తున్నారు.అనేక దశాబ్దాలుగా తూర్పు కాంగో సంక్షోభంలో ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద మానవతావాద సంక్షోభం కాంగోలో నెలకున్నది. ఈ ప్రాంతంలో 70 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఈ ఏడాదిలోనే లక్షమంది నిరాశ్రయులయ్యారు.

## రేవంత్ ప్రభుత్వం తెలంగాణకు 'జల ద్రోహం' చేస్తోంది
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని, నీటి వాటాల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏపికి తొత్తుగా వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నీటి చరిత్రలో ఈ రోజును ఒక బ్లాక్ డేగా అభివర్ణించారు. ఢిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ సమావేశంలో రేవంత్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతోందని ఆరోపించారు. 'గోదావరి నదీ జలాల అక్రమ తరలింపుపై బిఆర్ఎస్ మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉంది. కానీ, ఈ ప్రభుత్వం మొద్దు నిద్రపోతూ ఏపి జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేస్తోంది' అని విమర్శించారు. ఏపి ఒత్తిడికి తలొగ్గి తెలంగాణ హక్కులను రేవంత్ రెడ్డి కాలరాస్తున్నారని, ఇది చంద్రబాబుకు ఆయన చెల్లిస్తున్న గురుదక్షిణ అని విమర్శించారు. సుమారు 200 టిఎంసిలను తరలించుకుపోయే నల్లమల సాగర్ ప్రాజెక్టుపై ప్రభుత్వం సరైన పోరాటం చేయడం లేదని, నామమాత్రపు రిట్ పిటిషన్లు వేసి చేతులు దులుపుకుంటుందన్నారు. గతంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించిన ఆదిత్యనాథ్ దాస్ వంటి వారిని చర్చలకు పంపడం అంటే దొంగకు ఇంటి తాళాలు ఇచ్చినట్లేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాలరాసే ఢిల్లీ సమావేశాన్ని ప్రభుత్వం తక్షణమే బహిష్కరించాలన్నారు. నల్లమల సాగర్ డిపిఆర్ ఆపాలని తాము పెట్టిన కండిషన్లకు కేంద్రం, ఏపి నుంచి వచ్చిన సమాధానాలను ప్రజల ముందు ఉంచాలని, తెలంగాణ నీటి కోసం బిఆర్ఎస్ మరో పోరాటానికి సిద్ధమని, రేవంత్ రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. 'మేము తెలంగాణకు నీళ్లిచ్చే ప్రయత్నం చేస్తే, రేవంత్ రెడ్డి ఏపికి నీళ్లిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నీటిని ఒడిసి పట్టింది కెసిఆర్ అయితే, విడిచి పెడుతోంది రేవంత్' అని హరీశ్ రావు అన్నారు.

# విజయవంతంగా ముగిసిన మెగా ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్
### 10,225 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాల తరలింపు
### 88 మెట్రిక్ టన్నుల ఈ-వేస్ట్ సేకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తీర్ణం పెరిగి వార్డుల పునర్విభజన అనంతరం నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిహెచ్ఎంసి 300 వార్డుల్లో చేపట్టిన మెగా ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ విజయవంతంగా జరిగిందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 29న ప్రారంభమైన ఈ డ్రైవ్ జనవరి 31తో ముగిసింది. రెగ్యులర్ సానిటేషన్ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో ఈ డ్రైవ్‌ను జిహెచ్ఎంసి నిర్వహించింది. రోజుకో అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ డ్రైవ్‌ను ప్రభావవంతంగా అమలు చేశారు. డ్రైవ్ పురోగతిపై కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తూ జోనల్, సర్కిల్ అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 29 నుంచి జనవరి 31 వరకు జిహెచ్ఎంసి పరిధిలోని 300 వార్డుల్లో మొత్తం 6,495 ఏరియాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, ఫ్లై ఓవర్లు, పార్కులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో భాగంగా అదనంగా 7,658 మెట్రిక్ టన్నుల సాధారణ వ్యర్థాలు, 2,567 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థాలు కలిపి మొత్తం 10,225 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలించారు. రెండు రోజుల పాటు జిహెచ్ఎంసి వ్యాప్తంగా 271 ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహించి 88 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్‌ను సేకరించారు. ఈ మెగా సానిటేషన్ డ్రైవ్‌ను కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. నగరాన్ని శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచడంలో ఈ మెగా ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ కీలక పాత్ర పోషించిందని అధికారులు తెలిపారు.

# అంకెలు కాదు.. వాస్తవాభివృద్ధి ఎంత?

భారతదేశం ఒక అధిక ఆదాయ దేశంగా మారాలన్న ఆశయం ఇప్పుడు అధికారిక నినాదంగా మారింది. 2047 నాటికి వికసిత దేశంగా ఎదగాలన్న లక్ష్యాన్ని ముందుకు తెచ్చి, ఆ లక్ష్యానికి దారి చూపే సాధనంగా వార్షిక బడ్జెట్లను ప్రదర్శిస్తున్నారు. కానీ, ఆశయాలు, నినాదాలు మాత్రమే దేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లవు. వాటికి పునాదిగా కావాల్సింది మానవ సామర్థ్యం, ఆరోగ్యం, విద్య, సమానత్వం. ఈ మూలాలే బలహీనంగా ఉన్నప్పుడు, కేవలం గణాంకాల మీద ఆధారపడి నిర్మించే వృద్ధి నమూనా ఎంతకాలం నిలుస్తుందన్నది అనుమానమే. గత బడ్జెట్ అనుభవం ఈ నిజాన్ని మరింత స్పష్టంగా చూపించింది. ఆదివారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ కూడా ఇదే తరహాలో ఉన్నా, ఆశ్చర్యం ఏమీ లేదు. సాధారణంగా ఆర్థిక వృద్ధి అనే పదాన్ని మనం తరచూ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) శాతం పెరుగుదలతో సమానం చేస్తాం. కానీ జిడిపి పెరుగుతున్నప్పటికీ, ఆ వృద్ధి ఎవరి చేతుల్లో కేంద్రీకృతమవుతోంది? ఎవరి జీవితాలను మార్చుతోంది? ఎవరి బాధలను తగ్గిస్తోంది? ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయా? కొనుగోలు శక్తి మాట ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు లేకపోతే, ఆ వృద్ధి కేవలం గణాంక లెక్క... గణాంకాలకు మాత్రమే పరిమితమవుతుంది. గత బడ్జెట్ ప్రకటించిన లక్ష్యాలు, ఖర్చుల ప్రాధాన్యతలు పరిశీలిస్తే, భారతదేశం ఒక విస్తృత ప్రజా ఆధారిత అభివృద్ధి మార్గాన్ని కాకుండా, సంకుచితమైన, అసమానతలను పెంచే దారిని ఎంచుకుంటున్నట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి పంథాలో, విద్య, ఆరోగ్యం వంటి మానవ మూలధనంపై పెట్టుబడుల కొరత అత్యంత తీవ్రమైన లోపం. ఏ దేశానికైనా దీర్ఘకాలిక అభివృద్ధికి ఇవే మూలస్తంభాలు. కానీ ఇవి ఖర్చుల జాబితాలో ఇప్పటికీ ప్రాధాన్యత పొందడం లేదు. విద్యారంగానికి కేటాయింపులు పేరుకే పెరుగుతున్నా, జిడిపిలో వాటి వాటా దాదాపు స్థిరంగా ఉంది. జాతీయ విద్యా విధానం ప్రకటించిన 6 శాతం లక్ష్యం కాగితాలకే పరిమితం అవుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నాణ్యతలో వెనుకబడి ఉండటం, మౌలిక వసతుల కొరత, విద్యా రంగంలో తగినంత మంది ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జ్ఞాన ఆర్థిక వ్యవస్థ నిర్మిస్తామన్న మాటలు.. హామీలు వాస్తవానికి దూరంగా కనిపిస్తున్నాయి.




ఉన్నత విద్యలో పరిస్థితి మరింత సంక్లిష్టం. నాణ్యమైన ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సంఖ్య పెరగక పోవడం వల్ల, ప్రైవేటు రంగం ఖాళీలను భర్తీ చేస్తోంది. కానీ, అది విద్యను ఒక సామాజిక హక్కుగా కాకుండా, ఒక ఖరీదైన వస్తువుగా మార్చుతోంది. ఫలితంగా ప్రతిభ ఉన్నా, ఆర్థిక స్థోమత లేని యువత వెనుకబడుతోంది. ఫలితంగా అటు ప్రజలకు, ఇటు దేశానికి కూడా మానవ వనరులను సంపూర్ణ వినియోగించుకోలేక పోవడం అనేది భారీ నష్టానికి దారితీస్తుంది. ఆరోగ్య రంగం కథ కూడా అంతే ఆందోళనకరం. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం జిడిపిలో సుమారు 1.8 శాతానికే పరిమితం అవుతోంది. ఇది ప్రపంచంలోనే తక్కువ స్థాయిల్లో ఒకటి. బీమా ఆధారిత పథకాలు విస్తరిస్తున్నా, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి అవసరమైన పెట్టుబడులు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కొరత, పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై అధిక భారం, వైద్య సిబ్బంది కొరత వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. ఆరోగ్యం ప్రైవేటు రంగానికి వదిలివేయబడుతున్నప్పుడు, అది ఖర్చుతో కూడిన సేవగా మారుతుంది. పేద కుటుంబాలు అనారోగ్యం వల్ల అప్పుల పాలవడం, పేదరికంలోకి నెట్టబడటం ఈ వ్యవస్థలో సాధారణం. గ్రామీణ ఉపాధి, జీవనోపాధుల విషయంలో కూడా బడ్జెట్ దృక్పథం సంకుచితంగానే ఉంది. ఉపాధి హామీ పథకాలు కేవలం సంక్షేమ నిర్వహణ సాధనాలుగా మారుతున్నాయి. వాటికి సరిపడా నిధులు కేటాయించకపోవడం, రాష్ట్రాలపై భారం మళ్లించడం వల్ల, చట్టపరంగా హామీ ఇచ్చిన ఉపాధి కూడా అనిశ్చితంగా మారుతోంది. ఆలస్యంగా వేతనాలు, పనిదినాల కొరత వంటి సమస్యలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నాయి. గ్రామీణ ఆదాయం పెరగకుండా, దేశీయ డిమాండ్ ఎలా పెరుగుతుందన్న ప్రశ్నకు సమాధానం లేదు. దీనికితోడు ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచి, కొత్త విధానాన్ని తీసుకురావడం ద్వారా కేంద్రం గ్రామీణ ఉపాధిపై దారుణంగా దెబ్బతీసిందనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పలు లోపాలకు తోడు, పన్నుల నిర్మాణంలో జరుగుతున్న మార్పు మరింత ఆందోళన కలిగిస్తోంది.

గత దశాబ్దంలో పన్నుల భారాన్ని మూలధనం నుంచి వినియోగంపైకి మళ్లించిన స్పష్టమైన ధోరణి కనిపిస్తోంది. కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతుండగా, పరోక్ష పన్నుల వాటా పెరుగుతోంది. వస్తు సేవల పన్ను వ్యవస్థలో బహుళ రేట్లు ఉన్నా, అవి మౌలిక వినియోగ వస్తువులపై కూడా భారాన్ని మోపుతున్నాయి. ఫలితంగా పేదలు, మధ్యతరగతి తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. అత్యంత సంపన్న వర్గాలపై ప్రత్యక్ష పన్నుల ద్వారా సముచిత భారం మోపే ప్రయత్నం కనిపించడం లేదు. సంపద పన్ను, వారసత్వ పన్ను వంటి అంశాలు చర్చకే రాకపోవడం అసమానతలను మరింత పెంచుతోంది. దేశంలో ఆదాయ, సంపద అంతరాలు పెరుగుతున్నాయన్న గణాంకాలు స్పష్టంగా చూపుతున్నా, బడ్జెట్ విధానాలు ఆ వాస్తవాన్ని ఎదుర్కొనే ధైర్యం చూపడం లేదు. ఇది కేవలం నైతిక సమస్య కాదు; ఆర్థిక సమస్య కూడా. అధిక అసమానతలు వినియోగాన్ని తగ్గిస్తాయి, సామాజిక ఉద్రిక్తతలను పెంచుతాయి, దీర్ఘకాలిక వృద్ధిని దెబ్బతీస్తాయి. బడ్జెట్ అమలు విషయంలో కూడా ఒక స్పష్టమైన అంతరం కనిపిస్తోంది. ప్రకటించే కేటాయింపులు, వాస్తవ ఖర్చుల మధ్య తేడా సంవత్సరానికొకసారి పెరుగుతోంది. వ్యవసాయం వంటి కీలక రంగాలకు కేటాయింపులు తగ్గడం, రైతుల ఆదాయ సమస్యలను మరింత తీవ్రం చేస్తోంది. రాష్ట్రాలకు ఇచ్చే ప్రత్యేక సహాయ పథకాలు కఠిన షరతులతో ఉండటం వల్ల, తక్కువ సామర్థ్యం ఉన్న రాష్ట్రాలు వాటిని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నాయి. దీని వల్ల ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతున్నాయి. భౌతిక మౌలిక వసతులపై పెట్టుబడులు అవసరం అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. రహదారులు, పోర్టులు, రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. కానీ అవే అభివృద్ధి యొక్క అంతిమ లక్ష్యమని భావించడం ప్రమాదకరం. పాఠశాలలు, ఆసుపత్రులు, పరిశోధనా కేంద్రాలు వంటి సామాజిక మౌలిక వసతులు లేకుండా, కేవలం కాంక్రీట్ నిర్మాణాలు దేశాన్ని ముందుకు తీసుకెళ్లలేవు. మానవ సామర్థ్యం లేకుండా, ఆ కాంక్రీట్ వసతులు ఉపయోగం లేకుండా పోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే బడ్జెట్ ఒక కీలక మలుపు. ఇది గత దారిలోనే కొనసాగుతుందా, లేక నిజమైన మార్పుకు నాంది పలుకుతుందా అన్నది దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ముందుగా మానవ మూలధనంపై పెట్టుబడులను కేంద్రంగా పెట్టే దృక్పథం అవసరం. ఆరోగ్యం, విద్యపై ప్రభుత్వ ఖర్చును చట్టబద్ధంగా పెంచే స్పష్టమైన మార్గపటాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఇది ఖర్చు కాదు; ఉత్పాదకత, సామాజిక స్థిరత్వంపై పెట్టుబడి. ఇక్కడ, ఉపాధి హామీని గ్రామీణ అభివృద్ధి యొక్క పునాదిగా చూడాలి. దీన్ని తాత్కాలిక ఉపశమన పథకంగా కాకుండా, భూమి, నీరు, పర్యావరణ పునరుద్ధరణతో అనుసంధానించి దీర్ఘకాలిక ఆస్తులను సృష్టించే సాధనంగా మార్చాలి. సరిపడా నిధులు, సమయానికి వేతనాలు, రాష్ట్రాలకు పూర్తి మద్దతు ఇందులో కీలకం.మూడవది, పన్నుల వ్యవస్థలో సమానత్వం తీసుకురావాలి. అత్యంత సంపన్న వర్గాలు దేశ అభివృద్ధికి తగిన వాటా ఇవ్వాల్సిందే. ఇది ప్రతీకారం కాదు; సామాజిక ఒప్పందం. సమానత్వం లేకుండా స్థిరమైన వృద్ధి సాధ్యం కాదు. ఏదిఏమైనా దేశ ఆర్థిక విధానాలలో పారదర్శకత అవసరం. బడ్జెట్ ప్రకటనలు, అమలు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలి. ప్రజలు తమ పన్నుల డబ్బు ఎక్కడ, ఎలా ఖర్చవుతుందో తెలుసుకునే హక్కు కలిగి ఉండాలి. విద్య రంగంలో లోపం, ఆరోగ్యంలో అనిశ్చితి, అసమానతలతో నిండిన సమాజంపై అధిక ఆదాయ దేశాన్ని నిర్మించలేం. అలాంటి మార్గం దేశాన్ని అభివృద్ధి వైపు కాదు, అస్థిరత వైపు తీసుకెళ్తుంది. ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్, పాత దారిలోనే కొనసాగి అసమానతలను లోతుగా చేస్తుందా, లేక ప్రజలను అభివృద్ధి కేంద్రంగా ఉంచే ధైర్యమైన మార్పుకు నాంది పలుకుతుందా? అనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న. ఇప్పుడు దేశానికి కావాల్సింది గణాంకాలు కాదు, కోట్లాది మంది అనుభవిస్తున్న సమస్యలకు సరైన సమాధానాలు. ఇప్పుడు మార్పు చేయకపోతే, ఆ మార్పు ఖర్చు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

– (న్యూస్‌క్లిక్ సౌజన్యంతో)

## 2027 'గగన్‌యాన్' కోసం... మొదటి మానవరహిత మిషన్ రెడీ

ఇస్రో చైర్మన్ వి.నారాయణన్

రాకెట్ వ్యవస్థలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడమే ఇస్రో ధ్యేయమని వెల్లడి




చెన్నై : భారతదేశం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రాజెక్ట్‌లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఒక ముందడుగు వేసింది. 2027 నాటికి చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి మానవ రహిత రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ భారతదేశపు మొట్ట మొదటి మానవ అంతరిక్ష విమాన కార్యక్రమమని, ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉందని అన్నారు. మూడు రోజుల మిషన్‌లో ముగ్గురు సభ్యుల సిబ్బందిని అంతరిక్షంలోకి పంపించి వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకురావాలన్న ధ్యేయంతో గగన్‌యాన్ మిషన్ ఇస్రో కృషిచేస్తోందన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్ట్‌ను 2027 కోసం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. దీనికి ముందు ఇస్రో మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగించడం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన శుక్రవారం రాత్రి ఇక్కడ విలేకరులకు వివరించారు. ప్రస్తుతం శాస్త్రవేత్తలు ఈ మిషన్ విజయంతం కావడానికి చాలా పరీక్షలు నిర్వహించడంలో నిమగ్నమై ఉన్నారని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీనికోసం చాలా పరీక్షలు జరుగుతున్నప్పటికీ గగన్‌యాత్రి సురక్షితం అనేది అత్యంత ముఖ్యమైనదన్న విషయం మీకు తెల్సిందేనని విలేకరులను ఉద్దేశించి అన్నారు. అందుకే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఆచితూచి అడుగులు ముందుకు వేస్తోందన్నారు. అంతేకాకుండా ప్రతీ వ్యవస్థలోనూ ఇస్రో అర్హత సాధించాల్సి ఉంటుందని, ముఖ్యంగా రాకెట్ వ్యవస్థలో నూటికి నూరు శాతం ఫలితాల ను సాధించాల్సిన అవసరం ఉందని, కర్తవ్యాన్ని స ంపూర్ణంగా నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఆ దిశగా అ డుగులు మందుకు వేస్తున్నామన్నారు. గగన్‌యాన్ ను విజయవంతం చేయాలన్నదే అంతిమ లక్ష్యం కూడా అని ఇస్రో చైర్మన్ వెల్లడించారు. జనవరి 12న ప్రయోగించబడిన తర్వాత రాకెట్ మూడవ దశలో పిఎస్‌ఎల్‌వి సి62 మిషన్‌లో కొన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఈ నేపథ్యంలో పరిస్థితులను గాడిలో పెట్టడానికి శాస్త్రవేత్తలు రాకెట్‌లోని ప్రతీ విషయాన్ని క్షణ్ణంగా అధ్యయనం చేస్తున్నారని నారాయణన్ వివరించారు.

## పాలసీ తయారీలో పేళవ సమన్వయం

బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: బడ్జెట్ తర్వాత కొద్ది రోజులకే కొత్త జిడిపి, వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ) సిరీస్ విడుదల కానున్నాయి. అయితే బడ్జెట్ సంఖ్యలు విడుదలైన వెంటనే సవరణలకు గురవుతాయా అని కాంగ్రె ప్రశ్నించింది. విధాన రూపకల్పనలో సమన్వయంపై ఇది పేలవంగా ప్రతిబింబిస్తుందని పేర్కొంది. 2026–27 బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదివారం పార్లమెంట్‌లో సమర్పించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ గుర్తుచేశారు. '16వ ఆర్థిక సంఘం సిఫార్సుల అమలును ఆర్థిక మంత్రి ప్రకటించనున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు తమ కోసం ఏమి చేయబోతున్నారో అని ఆత్రుతగా ఎదురు చూస్తాయి' అని జైరామ్ రమేష్ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఫిబ్రవరి 1, 2026న బడ్జెట్ ఆవిష్కరించబడిన వెంటనే సవరణలకు లోనవుతాయా అని ఆయన ప్రశ్నించారు. 2024ని బేస్‌గా కలిగి ఉన్న కొత్త సిపిఐ సిరీస్ ఫిబ్రవరి 12, 2026న విడుదల కానుందని కాంగ్రెస్ నాయకుడు లేవనెత్తారు. కొత్త సిరీస్ ఆహార ధరల వాటాలో గణనీయమైన తగ్గుదలని చూస్తుందని అంచనా వేశారని, ఇదే జరిగితే, బడ్జెట్ సంఖ్యలపై ప్రభావం ఉంటుందన్నారు. హోల్ సే ల్ ధరల సూచిక కూడా సవరణకు గురవుతోందని, బహుశా అది రాబోయే కొన్ని నెలల్లో బహిరంగపరచబడుతుందని రమేష్ అన్నారు. ఏ విధంగానైనా, విధాన రూపకల్పనలో సమన్వయంపై ఇది పేలవంగా ప్రతిబింబిస్తుందని ఆయన చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

భువనేశ్వర్ : ఒడిశాలోని గంజాం జిల్లాలో ఒక ట్రక్కు మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ఘటనలో కనీసం ఐదుగురు మరణించగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు శనివారం ఉదయం తెలిపారు. ఈ ప్రమాదం బెర్హంపూర్ నగరం గుండా వెళ్లే జాతీయ రహదారి 16పై హల్దియాపదార్ వద్ద జరిగింది. ట్రక్కు జాతీయ రహదారిపై తప్పు వైపున ప్రయాణిస్తోందని, అది ఒక వంతెనను ఢీకొనడానికి ముందు వరుసగా మూడు మోటార్ సైకిళ్లను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 'నలుగురు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే మరణించగా, మరొకరు తర్వాత గాయాలతో మరణించారు. గాయపడిన వారిలో కొందరు పాదచారులు కూడా ఉన్నారు, వారిని ఎంకెసిజి మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. పోలీసుల ప్రకారం, వేగంగా వస్తున్న ట్రక్కు మూడు బైక్లను ఢీకొని సుమారు 200 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటన జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

## మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా.. సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం

ముంబయి: విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం సాయంత్రం ముంబయిలోని లోక్ భవన్‌లో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. మహారాష్ట్ర డిప్యూటీ సిఎం పదవి చేపట్టిన తొలి మహిళగా సునేత్ర పవార్ నిలిచారు. సిఎం దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. 'అజిత్ దాదా అమర్ రహే' అన్న ఎన్‌సిపి నేతలు, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంగణం మారుమోగింది. కాగా, డిప్యూటీ సిఎంగా ప్రమాణ స్వీకారానికి ముందు ఎన్‌సిపి శాసనసభా పక్ష నాయకురాలిగా సునేత్ర పవార్ ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపి అయిన ఆమె ఆరు నెలల్లోగా ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాల్సి ఉన్నది. మరోవైపు అజిత్ పవార్ నిర్వహించిన ఎక్సైజ్, క్రీడల మంత్రిత్వ శాఖల బాధ్యతలు కూడా సునేత్ర పవార్ కొనసాగించనున్నారు. అయితే మార్చిలో బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో




అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థిక శాఖను సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ తాత్కాలికంగా తన వద్ద ఉంచుకున్నారు. ఆర్థిక శాఖను ఆ తర్వాత ఎన్సీపీకి కేటాయించనున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, ఉదయం సునేత్రా పవార్ ఎన్‌సిపి శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపి అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎన్‌సిపి ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సునేత్ర ప్రమాణస్వీకారం నాకు తెలియదు : శరద్ పవార్

బారామతి: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా దివంగత అజిత్ పవార్ సతీమణి, రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం చేయడంపై ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ స్పందించారు. ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు కూడా మీడియా ద్వారానే విషయం తెలిసిందని పేర్కొన్నారు. శనివారం బారామతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సిపికి చెందిన రెండు వర్గాలు ఏకమవ్వాలన్నదే అజిత్ పవార్ ఆశయమని తెలిపారు. 'ప్రమాణ స్వీకారం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో వచ్చిన వార్తల ద్వారానే మేము తెలుసుకున్నాం. ఆ విషయంపై నాకు ఏమీ తెలియదు. ఈ నిర్ణయం పార్టీ స్థాయిలో తీసుకుని ఉండవచ్చు. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే వంటి కొందరు నేతలు ఈ అంశంలో చొరవ తీసుకున్నారు అనుకుంట. వారు ఏదో నిర్ణయం తీసుకుని ఉండవచ్చు' అని శరద్ పవార్ తెలిపారు. అజిత్ పవార్ మరణం అనంతరం వెంటనే రాజకీయ నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించగా, ముంబయిలోని మహాయుతి ప్రభుత్వ నేతల స్థాయిలో నిర్ణయాలు జరుగుతున్నాయని శరద్ పవార్ తెలిపారు. 'కుటుంబంలో ఏదైనా సమస్య వస్తే కుటుంబం మొత్తం కలిసే ఉంటుంది. కుటుంబంలో ఎలాంటి సమస్యలు లేవు. ఈ చర్చలన్నీ ఇక్కడ జరగడం లేదు. అవన్నీ ముంబయిలోనే జరుగుతున్నాయి. ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే సహా ఇతర సీనియర్ నేతలు ఈ అంశాలపై చర్చిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలు అవన్నీ వారి తీసుకున్న నిర్ణయాల్లాగే కనిపిస్తున్నాయి. దీనిపై నేను వ్యాఖ్యానించను' శరద్ పవార్ అన్నారు.

**'అజిత్ పవార్ కోరిక అదే'**

అజిత్ పవార్ కోరిక నేరవేరాలని భావిస్తున్నట్లు శరద్ పవార్ తెలిపారు. 'అజిత్ పవార్, శశికాంత్ షిండే, జయంత్ పాటిల్ రెండు వర్గాల విలీనంపై చర్చలు ప్రారంభించారు. విలీనానికి తేదీ కూడా నిర్ణయించారు. ఫిబ్రవరి 12న విలీనం జరగాల్సి ఉంది. అయితే, ఆ తేదీకి ముందే అజిత్ మనలను విడిచి వెళ్లిపోయారు. అజిత్ పవార్ ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకుని, వారికి న్యాయం



దక్కేలా పనిచేసేవారు. బారామతి ప్రజలు ఎప్పుడూ ఆయనకు అండగా నిలిచారు. ఆయన తన బాధ్యతల్లో ఎప్పుడూ వెనుకాడలేదు. ఆయన మృతి మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. ఈ పరిస్థితుల్లో మనం ధైర్యంగా ముందుకు సాగాలి. ప్రజల బాధలు తగ్గించే దిశగా పనిచేయాలి. ఆయన అనుసరించిన విలువలు, విధానాలను కొనసాగించాలి. ఆయన కుటుంబంలోని కొత్త తరం తప్పకుండా ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తుందని నాకు నమ్మకం ఉంది' అని శరద్ పవార్ అన్నారు. ఇక రెండు ఎన్‌సిపి వర్గాల విలీనమైతే ఎన్‌డిఎలో చేరుతారా? అని అడగ్గా, ఇవన్నీ మీడియా వైపు జరుగుతున్న చర్చలే అని ఇక్కడ అలాంటిదేమి లేదని శరద్ పవార్ స్పష్టం చేశారు.

## నీట్ విద్యార్థి మృతిపై సిబిఐ దర్యాప్తునకు సిఫార్సు

ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి




పాట్నా : పాట్నాలో ఇటీవల జరిగిన నీట్ విద్యార్థిని మృతిపై బిహార్ ప్రభుత్వం సిబిఐ దర్యాప్తుకు సిఫార్సు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు. ఈ కేసును బిహార్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తోంది. జెహనాబాద్‌కు చెందిన నీట్ విద్యార్థిని ఈ నెల ప్రారంభంలో పాట్నాలోని చిత్రగుప్త నగర్‌లోని శంభు బాలికల హాస్టల్‌లో అపస్మారక స్థితిలో కనిపించింది. చాలా రోజులు కోమాలో ఉన్న ఆమె ఈనెల 11న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించింది. ఆమెపై లైంగిక దాడి జరిగిందని, అధికారులు దానిని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆమె కుటుంబం ఆరోపించింది. 'పాట్నాలో జరిగిన నీట్ విద్యార్థిని హత్య కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జీ భారత ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను పారదర్శకంగా, న్యాయంగా పూర్తిగా బయటపెట్టాలి' అని చౌదరి ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్మెంట్ (డిఎస్‌పిఇ) చట్టంలోని నిబంధనల ప్రకారం ఈ కేసుపై సిబిఐ దర్యాప్తుకు సిఫార్సు చేస్తూ రాష్ట్ర హోం శాఖ కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రానికి సంబంధించిన కేసులో సిబిఐ దర్యాప్తు ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వానికి చెందిన సిబ్బంది, శిక్షణ విభాగం (డిఒపిటి) ఈ విషయంలో ఒక నోటిఫికేషన్ జారీ చేస్తుంది. నిబంధనల ప్రకారం, చట్టం, భద్రత రాష్ట్రానికి సంబంధించిన అంశం కాబట్టి, ఏజెన్సీ అధికార పరిధికి వెలుపల జరిగిన నేరాన్ని దర్యాప్తు చేయడానికి రాష్ట్రం, డిఒపిటి ముందస్తు అనుమతి అవసరం. పోలీసులు మహిళపై లైంగిక దాడి జరగలేదని, అది ఆత్మహత్య కేసు అని పేర్కొంటూ ఈ విషయాన్ని దాచిపెట్టడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని నీట్ అభ్యర్థి తల్లిదండ్రులు ఆరోపించారు. పాట్నా పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా సిబిఐ ఇప్పుడు ప్రత్యేక కేసు నమోదు చేయవచ్చని, ఏజెన్సీ స్లూత్‌లు పోలీసులు పొందిన అన్ని ఆధారాలను సేకరిస్తారని, అనుమానితులు, అరెస్టు చేసిన వ్యక్తి, ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, పోలీసుల వాంగ్మూలాలను కూడా నమోదు చేస్తారని, వారు మొదట ఈ కేసును దర్యాప్తు చేసి ఆత్మహత్య కేసుగా తేల్చారని అధికారి తెలిపారు. కాగా, ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ, కేసును సిబిఐకి బదిలీ చేయాలనే నిర్ణయం భూమి, ఆకాశం లో తుల్లోంచి నేరస్థులను పట్టుకోవడం గురించి రాత్రింబవళ్లు గొప్పగా మాట్లాడే ఎన్‌డిఎ ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆరోపించారు.

## కశ్మీరీలపై దాడులకు వ్యతిరేకంగా పిడిపి నిరసనలు




శ్రీనగర్ : దేశంలోని ఇతర ప్రాంతాలలో కశ్మీరీలపై దాడులకు వ్యతిరేకంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన నిరసన తర్వాత జమ్ముకశ్మీర్ పోలీసులు తమ శాంతియుత మార్చ్‌ను ఆపారని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) ఆరోపించింది. కశ్మీరీలను కేంద్రపాలిత ప్రాంతంలో బోనులో బంధించారని, తరువాత బయటకు తరమేశారని పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆరోపించారు. షేర్–ఎ–కశ్మీర్ పార్క్ సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిరసనకారులు సమావేశమై ప్రదర్శన నిర్వహించారు. వారు బయట ప్రధాన రహదారి వైపు కవాతు చేయాలనుకున్నారు. అయితే, ప్రధాన కార్యాలయ గేట్లను బయటి నుండి లాక్ చేసిన పోలీసులు వారిని ఆపారని పార్టీ సభ్యులు తెలిపారు. పిడిపి శ్రీనగర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖయూమ్ భట్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు బయట నిరసన తెలియజేయాలనుకున్నారు కానీ పోలీసులు వారిని అనుమతించలేదన్నారు. కశ్మీర్ వెలుపలి ప్రజలపై దాడి చేసేవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, దాడులకు వ్యతిరేకంగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయాలనుకునే వారిని ఆపుతున్నారని మండిపడ్డారు. కశ్మీర్ ప్రజలు, పిల్లలు సహా, చదువుకోవడానికి లేదా జీవనోపాధి కోసం బయటకు వెళతారని, అయితే అక్కడ వారిపై దాడులు జరుగుతున్నాయని, అయినా ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. 'వారు కాశ్మీరీలపై ఎందుకు దాడి చేస్తున్నారు? ఒమర్ అబ్దుల్లా, కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ దాడులు ఆగిపోవాలని కోరుకుంటున్నాము' అని పిడిపి నాయకుడు పేర్కొన్నారు.

## భారత్ జోడో యాత్ర దేశ రాజకీయాల్లో పరివర్తన కలిగించే ఘటన: కాంగ్రెస్


ఫైల్ ఫోటో

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో యాత్ర, ఆర్థిక అసమానతలు, సామాజిక ధ్రువణతను తీవ్రతరం చేయడం, రాజకీయ నిరంకుశత్వాన్ని పెంచడం అనే మూడు సందేశాలను ప్రజలకు చేరవేసిందని కాంగ్రెస్ శనివారం పేర్కొంది. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు జరిగిన 'పాదయాత్ర' మూడు సంవత్సరాల క్రితం శ్రీనగర్‌లో గాంధీ చేసిన ఉత్తేజకరమైన ప్రసంగంతో ముగిసిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 4,000 కి.మీ. పాదయాత్రను రాహుల్ గాంధీ, 200 మందికి పైగా భారత యాత్రికులు కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు కాలినడకన చేపట్టారన్నారు. ఇది 12 రాష్ట్రాలు, 2 యుటిలను కవర్ చేస్తూ 145 రోజులకు పైగా కొనసాగిందని ఆయన గుర్తుచేశారు. ఈ యాత్ర మన దేశ రాజకీయాల్లో ఒక లోతైన పరివర్తన కలిగించే ఘటన అని ఆయన కొనియాడారు. ఇది రాబోయే దశాబ్దాలుగా గుర్తుండిపోతుందిదని, గౌరవించబడుతుందని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర జనవరి 30, 2023న ముగిసింది. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు దాదాపు 4,000 కిలోమీటర్లు సాగిన తన ప్రతిష్ఠాత్మక ప్రయాణాన్ని ముగించిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో పాటు అనేక పార్టీల నాయకులు యాత్రలో చేరారు.

## ఓట్ల కోసం దేశ భద్రత తాకట్టు

బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వంపై అమిత్ షా మండిపాటు

కోల్‌కతా : బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతనే పణంగా పెడుతోందని మండిపడ్డారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బరాక్‌పూర్‌లో జరిగిన బిజెపి కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మా, మట్టి, మనుష్' (అమ్మ, మట్టి, మనిషి) నినాదంతో అధికారంలోకి వచ్చిన మమత పాలనలో, నేడు ఆ మూడూ ప్రమాదంలో పడ్డాయని ఆయన ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మమత ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, దేశ రక్షణ కోసం బంగాల్‌లో బిజెపి జెండా ఎగరడం అత్యవసరమని అమిత్ షా తేల్చిచెప్పారు. నేడు బెంగాల్‌లో 'మా, మట్టి, మనుష్' సురక్షితంగా లేవని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకపోవడమే కాకుండా వారికి భద్రత కరవైందన్నారు. బెంగాల్ నేలను చొరబాటుదారులు మింగేస్తున్నారని, ఇక్కడి సామాన్య ప్రజలు మమత సిండికేట్ ఆగడాలతో, దోపిడీలతో నలిగిపోతున్నారని అమిత్ షా విమర్శించారు. అమిత్ షా తన ప్రసంగంలో చొరబాట్ల అంశాన్ని ప్రధానంగా లేవనెత్తారు. ఇది కేవలం రాష్ట్ర సమస్య కాదని స్పష్టం చేశారు.'బెంగాల్‌లో చొరబాటుదారులు యథేచ్ఛగా వస్తున్నారు. ఇది ఇప్పుడు కేవలం బెంగాల్ సమస్య కాదు, మొత్తం దేశ భద్రతకే ముప్పుగా మారింది. సరిహద్దుల్లో కంచె వేయడానికి భూమి ఇవ్వాలని కోర్టులు ఆదేశించాయి. అయినా సరే మమత ప్రభుత్వం సరిహద్దు భద్రతా దళానికి భూమి ఇవ్వడం లేదు. ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారు. ఎందుకంటే ఆ చొరబాటుదారులు టిఎంసికి ఓటు బ్యాంకుగా మారారు' అని అన్నారు. 'రాష్ట్రంలోని పోలీసులు, అధికారులు అక్రమ వలసదారులను అడ్డుకోవడం లేదు. నకిలీ పత్రాలు సృష్టించి వారిని దేశమంతటా పంపిస్తున్నారు. దీనివల్ల దేశంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి' అని ఆరోపించారు. మమత బెనర్జీ తీరును రామాయణంలోని రావణుడితో పోల్చుతూ షా వ్యాఖ్యలు చేశారు. 'రాముడు సముద్రంపై వారధి కడుతున్నప్పుడు, ఈ భూమ్మీద నన్ను ఓడించేవారే లేరని రావణుడు అహంకరించి అనుకున్నాడు. ప్రతిపక్ష నాయకుడు కేసును పట్టుకోవడం గురించి రాత్రింబవళ్లు గొప్పగా మాట్లాడే ఎన్‌డిఎ (కానీ ఏం జరిగిందో అందరికీ తెలుసు. మమత జీ, మీరు కూడా అలాగే అనుకుంటున్నారు. కానీ ఈసారి బిజెపి సునామీని ఆపలేరు. వచ్చే ఎన్నికల్లో మాకు 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయి. భారీ మెజారిటీతో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుంది' అని జోస్యం చెప్పారు.

# ఎవరికి ప్రయోజనం?

యూరోపియన్ యూనియన్ (ఇయు)తో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎవరికి ప్రయోజనం? అందులోని లోటుపాట్లను సవరించుకోవడానికి ఆదివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేంద్రం తీసుకోబోయే చర్యలు ఏమిటి? అభివృద్ధి ఫలాలు వాస్తవంగానే సామాన్య ప్రజలకు అందుతున్నాయా? వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. కార్పొరేట్ ప్రపంచంలో, ప్రభుత్వాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధారణంగా 'సమాన అవకాశాలు', 'వృద్ధి', 'ఉజ్వల భవిష్యత్తు', 'దేశ అవసరాలు' వంటి చక్కటి పదాల కూడికతో, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, సాధారణ ప్రజల జీవితాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనేది ప్రశ్న. భారత–యూరప్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఇదే ప్రశ్నను తెరపైకి తెచ్చింది. రెండు దశాబ్దాలకు పైగా చర్చల తర్వాత సంతకం చేసిన ఈ ఒప్పందం చారిత్రకమని కొందరు, ప్రమాదకరమని మరికొందరు.. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తేడాలు కేవలం రాజకీయ అభిప్రాయాలు లేదా సిద్ధాంతాలపై ఆధారపడినవిగా భావించలేం. ఎందుకంటే, ఈ ఒప్పందం దేశ ఆర్థిక దిశ, స్వయం ఆధారిత అభివృద్ధి, సామాజిక సమానత్వం వంటి మూల ప్రశ్నలకు సంబంధించినది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ప్రస్తుతం తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉంది. అమెరికా వంటి శక్తివంతమైన దేశాలు తమ అంతర్గత ఆర్థిక సమస్యలకు పరిష్కారంగా సుంకాలు, వాణిజ్య ఆంక్షలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్కెట్లు, కొత్త వాణిజ్య భాగస్వామ్యాల కోసం దేశాలు పరుగులు పెడుతున్నాయి. భారత్‌తో పాటు, ఐరోపా దేశాలు కూడా ఇదే ఒత్తిడిలో ఉన్నాయి. అందుకే ఈ ఒప్పందాన్ని పరస్పర ఉపశమనంగా చిత్రీకరిస్తున్నారు. అయితే, ఒక ఒప్పందం రెండు పక్షాలకు సమాన ప్రయోజనాలు అందిస్తుందా? లేక ఒక పక్షానికి తక్షణ లాభాలు, మరొక పక్షానికి దీర్ఘకాలిక నష్టాలా అన్నది కీలకం. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం యూరప్ నుంచి దిగుమతి అయ్యే 96 శాతం పైగా వస్తువులపై సుంకాలను తొలగించాలి లేదా గణనీయంగా తగ్గించాలి. యంత్రాలు, మద్యం, ప్రాసెస్డ్ ఆహారం వంటి రంగాలు ఇందులో ఉన్నాయి. ప్రతిఫలంగా యూరప్ భారతదేశం నుంచి దిగుమతి అయ్యే దాదాపు అన్ని వస్తువులపై సుంకాలను తగ్గిస్తుంది. కాగితంపై ఇది సమానంగా కనిపించినా, రెండు ఆర్థిక వ్యవస్థల నిర్మాణాలు, సామర్థ్యాలు, ఉత్పత్తి వ్యయాలు ఒకేలా కావు.

అధునాతన సాంకేతికత, భారీ సబ్సిడీలు, బలమైన మౌలిక వసతులు ఉన్న యూరప్ ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి భారీగా ప్రవేశించే అవకాశముంది. అదే సమయంలో, భారతదేశం నుంచి వెళ్లే వస్తువులు అక్కడి కఠిన ప్రమాణాలు, నియంత్రణలను ఎంతవరకు తట్టుకుంటాయన్నది అనుమానమే. దేశ ఉపాధి కల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తున్న రంగాలు శ్రమాధారితమైనవి. చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయం, అనుబంధ రంగాలు కోట్లాది మందికి జీవనాధారం. ఈ రంగాల్లో సుంకాల తగ్గింపు స్థానిక ఉత్పత్తిని తీవ్ర పోటీకి గురిచేస్తుంది. తక్కువ ధరలకు, అధిక నాణ్యతతో వచ్చే దిగుమతులు దేశీయ తయారీదారులను నిలువరించవచ్చు. పెద్ద కార్పొరేట్లకు ఇది అవకాశంగా మారినా, చిన్న ఉత్పత్తిదారులకు, కూలీలకు ఇది ఉపాధి సంక్షోభాన్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. గతంలో జరిగిన కొన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల అనుభవాలు ఈ వాస్తవాన్నే స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయరంగంలో ఈ ఒప్పందం మరింత ప్రమాదకరం. కొన్ని కీలక పంటలను మినహాయించినప్పటికీ, పలు వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులపై సుంకాల తొలగింపు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతుంది.

యూరప్‌లో వ్యవసాయం భారీ ప్రభుత్వ మద్దతుతో సాగుతుంది. అలాంటి ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి వస్తే, ఇప్పటికే ఖర్చులు పెరిగి, ధరలు తగ్గిపోతున్న రైతులు ఎలా పోటీ పడతారు? ఆటోమొబైల్ వంటి రంగాల్లోనూ ఇలాంటి సమస్యలే తలెత్తే అవకాశం ఉంది. విదేశీ కార్లపై ఉన్న అధిక సుంకాలను క్రమంగా తగ్గించడం వల్ల వినియోగదారులకు తక్కువ ధరల వద్ద ఎంపికలు పెరిగినట్లు కనిపించవచ్చు. కానీ అదే సమయంలో దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ, అనుబంధ భాగాల తయారీ, వాటిలో పనిచేసే లక్షలాది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. సాంకేతికత బదిలీ, స్థానిక తయారీ పెరుగుతుందన్న హామీలు గత ఒప్పందాల్లో ఎంతవరకు నెరవేరాయో పరిశీలిస్తే, ఈ హామీలపై అంధ విశ్వాసం అత్యంత ప్రమాదకరం. పైగా ఈ ఒప్పందంలో పారదర్శకత లోపించింది. ఇంత కీలకమైన ఒప్పందంపై సమగ్ర సమాచారం ప్రజల ముందుకు రావడం లేదు? చర్చలు ఎలా జరిగాయి? ఏ రంగాల్లో ఎలాంటి రాయితీలు ఇచ్చారు? దీర్ఘకాలిక ప్రభావాలపై ఏవైనా స్వతంత్ర అధ్యయనాలు జరిగాయా? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విధాన నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తే, వాటిపై విస్తృత చర్చ, పార్లమెంటరీ పరిశీలన అవసరం. ఆ ప్రక్రియ బలహీనంగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

వాణిజ్య ఒప్పందాలు కేవలం సరుకుల మార్పిడికి మాత్రమే పరిమితం కావు. అవి భౌగోళిక రాజకీయ సంబంధాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఈ ఒప్పందంలో భాగంగా ప్రతిపాదితమైన అంతర్జాతీయ వాణిజ్య కారిడార్ కూడా ఇదే కోవలోకి వస్తుంది. ఇది వాణిజ్య మార్గాల వైవిధ్యాన్ని పెంచుతుందనే వాదన ఉన్నప్పటికీ, కొన్ని భౌగోళిక నిర్ణయాలు నైతిక, మానవతా సంబంధమైన అంశాలు కూడా వెన్నంటే ఉన్నాయి. అంతర్జాతీయంగా వివాదాస్పదంగా ఉన్న ప్రాంతాలు, దేశాలతో వ్యూహాత్మక అనుసంధానం దేశ విదేశాంగ విధానంపై, ప్రపంచంలో దేశ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతుంది. ఆ కోణంలో కూడా ఈ ఒప్పందం విమర్శలకు గురవుతోంది. ఇయు సహా భారత్ ఇటీవల అనేక దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల సమష్టి ప్రభావం దేశ ఆర్థిక స్వావలంబనను బలపరుస్తుందా, లేదా బలహీనపరుస్తుందా? ఎగుమతులు పెరుగుతాయన్న అంచనాలు వాస్తవంగా అమలవుతున్నాయా? లేక దిగుమతులే వేగంగా పెరిగి వాణిజ్య లోటును మరింత పెంచుతున్నాయా? వంటి శేష ప్రశ్నలు ఎన్నో. వికాసాన్ని స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వంటి సంఖ్యలతో కొలవలేం. ఉపాధి, ఆదాయ సమానత్వం, ప్రాంతీయ సమతుల్యత, పర్యావరణ స్థిరత్వం వంటి అంశాలు కూడా కీలకమే. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధారణంగా పెద్ద నగరాలు, కార్పొరేట్ కేంద్రాలకు లాభాలు తెచ్చిపెడతాయి. గ్రామీణ ప్రాంతాలు, అసంఘటిత రంగాలు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొంటాయి. ఈ అసమానతలు సామాజిక అసంతృప్తికి, రాజకీయ అస్థిరతకు దారితీయవచ్చు. తొందరపాటు నిర్ణయాలు ఎప్పుడూ సరైన ఫలితాలను ఇవ్వవు. భారత్ ఆచితూచి వ్యవహరించాలి. ప్రగతి ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి.



దేశం ఎదుర్కొంటున్న సమస్యలు

## మీడియా స్వేచ్ఛ, పారదర్శకత

**ఆర్థిక దృక్కోణంలో నేడు దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సమస్యలు మీడియా స్వేచ్ఛ, పారదర్శకత. పెట్టుబడిదారులు రాజకీయ వాక్చాతుర్యం కంటే డేటా(అంకెల) విశ్వసనీయత గురించే పట్టించుకుంటారు. భారతదేశం విభజన రాజకీయాల దశలో ఉందని నేను భావిస్తున్నాను. చాలా కాలంగా అనేక సంఘర్షణలు కొనసాగుతున్నాయి. ఒక దేశంగా మనం ఎంతవరకు పారదర్శకంగా, విశ్వసనీయంగా కనిపించాలని అనుకుంటున్నామో మనం నిర్ణయించుకోవాలి. నిజమైన సమస్యలు మీడియా స్వేచ్ఛతో ముడిపడి ఉన్నాయి. ఊహించగలిగే, పారదర్శకమైన విధానాల పరిపాలన, పారదర్శక మీడియా లేకపోతే, భారతదేశం ప్రపంచానికి ఒక మర్మంగానే ఉంటుంది.**

'పిటిఐ'తో నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ

# మంత్రి వ్యాఖ్యల్లో వాస్తవమెంత?

ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను దృష్టిలో పెట్టుకొని చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. కొన్ని విద్యా సంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయని పేర్లతో సహా చెప్పడమే కాకుండా, తాను చెప్పినా నామమాత్రం తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌కెజి చదువులకు సైతం కొందరు లక్షల్లో వసూలు చేయడాన్ని ఆయన ఎత్తి చూపారు. అలాగే విద్యాహక్కు చట్టం కింద 25శాతం సీట్లను పేదలకు కేటాయించాలన్న నిబంధనను పాటించడం లేదన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన తన కుమారుడు ప్రతీక్ పేరిట నల్లగొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని స్వంత నిధులతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నిర్మించారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. ఆ భవన ప్రారంభోత్సవం సందర్భంగా కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ గురించి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థుల తల్లిదండ్రుల దుస్థితిని, వాస్తవాలను అద్దంపడుతున్నాయి.

ఇదేమీ ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన సమస్య కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 దశకంలో ఇంటర్మీడియెట్ విద్యారంగంలో పురుడుపోసుకున్న కార్పొరేట్ విద్యా సంస్కృతి నేడు వేళ్లూనుకుంది. మొదట్లో మెడిసిన్, ఇంజనీరింగ్ కోచింగ్ సెంటర్ల పేర్లతో ప్రారంభమైన ప్రైవేటు విద్యా సంస్థలు, తరువాత ఏకంగా ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థలోకి ప్రవేశించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 'చెయిన్ సిస్టమ్'తో కాలేజీలు ఏర్పాటు చేసుకున్నాయి. చివరకు రెండు, మూడు కార్పొరేట్ విద్యా సంస్థలే ఇంటర్, కోచింగ్ రంగంలో గుత్తాధిపత్యం సాధించి, విచ్చలవిడిగా ఫీజులను దండుకుంటున్నాయి. అవే విద్యా సంస్థలు పాఠశాల స్థాయిలో కూడా ప్రవేశించి, గత 10–15 ఏళ్ళలో మోస్తరు టౌన్‌లలో కూడా విస్తరించాయి. వీటితో పోటీకి తట్టుకోలేక స్థానిక కళాశాలలు, పాఠశాలలు కొన్ని వాటిలోనే విలీనమవ్వగా, మరికొన్ని మూసేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సైతం కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ ఒక అంశంగా ఉండేదనడంలో అతిశయోక్తి కాదు. ఏ పరీక్షైనా టాప్ ర్యాంకులన్నీ తమవేనని కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లు ఊదరగొట్టడం తంతుగా మారిపోయింది. టాప్ ర్యాంకర్లు కొందరు రెండు, మూడు విద్యా సంస్థలు కూడా తమవారేనని ప్రచారం చేసుకున్న సంఘటనలు కోకొల్లలు. అంటే దీని వెనుక నడిచిన వ్యవహారం అర్థమవుతుంది. విద్యార్థులకు ఇతర ఎంపికలు లేకుండా తమవైపే తిప్పుకునేలా చేస్తున్నాయి కార్పొరేట్ విద్యా సంస్థలు. ఇందుకు ఊళ్ళలో సైతం మార్కెటింగ్ తరహాలో పిఆర్‌ఒ నెట్‌వర్క్‌ను పెట్టి అకడమిక్ సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థుల అడ్మిషన్‌లను బుకింగ్ చేసుకుంటున్నారు.

కార్పొరేట్ స్కూళ్ళలో సైతం మాధ్యమిక విద్యా స్థాయిలోనే ఐఐటి, ఎయిమ్స్ కోచింగ్ పేర్లతో విద్యార్థులను ప్రభుత్వ సెలబస్, పరీక్షలతో సంబంధం లేకుండా సొంత సిలబస్‌తో పాఠాలు చెబుతున్నారు. మామూలు పాఠశాలలకంటే మూడింతలు ఫీజు కట్టి ఆ పాఠశాలలో తమ పిల్లలను చేర్చిన తల్లిదండ్రులకు ఆ పాఠశాల నుంచే స్కూల్ డ్రెస్, వారు స్వంతంగా తయారు చేసిన కట్టలకు కట్టల టెక్స్ట్ బుక్స్, సాక్సులు అన్నీ పదుల వేలు పెట్టి కొనాల్సిందే! అందులో పిల్లలను ఇతర పాఠశాలల మాదిరిగా కాకుండా అదనపు గంటలు పాఠశాలలోనే స్పెషల్ క్లాసులు, స్పెషల్ సబ్జెక్టులు అంటూ బట్టీయం పట్టిస్తుంటారు. నిత్యం ఆట, పాటలు, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్‌తో మానసిక వికాసం చెందాల్సిన విద్యార్థులు, కోళ్ళ ఫారాలలో కోడి పిల్లల్లా పాఠాలు వల్లెవేయడం తప్ప సృజనాత్మకత కోల్పోతున్నారు. సహజంగా లక్షల మంది విద్యార్థుల చదువుకునే రెండు, మూడు కార్పొరేట్ విద్యా సంస్థల్లో కొందరికి టాప్ ర్యాంకులు కూడా వస్తుంటా యి. వారినే ర్యాంకులనే అందరికీ చూపిస్తూ, ఊరిస్తూ దండిగా ఫీజులు వసూలు చేయడం కనపడుతోంది.



లక్షల ఫీజులు కట్టి కార్పొరేట్ విద్యా సంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎందుకు చదివించాలనే ప్రశ్న తలెత్తుతోంది. అందులో వాస్తవం కూడా ఉంది. అయితే, హైదరాబాద్ మహానగరంలో సైతం ప్రతి చోట ఆ పాఠశాలలు వెలిసి, చుట్టుపక్కల బడ్జెట్ స్కూళ్ళు, దశాబ్దాలు తరబడి నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను కబళించాయి. ఆ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులను ఎక్కువ వేతనాలు ఇచ్చి కార్పొరేట్ పాఠశాలలు చేర్పించుకుంటున్న ప్రభావం మిగతా పాఠశాలలపై పడుతున్నాయి. తమ పిల్లలకు మంచి చదువులు అందించాలనుకునే తల్లిదండ్రులు అనివార్య పరిస్థితుల్లోకి నెట్టివేయబడి, అప్పులు తీసుకొచ్చి మరీ కార్పొరేట్ స్కూళ్ళలో చదివిస్తున్నారు. వాటిలో చదవకపోతే తమ పిల్లలు భవిష్యత్తు ఏమిటోననే భయం కూడా కారణమే.

**కార్పొరేట్‌కు విరుగుడు చూపిన ఆరుట్ల ప్రయోగం**

ఏదైనప్పటికీ తెలంగాణ ఏర్పడినప్పటికీ కార్పొరేట్ విద్యా సంస్థలను, వాటి ఫీజులను నియంత్రించాలనే డిమాండ్ ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు తెరపైకి వస్తుంది. కానీ, ఆచరణకు నోచుకోవడం లేదు. నియంత్రణ సాధ్యం కాకపోగా, అవి మరింత విస్తృతంగా విస్తరించుకుం టూ పోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా రంగాన్ని పటిష్టపరచాలనే పట్టుదలతో ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యా రంగం పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వంలో విద్యా కమిషన్ ను నియమించారు. ఆ కమిటీ పలు నివేదికలను కూడా సమర్పించింది. అలాగే రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ కె.కేశవరావు నేతృత్వంలో విద్యా విధానంపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అది సమాజంలోని పలు వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది.

రాజధాని సందడి

– బొమ్మగాని కిరణ్‌కుమార్


కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామనే హామీ ఇచ్చింది. విద్యా కమిషన్ ఆధ్వర్యంలో ఇది ఎంతవరకు సాధ్యమనే ప్రయత్నం చేసి విజయవంతమైంది. ఇందుకు రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసి, పబ్లిక్ స్కూల్‌గా నామకరణం చేశారు. ఇక్కడ ప్రీప్రైమరీ స్థాయి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు. డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. ఆటలకు పెద్ద గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ రకాల క్రీడలలో శిక్షణ కూడా ఇస్తున్నారు. అన్నిటికి మించి చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తుండడానికి కారణాలు ఆరాతీయగా, ఆ పాఠశాలలు బస్సులను ఏర్పాటు చేస్తున్నాయని తెలుసుకున్నారు. ఆరుట్ల పాఠశాలకు కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పిల్లలు పబ్లిక్ స్కూల్‌కు రావడం మొదలు పెట్టారు. ఆరుట్ల పాఠశాలను పబ్లిక్ స్కూల్‌గా మార్చకముందు సుమారు 500మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య వెయ్యికి చేరుకుంది. గతంలో ఆ స్కూల్‌కు దగ్గరే ఉన్న కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉన్నప్పటికీ, విద్య నాణ్యత, సౌకర్యాలు అంత గొప్పగా ఏమీ లేవని, ఇప్పుడు అన్ని హంగులతో పబ్లిక్ స్కూల్ రావడంతో ఆ స్కూల్ కు విద్యార్థులు వెళ్ళడం తగ్గారని ఆరుట్ల పాఠశాల ఉన్నతీకరణలో భాగస్వామ్యం పంచుకున్న విద్యావేత్త ఒకరు వివరించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికొక ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేసేందుకు సంకల్పించిం ది. యంగ్ ఇండియా పేరుతో నగరం సమీపంలో పాఠశాలను కూడా ఏర్పాటు చేసింది.

**ఈ మార్పులు అవసరం**

విద్యారంగ ప్రక్షాళనకు ప్రభుత్వ ప్రయత్నాలు మరింత వేగవంతం చేయాలి. ఆ లోగా తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించడం, ప్రభుత్వం సూచించిన అకాడమిక్ క్యాలెండర్ అమలయ్యేలా చూడడం, స్వంత సిలబస్ పేరుతో వేల రూపాయలతో పుస్తకాలను అంటగట్టడాన్ని కఠినంగా అరికట్టాలి. కింది స్థాయిలో ఐఐటి, ఎంబిబిఎస్ కోచింగ్ పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే మాడ్యుల్స్‌కి అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని సామాజిక నిపుణులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో 25 శాతం పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని యుపిఎ హయాంలో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టం అమలు అవసరం. అలాగే కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు,ఆంగ్లం, హిందీ వంటి భాషలను కేవలం ఫైనల్ పరీక్షలల్లో మార్కుల కోసమే తప్ప, పెద్దగా ప్రాధాన్యత నివ్వడం లేదు, లాంగ్వేజ్ సబ్జెక్టుల క్లాసులను కూడా కుదించి, కోచింగ్ సబ్జెక్ట్‌లే చెప్తుతుండడంతో, ఆయా భాషల సాహిత్యం, మాధుర్యం పిల్లలకు దక్కకుండా పోతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదిలోనే గడపడంతో విద్యార్థులకు సమాజంపై అవగాహన, పరిపూర్ణ మానసిక వికాసం లేకుండా పోతుంది. అన్నిటికంటే ముఖ్యంగా కరోనాలో అలవాటైన ఆన్‌లైన్ క్లాసులతో విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు అతుక్కుపోయి, పుస్తకపఠనంపై ఆసక్తి కోల్పోతున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రతి రోజు పాఠశాల అసెంబ్లీలో పది నిమిషాలు పత్రికా పఠనాన్ని తప్పనిసరి చేయడం మంచి పరిణామం. తెలంగాణలో కూడా ఈ విధానంతో పాటు, ఒక క్లాసు ప్రత్యేకంగా పుస్తక పఠనంకోసం కచ్చితంగా అమలు చేయాలి. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో కూడా స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సిసిలను తప్పనిసరి చేయడం ద్వారా విద్యార్థుల్లో దేశ భక్తి, సామాజిక బాధ్యతలకు పిన్న వయస్సులోనే బీజం వేయవచ్చు.

తెలుగులో బాల సాహిత్యాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే సాహిత్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి, పిల్లల వార,మాస పత్రికలను పాఠశాలలకు వెళ్ళేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. తెలంగాణ ఏర్పడిన తరువాత ఎంతో ప్రతిష్టాత్మకమైనదిగా పేరున్న ఉస్మానియా యూనివర్సిటీ సహా పలు యూనివర్సిటీల ప్రతిష్ఠ క్షీణిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వెయ్యి కోట్ల నిధులు ఉస్మానియాకు కేటాయించడం ప్రశంసనీయం. అదే సమయంలో దశాబ్దకాలంగా ఖాళీ అవుతూ వస్తూ, ప్రస్తుతం 11 యూనివర్సిటీలలో 2878 ప్రొఫెసర్ పోస్టులకు, 2125 ఖాళీగా ఉండడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. వీటిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వరంగంలో విద్యా వ్యవస్థ పరిఢవిల్లితేనే పరిపక్వ సమాజంతో పాటు, దేశాభివృద్ధికి సుశిక్షతమైన మానవవనరులు అందివస్తాయి. దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవర్‌లాల్ నెహ్రూ దూరదృష్టితో ఏర్పాటు చేసిన ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్‌లు నేటికీ గొప్ప ఫలితాలిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే.

# పాప్‌కార్న్




## స్కాటిష్ వ్యక్తి ప్రవేశపెట్టిన భారత తొలి బడ్జెట్

భారతదేశ తొలి కేంద్ర బడ్జెట్‌ను ఒక భారతీయుడు కాకుండా స్కాట్లాండ్‌కు చెందిన జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టాడన్న విషయం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తుండవచ్చుగానీ, అది అక్షరాలా నిజం. 1860 ఏప్రిల్ 7న, బ్రిటిష్ పాలన కాలంలో భారతదేశ తొలి బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. జేమ్స్ విల్సన్ అప్పట్లో బ్రిటిష్ భారతదేశానికి ఆర్థిక మంత్రిగా వ్యవహరించారు. ఈ బడ్జెట్ భారత స్వాతంత్ర్యానికి ముందు రూపొందించిన తొలి అధికారిక ఆర్థిక పత్రం. అప్పట్లో భారతదేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర అసమతుల్యతతో ఉండేది. 1857 సిపాయిల తిరుగుబాటు తరువాత ప్రభుత్వ ఖజానాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆదాయాన్ని పెంచడం, పన్నుల వ్యవస్థను సక్రమంగా ఏర్పా టు చేయడం ప్రధాన లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందింది. ఆదాయపు పన్నును తొలిసారిగా ప్రవేశపెట్టడం కూడా ఈ బడ్జెట్‌లోని కీలక అంశం. భారత ఆర్థిక పరిపాలనకు ఒక పద్ధతి, నిర్మాణం తీసుకురావడంలో ఈ తొలి బడ్జెట్ కీలక పాత్ర పోషించింది. భారత బడ్జెట్ చరిత్రకు ఇది ఆరంభ అధ్యాయంగా నిలిచింది.

కాగా, స్వాతంత్ర్య భారతదేశంలో తొలి బడ్జెట్‌ను 1947 నవంబర్ 26న ఆర్‌కె షణ్ముఖం చెట్టీ ప్రవేశపెట్టారు. అయితే, అది 1947 ఆగస్టు నుంచి 1948 మార్చి వరకు ఉన్న కాలానికి సంబంధించిన మధ్యంతర బడ్జెట్.

## అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి

భారతదేశ చరిత్రలో అత్యధిక సార్లు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వ్యక్తిగా మొరార్జీ దేశాయ్ పేరు నిలిచిపోయింది. ఆయన మొత్తం పదిసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రాజకీయ నాయకుడు. ఆయన ఆర్థిక మంత్రిగా, ఉప ప్రధానిగా, చివరకు ప్రధానిగా కూడా పనిచేశారు. ఆయన బడ్జెట్‌లు క్రమశిక్షణ, మితవ్యయం, ఆర్థిక నియంత్రణలకు ప్రాధాన్యం ఇచ్చినవిగా గుర్తింపు పొందాయి. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆదివారం తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశ



పెట్టడం ద్వారా ఆమె, అత్యధిక పర్యాయాలు ఈ ఘనతను పొందిన చిదంబరంతో రికార్డును పంచుకుంటారు. వచ్చే ఏడాది కూడా బడ్జెట్‌ను సమర్పిస్తే, ఆమె మొరార్జీతో సమవుజ్జీగా నిలుస్తారు. అయితే, మొరార్జీ తన బడ్జెట్‌ల ద్వారా పన్నుల వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించడం వంటి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లారు. భారత ఆర్థిక విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత కీలకమైనది.

## 1973లో 'బ్లాక్ బడ్జెట్'

అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంతరావ్ బి. చవాన్, 1973 ఫిబ్రవరి 28న ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'బ్లాక్ బడ్జెట్'గా పిలుస్తారు. ఇందుకు ప్రధాన



కారణం ఆ ఏడాది దేశం ఎదుర్కొన్న భారీ ఆర్థిక లోటు. నాటి ఆర్థిక లోటు సుమారు రూ.550 కోట్లకు చేరింది. 1971 భారత–పాక్ యుద్ధం, 1972 కరువు దేశ ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీశాయి. ఆహార కొరత, ద్రవ్యోల్బణం, ప్రభుత్వ ఖర్చుల పెరుగుదల వంటి సమస్యలు తీవ్రమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల్లో నిరాశను కలిగించింది. అందుకే దీనిని 'బ్లాక్ బడ్జెట్'గా వ్యవహరించారు. అయితే, ఇది దేశం ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను ప్రతిబింబించే నిజాయితీగల బడ్జెట్‌గా కూడా చరిత్రలో గుర్తుండిపోతుంది.

## తొలి పూర్తికాల మహిళా ఆర్థిక మంత్రి

భారతదేశ తొలి పూర్తి కాల మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించారు. 2019 నుంచి ఆమె ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఇందుకు ముందు ఇందిరాగాంధీ 1970లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ, అది పూర్తి కాల బాధ్యతగా నిర్వహించలేదు. మొరార్జీ దేశాయ్ రాజీనామా తరువాత తాత్కాలికంగా ఆమె ఆర్థిక శాఖను నిర్వహించారు. కానీ నిర్మలా సీతారామన్ పూర్తి కాల ఆర్థిక మంత్రిగా వరుసగా ఎనిమిది పర్యాయాలు బడ్జెట్‌లను ప్రవేశపెట్టడం విశేషం.

**అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం**

నిర్మలా సీతారామన్ 2020 ఫిబ్రవరి 1న చేసిన బడ్జెట్ ప్రసంగం భారత చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైనది. ఈ ప్రసంగం 2 గంటల 42 నిమిషాల పాటు సాగింది. చివర్లో ఆమె అస్వస్థతకు గురవడంతో రెండు పేజీలు చదవకుండానే ప్రసంగాన్ని



ముగించారు. అయినప్పటికీ, ఇది ఒక రికార్డుగా నిలిచింది. ఈ బడ్జెట్‌లో అనేక రంగాలకు సంబంధించిన విస్తృత ప్రకటనలు ఉండటం వల్ల ప్రసంగం ఎంతో దీర్ఘంగా మారింది.

## బడ్జెట్ తేదీ, సమయం మార్పు

భారతదేశంలో కేంద్ర బడ్జెట్‌ను ఎప్పుడూ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టేవారని చాలామంది భావిస్తారు. కానీ ఇది ఎప్పటినుంచో అలా కాదు. 1999 వరకు బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పని దినంలో సాయంత్రం 5 గంటలకు ప్రవేశపెట్టేవారు. ఇది బ్రిటిష్ కాలపు సంప్రదాయం. 1999లో యశ్వంత్ సిన్హా ఈ సంప్రదాయాన్ని మార్చి ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2017 లో అరుణ్ జైట్లీ మరో కీలక మార్పు చేసి, బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ముందే విధానాలను అమలుచేసే అవకాశం లభించింది.



## 1997 'డ్రీమ్ బడ్జెట్'


పి. చిదంబరం, 1997లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'డ్రీమ్ బడ్జెట్'గా పిలుస్తారు. ఇది భారత ఆర్థిక సంస్కరణలకు బలమైన పునాది వేసింది. ఆదాయపు పన్ను గరిష్ఠ రేటును 40 శాతం నుంచి 30 శాతానికి తగ్గించడం, కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు, ఎక్సైజ్ పన్నుల సరళీకరణ వంటి కీలక నిర్ణయాలు ఇందులో ఉన్నాయి. ఈ బడ్జెట్ పెట్టుబడిదారులు, మధ్యతరగతి ప్రజల్లో విశేష ఆదరణ పొందింది.



– బిఎస్ఎస్ మైత్రేయి

## బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధానులు

భారతదేశంలో నలుగురు ప్రధాన మంత్రులు ఆర్థిక మంత్రుల బాధ్యతలు చేపట్టి బడ్జెట్ ప్రవేశపెట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ , మొరార్జీ దేశాయ్, రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ ఈ జాబితాలో ఉన్నారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా సేవలు అందిస్తూ, బడ్జెట్ ప్రవేశపెట్టారు. తర్వాతికాలంలో ఆయన ప్రధాని అయ్యారు.



## రైల్వే బడ్జెట్ విలీనం

సాధారణ బడ్జెట్‌తో సంబంధం లేకుండా, 2016 వరకు రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టేవారు. ఇది ఒక ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగింది. చివరిసారిగా 2016 ఫిబ్రవరి 25న సురేష్ ప్రభు రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టా రు. 2017 నుంచి రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేశారు. దీనివల్ల ఆర్థిక ప్రణాళికలో సమగ్రత పెరిగింది.

## 1986 'క్యారెట్ అండ్ స్టిక్' బడ్జెట్

1986లో విపి సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను 'క్యారెట్ అండ్ స్టిక్' బడ్జెట్‌గా పిలిచారు. ఇందులో ఒకవైపు పన్ను సౌలభ్యాలు, మరోవైపు కఠిన చర్యలు ఉన్నాయి. మోడ్వాట్ విధానాన్ని ప్రవేశపెట్టి పన్నుల భారం తగ్గించారు. అదే సమయంలో పన్ను ఎగవేతదారులపై కఠిన చర్యలు ప్రకటించారు.



## సిసి రోడ్లకు తక్షణమే నిధులు మంజూరు చేయాలి



ప్రజాపక్షం/కాప్రా : డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన ప్రతిపాదనలతో పాటు నిధులు మంజూరు చేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శనివారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్‌ను కల్సి వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సరైన సిసి రోడ్లు లేక వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఓల్డ్ మల్లాపూర్, మల్లికార్జుననగర్ కాలనీ, భవానినగర్ కాలనీ, ఎస్వీనగర్, ఫేజ్ 3, అన్నపూర్ణ కాలనీలలో సిసి రోడ్లకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

## బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి చర్యలు



ప్రజాపక్షం/మల్కాజిగిరి:ఆర్ సిసి పైప్‌లైన్ కారణంగా గుంటల మయంగా మారిన దీన్‌దయాళ్‌నగర్ ప్రధాన రహదారిలో కొత్త సిసి రోడ్ వేయాలని,వినాయకగనర్‌లో కమ్యూనిటీ హాల్, బస్తీ దవఖానా భవన నిర్మాణాన్ని పూర్తిచేసే పనులను యుద్ధ ప్రాతిపదికన జరిపించాలని వినాయకనగర్ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి కోరారు. బడ్జెట్ సమావేశం ముగిసాకా ఆమె జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కల్సి వినతిపత్రం సమర్పించారు. కాకతీయనగర్‌లోని గౌరీ శంకర్ అపార్ట్‌మెంట్ నుండి దీనదయాళ్ విగ్రహం వరకు ఫుట్‌పాత్ దురాక్రమణలను తొలగించాలని కోరారు.



## సిఎం కప్ అందజేత

ప్రజాపక్షం/బంట్వారం : బంట్వారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం సిఎం కప్పు క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. ఆటల పోటీలలో గెలుపొంది విజేతలుగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు డి మల్లేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, మండల అభివృద్ధి అధికారి ఎ. రాములు, మండల విద్యాధికారి వేంకటేశ్వర్ రావు, పాఠశాల ప్రధానోపధ్యాయులు సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఉపధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి : ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజాపక్షం /పరిగి :మున్సిపల్ ఎన్నికల ప్రచారకార్యక్రమంలో భాగంగా పరిగి మున్సిపాలిటీలోని నస్కల్ గ్రామంలో 1వ వార్డులోపరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్‌గా పోటి చేస్తున్న దండు శోభారాణి అశోక్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. కాంగ్రెస్ భాలపార్చిన అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వైస్ చైర్మన్ అనంద్ .శ్రీధర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ అనంద్ ,వెంకటేష్ ,తదితరులు పాల్గోన్నారు.




## మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలుః కలెక్టర్

ప్రజాపక్షం/వికారాబాద్ : ఓటర్ల మ్యాపింక్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ప్రత్యేక ఇంటెన్సివ్ పునఃపరిశీలనలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ, లక్ష్యం మేరకు మ్యాపింగ్ పూర్తిచేసే ప్రక్రియలో భాగంగా బూత్‌స్థాయి అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్‌లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులకు విధివిధానాలను సూచించారు. ఫిబ్రవరి మాసంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. బూతుస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో విధుల పట్ల నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనే విషయాన్ని తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజేశ్వరి, ఎన్నికల విభాగం సూపరింటెండ్ నైమత్ అలీ, తహసీల్దార్లు లక్ష్మి నారాయణ, వేంకటేశ్వరి, విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వన దేవతలను దర్శించుకున్న నాయకులు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి:వెంకటేశ్వరనగర్ డివిజన్ రంగారెడ్డి నగర్ కమాన్ దగ్గర కొలువైన చిన్న మేడారం జాతరను పలువురు నాయకులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు బంటు ప్రవీణ్ పనాటి రమేష్, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావులు పాపిరెడ్డి నగర్ కమాన్ వద్ద ఉన్న సమ్మక్క ,సారక్కలను, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మక్క సారక్కల ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రమేష్ యాదవ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

# 'సిటీ వీధుల నుంచి ఐఐటి కలల దాకా'

### పారిశుద్ధ్య కార్మికుల పిల్లల కోసం జిహెచ్ఎంసి వినూత్న పర్యటన






ప్రజాపక్షం/హైదరాబాద్: నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) ఒక చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ (2.0)లో భాగంగా, శనివారం సుమారు 180 మంది కార్మికుల పిల్లలను దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అయిన ఐఐటి హైదరాబాద్ సందర్శనకు తీసుకెళ్లింది. 'సిటీ వీధుల నుంచి ఐఐటి కలల దాకా' అనే నినాదంతో సాగిన ఈ పర్యటన ప్రధాన లక్ష్యం పారిశుద్ధ్య కార్మికుల పిల్లలలో ఉన్నత విద్యపై అవగాహన కల్పించడం. సామాజిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి, ప్రపంచ స్థాయి విద్యా వాతావరణాన్ని వారికి పరిచయం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని జిహెచ్ఎంసి ఈ నిర్ణయం తీసుకుంది. 'సిటీ వీధుల నుంచి ఐఐటి కలల దాకా' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించడం, వారి లోపలి ప్రతిభను వెలికి తీసి భవిష్యత్తుపై నమ్మకం పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు.

**ఐఐటీ క్యాంపస్ జీవితం అనుభవించిన విద్యార్థులు..**



ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు సాగిన ఈ పర్యటనలో విద్యార్థులు ఐఐటి హైదరాబాద్ క్యాంపస్‌లోని అకడమిక్ భవనాలు, నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్ (లైబ్రరీ), ఇన్నోవేషన్ సెంటర్లు, స్పోర్ట్స్, కల్చరల్ కాంప్లెక్స్‌లను సందర్శించారు. క్యాంపస్ మెస్‌లో భోజనం చేసి అక్కడి విద్యార్థుల జీవనశైలిని ప్రత్యక్షంగా చూశారు. 'ప్రయాస్' ఆధ్వర్యంలో జరిగిన 'మోటివేషనల్ ఇంటరాక్షన్'తో కార్యక్రమం ప్రారంభమై, ఐఐటి అధ్యాపకులు, విద్యార్థులతో పరస్ప ర చర్చల వరకు కొనసాగింది. ఇంజనీరింగ్, సైన్స్ విభాగాలు, ఐఐటీ ప్రవేశ విధానం, కెరీర్ అవకాశాలు, కష్టాలను ఎలా అధిగమించాలి అనే అంశాలపై విద్యార్థులకు ప్రేరణాత్మక మార్గదర్శనం అందించారు.

**ఆత్మవిశ్వాసం, కలలకు బీజం**

రోజు చివర్లో లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశంలో స్వీయ విశ్వాసం, లక్ష్య నిర్ధారణ, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై ప్రత్యేక చర్చ జరిగింది. చాలామంది విద్యార్థులు తొలిసారిగా ప్రపంచస్థాయి విద్యా సంస్థను సందర్శించడంతో వారి ముఖాల్లో ఆశ, ఆనందం స్పష్టంగా కనిపించింది.

**పక్కా ఏర్పాట్లు..** ఎల్.బి.నగర్, ప్రధాన కార్యాలయం, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, చార్మినార్ జోన్‌ల నుంచి ప్రతి సర్కిల్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి 6 ప్రత్యేక బస్సుల ద్వారా ఐఐటి హైదరాబాద్‌కు తరలించా రు. రవాణా, భోజనం, భద్రత, మార్గదర్శక సహాయం వంటి అన్ని ఏర్పాట్లను జిహెచ్ఎంసి అధికారులు సమర్థవంతంగా నిర్వహించారు. అల్పాహారం, భోజన ఏర్పాట్ల ను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఐఐటి హైదరాబాద్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఐఐటి హైదరాబాద్‌లోని ఈ సెల్ సహకారంతో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**జిహెచ్ఎంసిపై ప్రశంసలు**

పారిశుద్ధ్య కార్మికుల కృషిని గుర్తించి, వారి పిల్లల భవిష్యత్తు కలల్లో పెట్టుబడి పెట్టేలా జిహెచ్ఎంసి చేపట్టిన ఈ ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు. నగర అభివృద్ధిలో భాగస్వాములైన కార్మిక కుటుంబాలకు విద్య ద్వారా సామాజికఆర్థిక పురోగతి సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జోనల్ అధికార్లతో సందేహాలు నివృత్తి చేసుకోవాలి

### ప్రిసైడింగ్, అసిస్టెంట్ అధికారులతో కలెక్టర్ మనుచౌదరి




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: పురపాలక సంఘ ఎన్నికలకు సంబంధించి విధి నిర్వహణలో ఉండే ప్రిసైడింగ్, అసిస్టెంట్ అధికారులు ఎలాంటి సందేహాలు ఉన్నా హ్యాండ్ బుక్ ద్వారా జోనల్ అధికార్లతో నివృత్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో పిఓ, ఎపిఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పరచుకోవాలని, ఎన్నికల సంఘ మార్గదర్శకాలు, నిబంధనల గురించి స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు బ్యాలెట్ బాక్స్ ఎన్నికలయినందున మరింత జాగ్రత్తగా పోలింగ్ జరిగేలా చూడాన్నారు.మొత్తం ఓటింగ్ లెక్కలు సరిగ్గా నిర్ధారించుకోవాలని, మహిళా,పురుష ఓటర్ల లెక్కింపులో తప్పులు దొర్లకుండా రిజిస్టర్‌తో పాటు సరిపడేలా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ప్రతి ఫారాలు నిర్దేశించిన రీతిలో పూరించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే పోలీసులతో పాటు జోనల్ అధికార్లకు సమాచారం అందించాలని కలెక్టర్ అన్నారు. పోలింగ్ బూతులలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శిక్షణా తరగతుల్లో ట్రైనింగ్ నిర్వహణ నోడల్ అధికారి విజయకుమారి, శిక్షకులు మురళి, వేణు,పిఓలు, ఎపిఓలు పాల్గొన్నారు.

**కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంల పరిశీలన**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్‌గూడ ప్రాంతంలో తెలంగాణా మైనారిటి రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూంలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఎన్నికల నోడల్ అధికారి సాంబశివరావుతో కల్సి పరిశీలించారు. అవసరమైన పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు, కౌంటింగ్ టేంటింగ్ సంబంధించి ఆయన పలు సూచనలిచ్చారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, తహసీల్దార్ ఇద్రిస్‌లు వారితో పాటు ఉన్నారు.

**ప్రజావాణి రద్దు**

పురపాలక సంఘాల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం జరుగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ మను చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.



## విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలి : ఎంపి ఈటల రాజేందర్

ప్రజాపక్షం/శామీర్‌పేటః విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో విజన్ హైస్కూల్ 7 వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు సంస్కారం అనేది చాల అవసరమని చదువు నేర్పిన గురువులను గౌరవించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు దోహదపడతాయని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు, ఆటపాటలు ప్రదర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రదర్శనలు ఇస్తున్న సమయంలో తల్లిదండ్రులు చాల ఆసక్తితో తిలకించి ఆనందించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను, అతిథులను శాలువాకప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజన్ హై స్కూల్ కరస్పాండెంట్ మిర్యాల రీనా సతీష్‌కుమార్, డైరక్టర్స్ శ్రీకాంత్, మహేష్, గంగా నర్సయ్య, సాధన, అనిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బి-ఫారమ్‌లు ఇస్తానని మోసం చేసిన కాంగ్రెస్

### బిజెపిలోకి కొండ నర్సింహులు



ప్రజాపక్షం/శామీర్‌పేట : మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీ బీఫారమ్‌లు ఇస్తానని మోసం చేసిందని, పార్టీ కార్యాలయానికి రమ్మని తీరా మొండి చేయి చూపారని కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కొండ నర్సింలు ముదిరాజ్ ఆరోపించారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కొల్తూర్‌కు చెందిన కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు కొండ నర్సింలు ముదిరాజ్ బిజెపి మేడ్చల్ అర్బన్ డిస్ట్రిక్ట్ జెక్రరి చింతల మాణిక్యం, మాజీ అధ్యక్షుడు నందాల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఆయనతో పాటు మరికొంతమంది యువకు లు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మాజి ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్, బిజెపి బూత్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, మల్లేష్‌యాదవ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ః కాంగ్రెస్,బిఆర్‌ఎస్ పాలనలో కొండాపూర్ రైల్వే వంతెన నిర్మాణం ఇన్ని సంవత్సరాలు అయినా పూర్తి చేయలేకపోయారని ఎలక్షన్లు రాగానే ఇటు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని బిజెపి ఘట్‌కేసర్ 6వ వార్డు డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎన్నికలకోసం బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైల్వేవంతెన నిర్మాణాన్ని ఇన్ని సంవత్సరాలు అయినా పూర్తి చేయలేక ప్రజలను ఇబ్బంది పెట్టారు. ఇలాంటి రాజకీయ నాయకులు ప్రజలను ఎప్పటికీ మోసం చేస్తూనే ఉంటారని అన్నారు.

## ప్రవీణ్ పటేల్, జగదీశ్వర్‌లను పరామర్శించిన పైలెట్ రోహిత్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరుః బిఆర్‌ఎస్ యువ నాయకుడు ప్రవీణ్ పటేల్‌ను, పట్టణానికి చెందిన బిజెపి యువనాయకుడు జగదీష్‌లను తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పరామర్శించారు. బిఆర్‌ఎస్ యువ నాయకుడు ప్రవీణ్ పటేల్ పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్రానికి పాల్పడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్ పటేల్‌ను శనివారం తాండూరు మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి కలుసుకుని పరామర్శించారు. అదే విధంగా పట్టణానికి చెందిన బిజెపి యువనాయకుడు జగదీష్ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని డెక్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడి వీరికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారి కుటుంబ సభ్యులకు తాను ఉన్నానంటూ భరోసాను ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులతో పాటు విజయ్ తదితరులు ఉన్నారు.



## ఆటల పోటీలు ప్రారంభించిన సర్పంచ్ శ్రీనివాస్

ప్రజాపక్షం /వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సిఎం కప్పు సిద్దులూర్ గ్రామ సర్పంచు ఎంపిడిఓ వినయ్ కుమార్‌తో కలిసి వాలిబాల్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. క్రీడలవలన స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిటిలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత

### ఎస్‌పి స్నేహమెహ్రా



ప్రజాపక్షం/వికారాబాద్ : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా అన్నారు. ప్రతి మంగళవారం, గురువారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం, వికారాబాద్ పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో ముఖముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జనవరి నెలలో ఇప్పటివరకు మొత్తం 52ఫిర్యాదులు అందినట్లు తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన బాధితుల నుండి వచ్చిన సమస్యలను విన్నారు. క్షణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయంచేయడం జరుగుతుందన్నారు. ప్రజల కోసం పోలీస్ అందుబాటులో ఉంటామని తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులకు కీలక సూచనలు చేస్తు క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, కార్యాలయానికి వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఎస్‌పి తెలిపారు.

## నామినేషన్లను జాగ్రత్తగా పరిశీలించాలి

### ఎన్నికల అబ్జర్వర్ రవి

ప్రజాపక్షం/తాండూరుః నామినేషన్‌లను ఎక్కడ ఎలాంటి పొరపాటు లేకుండా జాగ్రత పరిశీలించాలని ఎన్నికల అబ్జర్వర్ జి. రవి(ఐఎఎస్) అధికారులను ఆదేశించారు. శనివారం తాండూరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ సూక్ష్మ పరిశీలన కార్యక్రమాన్ని ఎన్నికల అబ్జర్వర్ పరిశీలించారు. అనంతరం పరిశీలకులు మాట్లాడుతూ నామినేషన్‌లను ఎక్కడ ఎలాంటి పొరపాటు లేకుండా పూర్తిస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల పత్రాలు ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా జాగ్రత్తగా నియమబద్ధంగా పరిశీలించాలని అన్నారు. వార్డు ల వారీగా ఎన్ని దఖాస్తులు వచ్చాయి, ఏవైనా వార్డులు ఏకగ్రీవం అయ్యాయా అనే విషయాలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిప కమీషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, సంబంధిత అధికారులు ఉన్నా రు.

## వికారాబాద్ జిల్లాలో 787నామినేషన్లు

ప్రజాపక్షం /వికారాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో మొదటి ఘట్టం ముగిసింది. నాలుగు మున్సిపాలిటీల్లో 100 వార్డులు,787 నామినేషన్లు, వికారాబాద్‌లో 34 వార్డులకు గాను కాంగ్రెస్ 130, బిఆర్‌ఎస్ 82, బిజెపి 45, ఎంఐఎం 12, స్వతంత్రులు 15, మొత్తం 284 నామినేషన్లను పరిశీలించి తుదిజాబితా ప్రకటించారు. తాండూర్ 36వార్డులు, కాంగ్రెస్ 88, బిఆర్‌ఎస్ 96, బిజెపి 49, ఎంఐఎం 16, ఇతరులు 29 మొత్తం 273 నామినేషన్లు వేశారు. పరిగి మున్సిపల్‌లోని 18వార్డులు 46 కాంగ్రెస్, 60 బిఆర్‌ఎస్, బిజెపి 31, ఇతరులు 21,158, కొడంగల్ 12వార్డు లు, కాంగ్రెస్ నుండి 25, బిఆర్‌ఎస్ నుండి 19,బిజెపి 05, ఎంఐఎం 04, ఇతరులు 18, మొత్తం నామినేషన్లు 72వేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 787 మంది నామినేషన్లు వేశారు. అధికార పార్టీకాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీల తరపున అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పార్టీల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. బిజెపి సైతం కొన్నిచోట్ల బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపింది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో అధికారపార్టీ నాలుగు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఉండటంతో అభ్యర్థులకు కలిసొచ్చే అంశం ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సైతం హస్తంపార్టీ పైచేయి సాధించిన విషయం తెలిసిందే, మున్సిపల్ ఎన్నికల్లోనూ అధిక వార్డుల్లో గెలువాలనే లక్ష్యంతో పార్టీ ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. వార్డుల్లోని పెద్దలు ముఖ్యులతో చర్చలు జరుపుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు వారి అలోచనలకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సైతం బలమైన పోటీ ఇస్తామని చెబుతోంది. .

## డిసిసిల శిక్షణా తరగతుల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాపక్షం /వికారాబాద్ : డిసిసిల శిక్షణ తరగతుల ఏర్పాట్లును ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ,వికారాబాద్ జిల్లాలో ని అనంతగిరి లో ఫిబ్రవరి 21నుండి మార్చి 3వరకు డిసిసిల శిక్షణ తరగతలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ తరగతులకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శిక్షణ తరగతుతల నిర్వహణ కు సంబంధించిన వసతులు ఏర్పాట్లను ఎఐసిసి ఇన్‌చార్జీ మినాక్షి నటరాజన్ తో పాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జల్లా అధ్యక్షులు ధారాసింగ్, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## శాశ్వత విద్యుత్ సమస్యకు చర్యలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామీణ ప్రాంతాలలో శాశ్వతంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ విద్యుత్ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి వివరించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ళ అశోక్, వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్‌లు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డిఇ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఇప్పటికే అనేక గ్రామాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లింగారెడ్డిగూడ గ్రామంలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ పుణ్యభూషణ్‌రెడ్డి, నేతలు హరికృష్ణ యాదవ్, వీరేష్ గౌడ్, గోపాల్ జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టిజి జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ రెవెన్యూ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘు,కార్యవర్గ సభ్యులు శనివారం ఆయన ను కలిశారు.అదేవిధంగా 2025–2026 వార్షిక సంవత్సరానికి గాను జిఒ విడుదల చేసినందుకు ప్రత్యేకంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ హక్కుల పరిరక్షణ, రెగ్యూలర్‌గా బడ్జెట్ విడుదల వంటి అంశాలను టిజి జెఎసి చైర్మన్ దృష్టికి వారు తీసు కెళ్లారు. రెవెన్యూ ఉద్యోగులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

## కేశంపేట ఎంపిడిఒకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/కేశంపేట:** ఉత్తమ ఎంపిడిఒ అవార్డు అందుకున్న ఎంపిడిఒ రవిచందర్‌ను ఘనంగా సన్మానించారు. శనివారం మండల పరిధిలోని సంగెం గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాలచారి, పోల్కొనిగుట్ట తండా సర్పంచ్ భాస్కర్, ఉప సర్పంచ్ దేవి రవినాయక్, కూడల రాజులు శాలువాతో సత్కరించారు. కేశంపేట మండల అభివృద్ధికి సేవలు అంధించడంతోపాటు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న ఎంపిడిఒకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు చేరువగా పని చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చేసిన కృషికి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో ఇదే తరహాలో కేశంపేట మండల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ప్రజలకు సేవలు అంధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఇబ్రహీంపట్నంలో67 నామినేషన్ల తిరస్కృతి

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్‌లో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు దాఖల్ చేసిన 192 నామినేషన్ల పత్రాలను స్క్రూటినిలో అధికారులు క్షుణంగా పరిశీలించి 67 నామినేషన్ల పత్రాను తిరస్కరించినట్లు అధికారులు శనివారం పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, శేరిగూడ, సీతరాంపేట్, ఖానాపూర్ గ్రామలలో మొత్తం 24వార్డులలో కాంగ్రెస్ 52,బిఆర్ఎస్ 29,బిజెపి 24,బిఎస్‌పి 3,స్వతంత్ర్య 9,ఇతరులు 4 మొత్తం 125 మంది అభ్యర్థులు బరిలో ఉన్ననున్నట్లు తెలిపారు. నేటి నుంచి 3వ తేది లోపు అభ్యర్థులు విత్ డ్రాలు అయిన అనంతరం ఎంత మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉంటారో తుది జాబితా అదే రోజు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

## నిష్పాక్షిక ఎన్నికల కోసమే తనిఖీలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికలను నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకే వాహనాల తనిఖీలను నిత్యం చేస్తున్నామని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు శ్రీనివాస్, కార్తీక్‌లు తెలిపారు. శనివారం షాద్‌నగర్ పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద వాహనాలను పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ప్రత్యేకంగా వీడియోను చిత్రీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు నగదు సీజ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఎన్నికల నిర్వహణలో మద్యం, లిక్కర్, నగదు తరలిస్తే పట్టుబడిన సమయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సర్వేలెన్స్ వీడియో రికార్డ్ తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్ చేసిన నగదు, మద్యంను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరుగుతుందని, ఎఫ్ఐఆర్ నమోదు కానీ నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌కు సమర్పిస్థారని తెలిపారు. ప్రభుత్వ వాహనాలను సైతం తనిఖీ చేసే అధికారం ఈ బృందానికి ఉంటుందని, ఎలాంటి సమస్యలు ఉన్న జిల్లా కలెక్టరేట్‌లో 24గంటలు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని వివరించారు. షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారీ బదోబస్తుతో పాటు ముమ్మరంగా తనిఖీలు చేస్తామన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

**ప్రజాపక్షం/కొందుర్గు:** భక్తిశ్రద్ధలతో లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శనివారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవం సందర్భగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు హోమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సామేతంగా స్వామివారి వద్దకు చేరుకొని కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సునీల్ జోషి, ప్రదీప్ జోషి, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను కొనసాగించారు. ఆలయ నిర్వాహకులు నరసింహస్వామి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం లక్ష్మీ నరసింహస్వామి కృపతో వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి అవతారాలతో దేవాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# ముగిసిన వింగ్స్ ఇండియా

దాదాపు లక్షమంది సందర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆసియా ఖండంలోనే అతి పెద్ద పౌర విమానయాన ప్రదర్శన ముగిసింది. నాలుగు రోజుల పాటు కొనసాగిన వింగ్స్ ఇండియా2026 ప్రదర్శన తిలకించేందుకు సందర్శకులు పోటెత్తారు. ప్రపంచ వ్యాప్తంగా పేర్గాంచిన ఏవియేషన్ సంస్థలు, కీలక పరిశ్రమలు తమ వ్యాపారపైన ప్రకటనలు, విధానపరమైన చర్చలు, విమానయాన పరికరాల ప్రదర్శనలు, అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముందుగా రెండు రోజులు వ్యాపారపరమైన కీలక ప్రకటనలు జరిగాయి. ఎయిర్ ఇండియా బోయింగ్ నుంచి అదనంగా 30 విమానాల ఆర్డర్ ప్రకటించింది. దీంతో ఎయిర్ ఇండియా మొత్తం విమానాల ఆర్డర్ సంఖ్య 600కు చేరింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్డర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. అయితే విధంగా బోయింగ్ గ్లోబల్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకుని బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ మద్దతు పొందింది. ఈ క్రమంలోనే వికసిత్ భారత్@2047 కోసం విమానయాన భవిష్యత్తు అనే అంశంపై కేపీఎంజీఫిక్కీ జ్ఞాన నివేదిక విడుదల చేయడం జరిగింది. కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించగా.. స్టిర ప్రదర్శనను పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించగా.. ప్రదర్శన ప్రాంతాన్ని పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్‌సిన్హా ప్రారంభించిన విషయం విధితమే. వింగ్స్ ఇండియా ఎక్సలెన్స్ అవార్డులు వివిధ విభాగాల్లో అందించారు. వింగ్స్ ఇండియా ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే కార్యక్రమం విజయవంతమైందని చెప్పవచ్చు. రాబోయే వింగ్స్ ఇండియా2028 ప్రదర్శన తేదీలను త్వరలోనే ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఫైర్ సేఫ్టీకి నెల గడువు.. ఆ తరువాత కఠిన చర్యలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని షాపుల సీజ్ చేసే కార్యక్రమానికి నెల రోజులు హైడ్రా విరామం ఇచ్చింది. ఈ నెల రోజుల గడువులో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా షాపులు, వ్యాపార సముదాయాల వారు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది. నెల తర్వాత తనిఖీలు ముమ్మరం చేసి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ మేరకు షాపుల యజమానులు, వ్యాపార సంఘాల ప్రతినిధులతో పాటు హైడ్రా, జిహెచ్‌ఎంసి, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులతో శనివారం హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను వివరించారు. అగ్ని ప్రమాదాల నేపథ్యంలో జిహెచ్‌ఎంసి, ఫైర్, పోలీసు విభాగాలతో హైడ్రా తనిఖీలు చేసి 9 షాపుల వరకూ సీజ్‌చేసిన విషయం విధితమే. నెల రోజులు గడువు కావాలని పలు వ్యాపార సంఘాలు, దుకాణదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని సమావేశం పరిగణనలోకి తీసుకుంది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని పేర్కొంటూ ఆ 9 షాపుల వారి నుంచి అఫిడవిట్లు తీసుకున్నాక వ్యాపారాలకు అనుమతివ్వాలని సమావేశం నిర్ణయించింది. భవిష్యత్తులో పొరపాటు జరిగితే ఉపేక్షించరాదని పేర్కొంది. పాతబస్తీ, బేగంబజార్, ట్రూప్ బజార్, మదీన సెంటర్ ఇలా ముఖ్యమైన వ్యాపార సముదాయాలున్న ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అందరిలో చైతన్యం తీసుకు వస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ, ఫైర్ విభాగాలతో కలిసి ఫైర్ సేఫ్టీ నిబంధనలు రూపొందిస్తున్నామన్నారు. కరపత్రాలలో ఈ నిబంధనలను ప్రచారం చేస్తామన్నారు. వ్యాపార సముదాయాలు, దుకాణాలు ఉన్న చోట సమావేశాలు ఏర్పాటు చేసి అందరిలో ఫైర్ సేఫ్టీకి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తామన్నారు. ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే అందులో ఉన్న వారు సులభంగా బయటకు వచ్చేలా కారిడార్లు, మెట్ల దారులు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సెల్లార్లను ఆయా షాపుల వారు గోదాములుగా మార్చవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.



ఇవి బ్యాటరీ ఇంజనీరింగ్ కోర్సు..

## భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు రూపొందించడం అభినందనీయం

కార్మిక, ఉపాధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సిఐ)లో ఇటీవల ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహన (ఇవి) బ్యాటరీ సస్టెనబిలిటీ ఇంజనీరింగ్ కోర్సు గురించి డాక్టర్ జి. రమేశ్వర్ రావు కార్మిక, ఉపాధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోర్సు లక్ష్యాలు, పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన శిక్షణ అంశాలను రమేశ్వర్ రావు వివరించారు. భారతదేశంలో తొలిసారిగా ఇన్ని ద్వారా ఈ కోర్సును ప్రారంభించిన విశేషాన్ని తెలిపారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ, సుస్థిర శక్తి రంగాలలో పెరుగుతున్న నైపుణ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కోర్సును రూపకల్పన చేసినట్లు ఆయన వివరించారు. ఇందులో ఇవి బ్యాటరీ సాంకేతికత, సస్టెనబిలిటీ పద్ధతులు, బ్యాటరీ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్, రీసైక్లింగ్ విధానాలు, భద్రతా ప్రమాణాలు, ప్రాయోగిక శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందుపరిచినట్లు తెలిపారు. దేశం గ్రీన్ మొబిలిటీ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో, నైపుణ్యం కలిగిన ఇంజనీర్ల తయారీ అత్యంత అవసరమన్నారు. ఈ కోర్సు ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కలుగుతాయని, సుస్థిర అభివృద్ధికి ఇది తోడ్పడుతుందన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని దానకిషోర్ అభినందిస్తూ, భవిష్యత్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈవి బ్యాటరీ సస్టెనబిలిటీ ఇంజనీరింగ్ కోర్సు ద్వారా దేశంలో గ్రీన్ మొబిలిటీ అభివృద్ధికి, సుస్థిర పారిశ్రామిక వృద్ధికి గణనీయమైన మద్దతు లభిస్తుందన్నారు.

## విచారణల పేరిట చిల్లర రాజకీయాలు

బిఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్‌పై వివిధ విచారణల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయా లు చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా భారత రాష్ట్ర సమితి(బిఆర్‌ఎస్)పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కావాలనే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్ ,హరీశ్ రావులను సిట్ విచారణ పేరుతో వేధిస్తున్నారని, దీనికి నిరసనగా నేడు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పార్టీ శ్రేణులకు , తెలంగాణ వాదులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం మీద కమీషన్లు వేసి కెసిఆర్ మీద బురద చల్లడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయని చెప్పారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో జరుగుతున్న తతంగాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చె ప్పారు. సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా సిట్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. సిఆర్‌పిసి 160 కింద సాక్ష్యాలుగా విచారణకు పిలిచి గంటలు, గంటలు విచారణ చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. రెండేళ్లుగా ఈ కేసులో సాధించింది ఏమీ లేదని , కేవలం కాంగ్రెస్ హామీలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. సెలవు రోజుల్లో విచారణలు, కూల్చివేతలు చేయవద్దని హైకోర్టు ఎన్నిమార్లు మొట్టికాయలు వేసినా మొండిగా వ్యవహరించడం సరికాదని ధ్వజమెత్తారు. కెసిఆర్ విచారణ పేరుతో జరుగుతున్న కు ట్రలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా మండల ,మున్సిపాలిటీ కేంద్రాల్లో ఆదివారం బైక్ ర్యాలీలు, నిరసనలు శాంతియుతంగా జరపాలని పిలుపునిచ్చారు.

# కార్మికుల పోరాటాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మికులు తమ పోరాటాలను కొనసాగించాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారంతో పాటు కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని చేపట్టే కార్మిక వర్గం పోరాటానికి సిపిఐ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి జంగయ్య ప్రకటించారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.అందులో భాగంగా శనివారం శంషాబాద్ లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.చందు యాదవ్, ఎస్ మల్లేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి. సిపిఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరిలతో కలిసి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను నేటి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి వాటిని నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. వ్యవసాయ నల్ల చట్టాలను విద్యుత్తు చట్టాలను తక్షణమే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగామహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జి రాంజీ పేరుతో మార్చి ఆ పథకాన్ని నీరు కార్చాలని చూడడంబాధాకరమని ఆయన మండిపడ్డారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు కోవడం లేదని పనిగంటలు సక్రమంగా అమలు చేయకుండా కార్మికులను ఉద్యోగులను వేదిస్తున్న పరిశ్రమ యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1న తుక్కుగూడలో జరిగే కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. పోస్టర్స్ విడుదల కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు, మున్సిపల్ రంగం జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్, స్వామి,జిల్లా సమితి సభ్యులు ప్రవీణ్ కుమార్ గౌడ్, కొండల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ కృషి

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల నిర్వహనలో ఎలాంటి అశ్రద్ధ చేయకూడదని, సజావుగా జరిగే విధంగా అధికారులు సిబ్బంది అందరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం ఎన్నికల నిర్వహణలో భాగంగా షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో స్థానిక మున్సిపాలిటీకి సంబంధించిన నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను వారు ఇరువురు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను పరిశీలిస్తూ ఏ విధంగా స్క్రూటిని చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకొని, పొరపాట్లు జరగకుండా చేయాలని, వారికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షాద్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన ఏర్పాట్లను, ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తు, ఎన్నికలకు సంబంధించిన ఫర్నిచర్‌తో పాటు స్టేషనరీ తదితర అంశాలను మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకొని వాటిని పరిశీలించారు. నామినేషన్లకు సంబంధించి స్క్రూటిని ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూమును, కౌంటింగ్ హాల్ ను తనిఖీ చేశారు. ఎన్నికలకు నిర్వహనలో ఎలాంటి అశ్రద్ధ చేయకూడదని సజావుగా జరిగే విధంగా అధికారులు సిబ్బంది అందరూ కృషి చేయాలని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, 13న జరగబోయే కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.

## విద్యార్థులు భవిష్యత్ మార్గదర్శకులు



**ప్రజాపక్షం/హయత్‌నగర్:** విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుని రాణించాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ ఆకాష్ తెలిపారు. వనస్థలిపురం ఆటో సాయి నగర్ కాలనీలోని ఇంటర్నేషన ల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో స్పార్క్ వెస్ట్ 2025–26 కార్యక్రమాన్ని శనివారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల చైర్మ న్ డాక్టర్ అల్లబ్ ఆకాష్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేటి పోటీ ప్రపంచం లో ఎంచుకున్న రంగంలో విశేష ప్రతిభను కనబరచాలన్నారు. విద్యతోపాటు సాంకేతిక సృజనాత్మక అంశాలను క్రోడీకరించుకుని తమలో దాగున్న ప్రతిభ ను ప్రపంచానికి చాటి చెప్పాలని ఆయన సూచించారు. మారుతున్న విద్య విధానానికి అనుగుణంగా తమ పాఠశాలలో విద్యార్థులకు నూతన టెక్నాలజీతో కూ డుకున్న విద్యను అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇట్టి స్పా ర్క్ వెస్ట్ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తమ ప్రతిభను చాటి చెప్పడం అభినందనీయమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల రూపొందించిన ఏఐ రోబోటిక్స్, తెలుగుభాష యొక్క గొప్పదనం, మన ఆచార సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను చాటి చెప్పే దేవాలయాలు, నూతన టెక్నాలజీని అవలంబించుకోవడానికి కావలసిన సైన్స్ విభాగం, మన జీవన విధానం పై గణిత శాస్త్రం యొక్క ప్రాముఖ్యత, వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం తదితర అంశాలపై రూపొందించిన పలు నమూనాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాంబశివరావు, కమల్ , స్రవంతి, ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తిదతరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంప్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మధురానగర్ కాలనీ అసోసియేషన్,సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ( నాగోల్ డివిజన్) సంయుక్తంగా కామినేని హాస్పిటల్స్(ఎల్ బి నగర్)వారి సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ను శనివారం సరస్వతీ గౌడ సమాజ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించడం జరిగింది.ఈ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, ఆర్తో, ఇఎన్‌టి, కంటి, గైనకాలజిస్ట్ డాక్టర్ల తోపాటు ఇసిజి, ఆర్‌బిఎస్, టెస్టులు నిర్వహించే పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కాలనీతో పాటు నైబరింగు బస్తీల వాసులు,వందకు పైగా సీనియర్ సిటిజన్స్ వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్ రావు, కార్యదర్శి టి చక్రదర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడురసింహారెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి ఆరోపించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలో ఎంపిడిఓ బన్సీలాల్ చేతుల మీదుగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నరసింహారెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మౌళిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కనీస వేతనం ఇవ్వకపోవడమే కాకుండా పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ఆసుపత్రులకు అయ్యే ఖర్చులు, యూనిఫాం, షూ, చేతులకు బ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.21వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 12వ తేదిన బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షకులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు దేశ వ్యాప్తంగా సమ్మె ఉంటుందని వివరించారు. ఎంపిడిఒ బన్సీలాల్ మాట్లాడుతూ యూనియన్ తరుపున తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తామని, కనీస వేతనం అమలు అయ్యే విధంగా ప్రభుత్వానికి నివేధిక పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు డివిజన్ అధ్యక్షులు ఎన్.రాజునాయక్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు యాదమ్మ, చంద్రమ్మ, గోపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇషాన్ కిషన్ సెంచరీ..

## బ్యాటుతో బాదేసి.. బంతితో చుట్టేసి..

## చివరి టీ20లోనూ భారత్‌దే విజయం

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 41 తేడాతో కైవసం చేసుకుంది. తిరువనంతపురం వేదికగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టీమ్ఇండియా 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్య ఛేదనలో కివీస్ 225 పరుగులకు ఆలౌటైంది. ఫిన్ అలెన్ 80 (38 బంతుల్లో: 8 ఫోర్లు, 6 సిక్స్‌లు), రచిన్ రవీంద్ర 30 (17 బంతుల్లో: 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ 26 (12 బంతుల్లో: 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సోధి 33 (15 బంతుల్లో: ఫోర్, 3 సిక్స్‌లు) రన్స్ చేశారు. భారత్ బౌలర్లలో అర్ష్‌దీప్ 5, అక్షర్ పటేల్ 3, వరుణ్, రింకు సింగ్ చెరో ఒక వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ (103; 43 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి శతకం బాదేశాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63; 30 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరోసారి మెరుపులు మెరిపించాడు. హార్దిక్ పాండ్య (42; 17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (30; 16 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా ఆకట్టుకున్నారు. సూర్యకుమార్, ఇషాన్ మూడో వికెట్‌కు 57 బంతుల్లోనే 137 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి టీమ్ఇండియా భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఇష్ సోధి వేసిన 12 ఓవర్‌లో కిషన్ వరుసగా 4, 4, 4, 6, 4, 6 బాదేయడం విశేషం. భారత్ చివరి 12 ఓవర్లలో 202 పరుగులు రాబట్టడం గమనార్హం. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ 2.. డఫీ, జేమీసన్, శాంట్నర్ తలో వికెట్ తీశారు. టీ20ల్లో భారత్‌కు ఇది మూడో అత్యధిక స్కోరు.

## సూర్యలో రోహిత్ ఛాయలున్నాయ్

→ ఇర్ఫాన్ పఠాన్



టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌పై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంశల జల్లు కురిపించాడు. అతని ఆట తీరులో రోహిత్ శర్మ ఛాయలున్నాయని కొనియాడారు. ఒక టీం లీడర్‌గా అతను జట్టును నడిపించటంలో సేమ్‌టు సేమ్ రోహిత్‌ను తలపిస్తాడని పఠాన్ అన్నారు. టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు దక్కట్లేదన్నారు. 'రోహిత్ శర్మ తరువాత కెప్టెన్సీ బాధ్యలు తీసుకున్న సూర్య.. భారత జట్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించాడు. అతని కెప్టెన్సీలో 41 టీ20లు ఆడిన భారత్ 31మ్యాచ్‌లు గెలిచింది. 2025 ఆసియా కప్‌ను సైతం స్వాధీనం చేసుకుంది. సూర్య కుమార్ జట్టు కెప్టెన్‌గా అద్భుత ఫలితాలు సాధించినప్పటికీ అతను వ్యక్తిగతంగా పరుగులు చేయడంలో విమర్శలకు గురయ్యాడు. ముఖ్యంగా 2025లో ఆడిన మ్యాచ్‌లలో అతను చెప్పుకోదగిన పరుగులు చేయలేకపోయాడు. మొత్తం 21 మ్యాచ్‌లు ఆడిన సూర్య కేవలం 218 పరుగులు సాధించాడు. టి20 ప్రపంచ కప్‌కు ముందు సూర్యకుమార్ అతని ఫామ్‌ను నిరూపించుకోవాల్సిన అవసరముంది' అని పఠాన్ అన్నాడు. కెప్టెన్‌గా అతను వరల్డ్‌కప్‌లో ఖచ్చితంగా ఆడతాడని పేర్కొన్నాడు. కానీ అంత కంటే ముందు అతను పరుగులు చేసి తన సత్తా ఏంటో నిరూపించుకోవాల్సిన అవసరముందని పఠాన్ అభిప్రాయపడ్డాడు.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత రిబకినా

**మెల్‌బోర్న్:** ఎలినా రిబకినా సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళ సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నది. ఇవాళ జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ వన్ అరినా సబలెంకను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకున్నది. రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో.. రిబకినా మూడవ సెట్‌లో అనూహ్య రీతిలో సత్తా చాటింది. కజకిస్తాన్ అయిదో సీడ్ ప్లేయర్ రిబకినా మూడవ సెట్‌లో ఓ దశలో 3–0 తేడాతో వెనుకబడి ఉన్నది. కానీ ఆ తర్వాత కోలుకున్న ఆమె తిరుగులేని ఆటను ప్రదర్శించింది. వరుసగా అయిదు గేమ్‌లను గెలిచి 6–4 4–6 6–4 స్కోరుతో మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసింది. 2023 ఫైనల్లో సబలెంక చేతిలో రిబకినా ఓడింది. ఆ ఓటమికి ఇప్పుడు ఆమె రివేంజ్ తీసుకున్నది. యూఎస్ ఓపెన్ చాంపియన్ అయిన సబలెంక.. గత నాలుగు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో మూడింటిని కోల్పోయింది. గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌లోనూ ఆమె ఓటమి పాలైంది.




### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 82,049.94 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 81,537.70 పాయింట్లు. లాభం 512.24 పాయింట్లు).
**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 25,048.65 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,048.65 పాయింట్లు. లాభం 117.50 పాయింట్లు).

## బంగారానికి తగ్గనున్న డిమాండ్?



భారత బంగారు మార్కెట్‌లో కీలకమైన మలుపు కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ఆర్థిక–భౌగోళిక అనిశ్చితులు బంగారం ధరలను రికార్డు స్థాయికి నెట్టడంతో, సామాన్య వినియోగదారుల కొనుగోలు సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ బంగారు మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ – డబ్ల్యుజిసి) విడుదల చేసిన తాజా నివేదిక భారత మార్కెట్‌లో బంగారం డిమాండ్ భవితవ్యంపై స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. నివేదిక ప్రకారం, 2026లో భారతదేశంలో మొత్తం బంగారం డిమాండ్ తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఆభరణాల విభాగంలో అమ్మకాలు క్షీణించడం, మార్కెట్‌పై ప్రధాన ప్రతికూల ప్రభావంగా మారనుంది. డబ్ల్యుజిసిని అనుసరించి, గత ఏడాది దేశీయ బంగారం డిమాండ్ గణనీయంగా తగ్గింది. 2024లో 710.9 టన్నులుగా ఉన్న వినియోగం, 2025లో 24 శాతం పడిపోయి 430.5 టన్నులకు చేరింది. ఇది గత మూడు దశాబ్దాల్లో నమోదైన అత్యల్ప స్థాయిల్లో ఒకటి. 2020లో కొవిడ్ మహమ్మారి కారణంగా గణాంకాలు అసాధారణంగా మారినప్పటికీ, 2025లో కనిపించిన తగ్గుదల పూర్తిగా మార్కెట్ పరిస్థితుల ప్రతిబింబమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ధరల అస్థిరత, అధిక ధర స్థాయిలు వినియోగదారుల నిర్ణయాలను గణనీయంగా ప్రభావితం చేశాయి. భారతీయ వినియోగదారులు సాధారణంగా బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పుడు కొనుగోళ్లకు మొగ్గు చూపుతారు. అయితే 2025లో బంగారం ధరలు తరచూ కొత్త గరిష్టాలను తాకుతూ అస్థిరంగా పెరగడం వల్ల, ఆభరణాల కొనుగోళ్లు వినియోగదారుల బడ్జెట్‌లకు అందని స్థాయికి చేరాయి. ఫలితంగా వివాహాలు, పండుగల సీజన్‌లోనూ ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదు. ఇది ఆభరణాల రంగానికి గట్టి దెబ్బగా మారింది. దీనిలో భాగంగా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఇటిఎఫ్)లలో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. 2025లో బంగారు ఇటిఎఫ్‌లలోకి వచ్చిన పెట్టుబడులు 283 శాతం పెరిగి రూ.429.6 బిలియన్లకు (సుమారు 4.67 బిలియన్ డాలర్లు) చేరాయి. ఈ పెరుగుదలతో పెట్టుబడి డిమాండ్ 17 శాతం వృద్ధి చెంది 280.4 టన్నుల స్థాయికి చేరింది. ఈ మార్పు భారత బంగారు మార్కెట్ స్వరూపం నెమ్మదిగా వినియోగ ఆధారిత మోడల్ నుంచి పెట్టుబడి ఆధారిత మోడల్ వైపు కదులుతోందని సూచిస్తోంది. ధరల పెరుగుదలతో మరో ఆసక్తికర ధోరణి స్క్రాప్ బంగారం విషయంలో కనిపించింది. అయితే 2025లో ఈ ట్రెండ్ బలహీనపడింది. స్క్రాప్ సరఫరా 19 శాతం తగ్గి 92.7 టన్నులకు చేరింది. మొత్తానికి ఈ ఏడాది మన దేశంలో బంగారం డిమాండ్ మిశ్రమంగా ఉండవచ్చని అంటున్నారు. సామాన్యులు ఆసక్తిని ప్రదర్శించకపోవడంతో, ఆభరణాల అమ్మకాలు ఇంకా ఒత్తిడిలోనే ఉండే అవకాశమున్నప్పటికీ, పెట్టుబడి విభాగం కొంత మేరకు మార్కెట్‌ను నిలబెట్టే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ కదలికలు, వడ్డీ రేట్ల విధానాలు, దేశీయ ధరల స్థిరత్వం వంటి అంశాలు భారత బంగారు డిమాండ్‌ను నిర్ణయించే కీలక కారకాలుగా నిలవనున్నాయి. బంగారం ఇక కేవలం అలంకార వస్తువుగా కాకుండా, వ్యూహాత్మక పెట్టుబడి సాధనంగా భారత మార్కెట్‌లో కొత్త పాత్రను పోషిస్తున్నట్లు తాజా పరిణామాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

## రిటైర్‌మెంట్ భద్రతపై చర్చ..

భారతదేశంలో ఉద్యోగుల రిటైర్మెంట్ భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. ఆదివారం (ఫిబ్రవరి 1) పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న 'బడ్జెట్ 2026'లో పెన్షన్ వ్యవస్థకు సంబంధించి కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్బీఐ రీసెర్చ్ విడుదల చేసిన 'ప్రిల్యూడ్ టు యూనియన్ బడ్జెట్ 2026–27' నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత గ్యారెంటీ ఆదాయం లభించేలా వ్యవస్థను బలోపేతం చేయాలని ఈ నివేదిక సూచిస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ ముఖ్యంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏప్రిల్ 1, 2025 నుంచి అమలులోకి వచ్చిన యుపిఎస్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమై ఉంది. అయితే ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని నివేదిక చెబుతోంది. ఇప్పటివరకు కేవలం సుమారు 1.2 లక్షల మంది మాత్రమే ఈ పథకంలో చేరడం, దీనిని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. అందుకే యుపిఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని ఎస్బీఐ సూచించింది. ఇదే సమయంలో 'ఎన్‌పిఎస్ వాత్సల్య' పథకంపైనా నివేదిక దృష్టి సారించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) వ్యవస్థ ఆధునీకరణ కూడా మరో కీలక అంశంగా నివేదికలో ప్రస్తావించబడింది. ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న కోట్లాది మందికి ఇప్పటికీ సమగ్ర పెన్షన్ భద్రత లేదన్నది పెద్ద సమస్యగా ఉంది. దీనికి పరిష్కారంగా, 100 లేదా 200 మందికి మించిన ఉద్యోగులు ఉన్న ప్రైవేట్ సంస్థల్లో ఎన్‌పిఎస్‌ను తప్పనిసరి చేయాలని ఎస్బీఐ ప్రతిపాదించింది. ఇది అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా పెన్షన్ కవరేజ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2026లో ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటే, దేశంలోని ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత మరింత ఆర్థిక భరోసా లభించే అవకాశం ఉంది. ఇది భారత పెన్షన్ వ్యవస్థలో ఒక కీలక మలుపుగా మారవచ్చు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## సిఆర్ ఫౌండేషన్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని శాసనమండలి సభ్యులు నెలికంటి సత్యం శనివారం సందర్శించి వృద్ధాశ్రమంలో ఉన్న పెద్దలను పరామర్శించారు. ఫౌండేషన్ కోశాధికారి, డైరెక్టర్ వి.చెన్నకేశ్వరరావు వారికి స్వాగతం పలికి వృద్ధాశ్రమంలోని సదుపాయాలను చూపించారు. ఆశ్రమంలో నివసిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు ఐఎస్ రాజు, ఝాన్సీ దంపతులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఐదుకల్లు అరుణ కుమారి, ఎర్నేని సత్యం, స్వాతంత్ర్య సమరయోధుడు రామిరెడ్డి, శ్రీమతి తమ్మారెడ్డి తాన్య కుమారి, టి.రాజేందర్ రావు, తదితర ఆశ్రమవాసులను ఎమ్మెల్సీ సత్యం, వారి సతీమణి అన్నపూర్ణ, కుమార్తె చైతన్యలతో కలిసి పరామర్శించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్‌లో ఆధ్వర్యంలో నడుస్తున్న నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్, సురవరం సుధాకర్ రెడ్డి లైబ్రరీ, సిఆర్ పాలిక్లినిక్, డయాగ్నోస్టిక్ కేంద్రాలను మహిళా సంక్షేమ కేంద్రాన్నిసందర్శించారు. కార్యక్రమంలో సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు లలిత వారికి అక్కడ విద్యార్థినిలకు నిర్వహిస్తున్న కోర్సులను వివరించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను ఆదరించండి

### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో జరిగిన సిపిఐ పట్టణ కార్యవర్గం దంతాల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ పార్టీకి పట్టున్న వార్డుల్లో పోటీ చేస్తున్నామని ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పోటీ చేస్తామన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాడుతుందని చెప్పారు. సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీసి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటిల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయని ఆ సమస్యల పరిష్కారం కోసం సిపిఐ దశలవారీగా ప్రజాఉద్యమాలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. పట్టణంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజా సమస్యలపై అవగాహన కలిగి నిరంతరం ఉద్యమాలు చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో సిపిఐ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు బూర వెంకటేశ్వర్లు, ఐతరాజు లింగమ్మ వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మంపాటి రాము, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ దోరేపల్లి శంకర్, చామల అశోక్ కుమార్, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, రేగట్టి లింగయ్య, ఎండి పాషా, పెంద్ర కృష్ణ, పొదిలి వెంకటమ్మ పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై..

# 12న దేశవ్యాప్త సమ్మె

### ఎఐసిబిసిడబ్ల్యు (ఎఐటియుసి) పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఎఐసిబిసిడబ్ల్యు (ఎఐటియుసి) ఈనెల 12వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. అలాగే ఈనెల 23న మరోసారి దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. 2026 జనవరి 25, 26 తేదీల్లో కోయంబత్తూరులో నిర్వహించిన ఎఐటియుసి అఖిల భారత సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కార్మికుల సమస్యలు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల్లో మార్పులు, సామాజిక భద్రత లేకపోవడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం 21–11–2025 నాటికి కార్మిక కోడ్‌ల అమలుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇవి కార్మికుల హక్కులను హరించేవిగా ఉన్నాయని ఎఐటియుసి నాయకులు విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల నిర్మాణ కార్మికులతో పాటు అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా ఫిబ్రవరి 23న మరోసారి దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎఐటియుసితో పాటు ఇతర కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, సంఘాలు పాల్గొననున్నట్లు చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, వేతనాల భద్రత, సామాజిక భద్రతా పథకాల అమలు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఈ ఉద్యమాలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు. కోయంబత్తూరు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని యూనియన్ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జాతీయ కార్యదర్శి వహీద్ నిజాం, తెలంగాణ నుండి జి. రమేష్, జి. రాజు, జి. లక్ష్మి నారాయణ, బి. మల్లికార్జున్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికులందరూ ఐక్యంగా ఈ పోరాటంలో పాల్గొని జయప్రదం చేయాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీ మారగోని ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



## కార్మికులు పోరాటాలతో సాధించుకున్న 42 చట్టాలు కొనసాగించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 12న జరిగే సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సివిల్ సప్లై కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ గ్రాడ్యుటి బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాలను ఆపాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత పథకాన్నిప్రవేశపెట్టాలని, వ్యవసాయ మార్కెట్‌లో దడవాయి కార్మికుల రిటైర్‌మెంట్ వయసును 65 పెంచాలని, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు నాటి పోరాటంలో సాధించుకున్న 42 రకాల చట్టాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందన్నారు. వారికి అనూకులంగా కార్మిక చట్టాలు తయారు చేస్తుందని అలాంటి ఆలోచనలు కేంద్ర ప్రభుత్వం మానుకొకపోతే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామ్మూర్తి, పొనుగోతు గోపి తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ల కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయాలి

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్

### ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట నాలుగో మహాసభల ప్రచార సామాగ్రి ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ తేనె పూసిన కత్తిలా తీసుకువచ్చారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 8న వరంగల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాలుగవ రాష్ట్ర మహాసభల ప్రచార సామాగ్రి వాల్ పోస్టర్స్, కరపత్రాలను శనివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకట్రామారెడ్డి భవనంలో ఆవిష్కరించారు. అనంతరం కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదారవాద ఆర్థి క విధానాలు కార్మిక వర్గ సంక్షేమానికి గొడ్డలి పెట్టు లాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సంపద 10% సంపన్న కార్పొరేట్ వర్గాల చేతిలో కేంద్రీకృతం అవుతున్నదని సంపద సృష్టించే కార్మిక వర్గ మాత్రం కటిక దారిద్ర్యంలో మగ్గుతున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ శ్రమ దోపిడీకి ఆర్థిక లూటీకి కేంద్ర బిందువుగా మారుతున్నాయని కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని కోరారు. లేబర్ కోడల వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిరాజ్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నేతలు రంగన్న, బాలకోటి, యాదయ్య, అంజి, శ్రీను, భీమయ్య, సునీత, నాగలక్ష్మి, వరలక్ష్మి, మంజుల, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్, సిపిఐ పొత్తు

### కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్..

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్/మంచిర్యాల:** చెన్నూరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్, సిపిఐల మధ్య మైత్రి కొనసాగుతున్నప్పటికీ, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో మాత్రం సిపిఐ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇక్కడ బిఆర్ఎస్ పార్టీతో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ ఇచ్చింది. శనివారం బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య భేటీ అయి పొత్తులను ఖరారు చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్, కలవేన శంకర్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంత కార్మికులు, ప్రజల సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నప్పటికీ, స్థానికంగా చెన్నూరు నియోజకవర్గంలో బిఆర్ఎస్‌తో మిత్రధర్మం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, కార్మిక వ్యతిరేక చర్యల వల్ల సంస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు పార్టీలు సమన్వయంతో పని చేసి క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 3వ తేదీన వార్డుల వారీగా సీట్ల కేటాయింపును ఖరారు చేయనున్నట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగుల లక్ష్మణ్, బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీ

**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విధులకు రాని ఉద్యోగుల వివరాలు తెలుసుకున్నారు. స్వతహాగా డాక్టర్ కావడంతో ఆస్పత్రిలోని రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రిలో వాషింగ్ మిషన్ వినియోగం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఐసియు, డయాలసిస్ బెడ్స్‌కూడా పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, డాక్టర్ ప్రదీప్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేస్తే ప్రజాదరణ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని వాటికోసం పోరాడితే ప్రజల్లో అభిమానం పెరుగుతుందని వారికి సేవచేస్తే ప్రజాదరణ ఉంటుందని నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి అన్నారు. శనివారం అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ప్రజాగాయకుడు గద్దర్ 78వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎంపి మల్లురవి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవచేసి మమేకమైనందుకు గద్దర్‌కు యుద్ధనౌక అని ప్రజలు బిరుదు ఇచ్చారన్నారు. ప్రజల కోసం అహర్నిశలు పోరాడి అమరుడైన గద్దర్‌కు నిజమైన నివాళులు అర్పించామన్నారు. గతప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రజలకోసం ప్రజానాట్యమండలి తన పాట, గళంతో చైతన్యపర్చారన్నారు.

## పదవి విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వనపర్తి:** జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి వనపర్తి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు విశిష్ట సేవలు అందించి ఈరోజు పదవి విరమణ పొందుతున్న 5 మంది పోలీసు అధికారులు వనపర్తి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ ఎస్సైలు బాలయ్య, దేవేంద్రయ్య, పెబ్బేరు ఏఎస్సై శ్రీనివాసులు, వనపర్తి రూరల్ ఏఎస్సై దౌలత్‌ఖాన్, ఆత్మకూరు హెడ్‌కానిస్టేబుల్ మన్నెపు రెడ్డి ఆరుగురు పోలీసు అధికారుల దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. వారి నిబద్ధతతో కూడిన సేవలకు జిల్లా పోలీసు శాఖ తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ, బాలాజీ, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునందన, కొత్తకోట సిఐ, రాంబాబు, వనపర్తి సీఐ, రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, అప్పలనాయుడు, పదవీవిరమణ పొందిన పోలీసు అధికారులు కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పేదలకు అండగా ప్రభుత్వం



వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ

**ప్రజాపక్షం/వెల్దండ:** ప్రజా పాలనలో నిరుపేద ప్రజలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమళ్ల కృష్ణ అన్నారు.శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాయితి వీరారెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్‌ను ఆయన పెద్దాపూర్ ఉప సర్పంచ్ ప్రసాద్ చారితో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జక్కుల మల్లేష్‌యాదవ్, కాటిక అంజయ్య, మాడుగుల నిరంజన్, లలిత మల్లయ్య, మమత అనిల్, నెంట శ్రీను, గంగపూరం శ్రీశైలం, హరిలాల్, సుధాకర్, వెంకటేష్, కాటిక రాములు, కృష్ణయ్య, కొండల్‌రెడ్డి, వెంకటయ్య ప్రశాంత్‌లతో తదితరులున్నారు.

## ఏదులలో రోడ్లు, పరిసరాల పరిశుభ్రత

**ప్రజాపక్షం/రేవల్లి:** ఏదుల మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (కో ఎడ్యుకేషన్) వనపర్తి ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 అండ్ 4 ఆధ్వర్యంలో శీతాకాల శిబిరం రెండవ రోజులో భాగంగా ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి గ్రామ సర్పంచు పరుశురాముడు, ఉపసర్పంచు శేశిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధాంసింగ్ పూలమాలలు వేసి ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్‌తో కలిసి కొద్దిసేపు రోడ్లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ ధాంసింగ్, డా. రాఘవేంద్ర, వెంకట స్వామి, ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కుందేళ్ళ అర్జున్ యాదవ్, గ్రామపంచాయితీ వార్డ్ మెంబర్ల సిబ్బంది, పంచాయితీ సెక్రెటరీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ చురుకుగా పాల్గొన్నారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్:** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని సేరిపల్లి గ్రామంలో శనివారం ఘనంగా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కుల వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని తాహసిల్దార్ రాజు అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి నారాయణ, ఎస్సై హిమబిందు, ఆర్ఐ రాధాకృష్ణ, సర్పంచు వెంకటయ్య, పంచాయితీ సెక్రెటరీ కార్తీక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు వంద శాతం మంజూరు

చర్యలు తీసుకోవాలి : షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యదర్శి డా.బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులకు ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్‌లు వంద శాతం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యదర్శి డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లతో కలిసి విద్యాశాఖ ఎం.ఈ.ఓ.లు, షెడ్యూల్డ్ కులాల శాఖ వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమీవేశం నిర్వహించారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రిజిస్ట్రేషన్, మంజూరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరుకు ఎస్‌సి వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులు సంఖ్య ఎంత? ఇందులో ఎంత మందికి రిజిస్ట్రేషన్ చేశారు. ఎంత మందికి మంజూరు చేశారు. ఎంత మంది అకౌంట్‌లలో స్కాలర్ షిప్ డబ్బులు జమ చేయడం జరిగింది తదితర విషయాలపై సమీక్షించారు. జిల్లాలో ఫ్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ 42 శాతం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, 62 శాతం పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ లు మంజూరు పూర్తి చేసినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని తెలిపారు. రాష్ట్రంలో ఇతర జిల్లా లతో పోలిస్తే మహబూబ్ నగర్ జిల్లా వెనుకబడి ఉందని తెలిపారు. వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడి కారణాలు తెలుసుకున్నారు. కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరు, అకౌంట్ ఆధార్ సీడింగ్ వలన స్కాలర్ షిప్ పెండింగ్ ఉన్నట్లు వివరించారు. సీసీ కుంట మండలంలో 80 శాతం చేయడం పట్ల అభినందిస్తూ మిగతా మండలాల వసతి గృహ సంక్షేమ అధికారులు కూడా ఈ సంవత్సరం నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రెన్యూవల్ దరఖాస్తులు పూర్తి చేసినట్లు, ఫ్రెష్ దరఖాస్తులు కూడా త్వరగా రిజిస్ట్రేషన్, మంజూరు కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. నూతన హాస్టల్ భవనాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. హాస్టల్ లలో స్పోర్ట్స్, ఫుడ్, మెస్, సర్వింగ్, లైబ్రరీ ఇతర, కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఆర్.డి.ఓ నవీన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని సునీత, డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్ పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కార్మికవ్యవస్థను విచ్ఛిన్నంచేసే నాలుగు లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దుచేయాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని ,వీబి జి రాంజి బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ విత్తనబిల్లును వెంటనే రద్దుచేయాలని ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 సంవత్సరాల కాలంలో దేశంలో పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందన్నారు. అదేవిధంగా జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చే విధంగా పథకానికి నిధులు తగ్గించి ఆ పథకం నుంచి పూర్తిగా తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. గతంలో 90శాతం నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మాత్రం 60శాతం నిధులు మాత్రమే ఇస్తామని మిగతా 40శాతం నిధులు రాష్ట్రాలు భరించుకోవాలని చెప్పడం పథకం నుంచి పూర్తిగా తప్పించుకోవడమేనని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి భవననిర్మాణకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపాగశ్రీనివాసులు, ఎఐటియూసి జిల్లానాయకులు కొత్తరామస్వామి, తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్, సిఐటియు జిల్లా గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తులవెంకటేశ్వర్లు, ఎఐటియూసి హమాలీ జిల్లానాయకులు గొర్లసత్యం, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే తొలి ప్రాధాన్యం

కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/పెబ్బేరు:** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రత, ఆరోగ్యం తమ మొదటి ప్రాధాన్యత వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. శుక్రవారం కొత్తకోట బిసి సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అస్వస్థతకు గురైన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారితో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కొత్తకోట బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన కలుషిత ఆహారం ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిటీని ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, నేతృత్వంలో విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను కొత్తకోట బీసీ బాలికల వసతి గృహం అధికారితో పాటు ఇద్దరు వంట మనుషులను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని బిసి సంక్షేమ అధికారిని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే ముందు ఆహారాన్ని సంబంధిత అధికారులు తప్పనిసరిగా రుచి చూడాలని, నాణ్యతను ధృవీకరించిన తర్వాతే వడ్డించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ పాఠశాలలు , కళాశాలల ప్రిన్సిపాల్స్ హాస్టల్ వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లికార్జున్, డీఈఓ అబ్దుల్ ఘని, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో సొంత ఆలోచనలు అమలు చేయకండి



జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నిబంధనల మేరకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు కీలకంగా వ్యవహరించాలి, మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు సొంత ఆలోచనలను వినియోగించకుండా సమన్వయంతో, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు మాత్రమే విధులు నిర్వహించి విజయవంతమైన ఎన్నికలకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు, ఓపిలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహిచడంలో ప్రతి ఎన్నికల అధికారి ప్రతి ఎన్నికల విధుల్లో నూతనంగా పాల్గొన్నట్లే, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ఆపుస్తకాన్ని తప్పనిసరిగా చదవాలని, ఎన్నికల సంఘం జారీ మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికల నిర్వహణ జరగాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకొని బాధ్యాతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డిప్యూటి సిఇఓ గోపాల్‌నాయక్, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విజయ్‌సింహా పాల్గొన్నారు.

## విద్యార్థులకు మౌలిక వసతులు, సంక్షేమంపై దృష్టి పెట్టాలి

ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి డా.బుద్ధ ప్రకాశ్ జ్యోతి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యదర్శి డా.బుద్ధ ప్రకాశ్ జ్యోతి శనివారం జడ్చర్లలోని తెలంగాణ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికల)ను సందర్శించి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మొదటగా 5వ తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరిక్షించారు. ఐదో తరగతి పాఠ్యపుస్తకాలను మరింత రంగురంగులుగా మార్చి, బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ అనే మూడు స్థాయిల్లో అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతిని సందర్శించి ఫిజిక్స్ బోధనను పరిశీలించారు. బోధనా విధానాన్ని ప్రశంసించారు. సమీక్షలో భాగంగా టిజిఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జడ్చర్లకు 25 సంవత్సరాలు పూర్తైన నేపథ్యంలో దీనిని ఒక మైలు రాయిగా జరుపుకోవాల్సిన అవసరం ఉందని కార్యదర్శి తెలిపారు. రోజుకు మూడుసార్లు అసెంబ్లీ నిర్వహిస్తూ ఉపన్యాసాలు, ప్రసంగాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, యస్సి వెల్ఫేర్ అదనపు కార్యదర్శి గీత, జాయింట్ సెక్రెటరీలు శక్రునాయక్, శర్మ, శ్రీనివాస్, అదనపు డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జోనల్ అధికారులు, రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాల్గొన్నారు.

## బిసి బాలికల హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థినులు

పరామర్శించిన ఎమ్మెల్యేలు జియంఆర్, మేఘారెడ్డి

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మున్సిపాలిటీ లోని బీసీ బాలికల వసతి గృహంలో 15 మంది విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురైన విషయం తెలుసుకుని, హుటాహుటిన వనపర్తి జిల్లా ఆసుపత్రికి చేరుకొని, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి విద్యార్థినులను పరామర్శించి వారితో నేరుగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, డీఎంహెచ్‌ఓతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అనంతరం హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొని తదనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ బీసీ బాలికల వసతి గృహంలో ఉంటూ 140 మంది విద్యార్థినులు వివిధ కాలేజీలలో చదువుకుంటున్నారని, వారు సాయంత్రం హాస్టల్‌కు తిరిగి వచ్చే సమయంలో జంక్ ఫుడ్ తిని అస్వస్థత గురై ఉండవచ్చని ఎమ్మెల్యే జిఎంఆర్ అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తూ, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని డిఎంహెచ్‌ఓని ఎమ్మెల్యేలు జియంఆర్, మేఘారెడ్డి ఆదేశించారు.

## మిలిటరీ ఇంజనీర్ సర్వీసెస్ అధికారుల బృందంతో కలెక్టర్ భేటీ



**ప్రజాపక్షం/నారాయణపేట్:** మిలిటరీ ఇంజనీరి సర్వీసెస్ ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ శిక్షణ కేంద్రం, హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ భేటీ అయ్యారు. అధికారుల కోసం 8వ ఫౌండేషన్ కోర్సుల్లో భాగంగా ఈ నెల నుంచి 31 వరకు విలేజ్ విజిల్ కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు అధికారులు 4 బృందాలుగా ఏర్పడి జిల్లాలో ఎంపిక చేసిన నాగిరెడ్డి పల్లి మద్దూరు సింగారం నారాయణ పేట మండలం మరికల్, ఉట్కూర్, దామరగిద్ద మండల కేంద్రాలతో పాటు నారాయణపేట్ మండలం మరికల్, ఉట్కూర్, దామరగిద్ద మండల కేంద్రాలతో పాటు నారాయణపేట్ మున్సిపాలిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సోషల్ ఎకనామిక్ అండ్ డెవలప్ మెంట్ స్కీమ్ సర్వే నిర్వహించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో అధికారుల బృందం తో కలెక్టర్ భేటీ అయి, సర్వే ఎలా సాగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా బృందాల ముఖ్యులు తాము వారం రోజుల పాటు గ్రామాల్లో చేసిన సర్వే నివేదికను కలెక్టర్ కు అందజేశారు.

## నామినేషన్ తిరస్కరించాలని ఫిర్యాదు

**ప్రజాపక్షం/మక్తల్:** కాంగ్రెస్ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ న్ను తిరస్కరించాలని బిజేపీ అభ్యర్థి బి.రాజశేఖర్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కు కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా మక్తల్ మండలంలోని పంచదేవపాడు గ్రామంలో 4వ వార్డ్ నందు పోలింగ్ స్టేషన్ నంబర్ 4లో పీఎస్ రూం నెంబర్ 2లో ప్రాథమిక పాఠశాల యందు ఎస్ నౌ 139 (ఎస్‌జిడబ్ల్యూ 2241859) గత గ్రామపంచాయతీ ఎన్నికల లో ఓటు హక్కు వినియోగించుకున్నాడు.అదేవిధంగా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 18 వార్డ్ నెంబర్ 8లో ఎస్ నౌ 497లో ఓటు హక్కు కలిగియుండి 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చినటువంటి ఓటు హక్కును దుర్వినియోగపరుస్తున్న 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ తిరస్కరించాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. సమాజంలో ఒక బాధ్యత కలిగిన వ్యక్తి రాజ్యాంగం ఇచ్చినటువంటి హక్కును ఈ విధంగా దుర్వినియోగంచేయడం ప్రజాస్వామ్యాకి సిగ్గుచేటన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ను తిరస్కరించాలని, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


## ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు

ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏనుగొండలో మున్సిపల్ డివిజన్ కార్యాలయం, భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో గల దయానంద విద్యా మందిరం పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రిటికల్ పోలింక్ కేంద్రాల లోకేషన్‌ను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ లను నియామకం చేసి పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం లొకేషన్‌లో పోలీస్ అధికారులు శాంతి భద్రతల సమస్య లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఆలయాన్ని అభివృద్ధి పరుచుకుందాం



ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్:** వనపర్తి మండలం కాశీంనగర్ శివారులోని ఎర్రగట్టు పై వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచినందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ పూర్తయిన రెండవ వారం త్రయోదశి రోజున గుట్ట పైన గల ఈ ఆంజనేయస్వామి కి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గుట్టపైకి వెళ్లేందుకు దారి ప్రమాద భరితంగా ఉందని గుట్ట పైకి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన వచ్చే ఏడాది నాటికి గుట్ట పైకి రహదారి నిర్మాణం చేపట్టడమే కాకుండా ఆయన ఆలయ అభివృద్ధి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జడ్పిటిసి గొల్ల వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, పెద్దలు , మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాలికల భద్రతకు షీటీం భరోసా




**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మహిళలను, బాలికలకు భద్రత భరోసా కల్పించే షీటీం సేవలను ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలని షీటీం ఎస్సై అంజాద్ అన్నారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్, షీటీం, ఆధ్వర్యంలో కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల ప్రభుత్వాసుపత్రిలో మహిళలు, బాలికలకు భద్రతా భరోసా కల్పించే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షీటీం ఎస్సై అంజాద్ విద్యార్థినిలు మహిళలతో మాట్లాడుతూ మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీరు మాట్లాడితే పోలీసు శాఖ వినిపిస్తుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.రాణి, షీం సిబ్బంది శిరీష, రాణి, డా.రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/పానుగల్:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తహసిల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో గోవిందరావు, డిప్యూటీ తహసిల్దార్ అశోక్ అన్నారు. పానుగల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ సెకండ్ ఎడిషన్ 2025–2026లో భాగంగా నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిటి అశోక్, గ్రామ సర్పంచు నాగలక్ష్మి, నరేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము యాదవ్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , నాగలీల, పీడీలు శ్యామల, పద్మ, శ్రీదేవి, గోవిందు, ఉమామహేశ్వర్‌రెడ్డి, మోహన్, కరుణాకర్ విక్రం, కవిత పాల్గొన్నారు.



# ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎన్నికల విధులలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రిసైడింగ్,సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పార్టీ ఆధారంగా జరుగుతాయని,అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పాటించిన విధంగానే అన్ని నియమ,నిబంధనలు ఈఎన్నికలలో సైతం వర్తిస్తాయన్నారు.ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్ ను పిఓలు జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని,బ్యాలెట్ బాక్స్‌ల సీలింగ్ ప్రక్రియను నియమ నిబంధనల ప్రకారం అనుసరించి చేయాలని చెప్పారు.ప్రిసైడింగ్ అధికారుల డైరీని జాగ్రత్తగా రాయాలని,రెండు కాపీలు సిద్ధం చేసుకోవాలని,బ్యాలెట్ పేపర్ ఎకౌంటు చెక్ చేసుకోవడంతో పాటు,ఓటర్లు బ్యాలెట్ పేపర్ తీసుకున్న తర్వాత తప్పనిసరిగా బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్నది లేనిది గమనించేందుకు ఒక ఏపీఓను నియమించాలని,పోలింగ్ కేంద్రంలోకి 5గురు ఓటర్లను మించి అనుమతించవద్దని,అంధులైన ఓటర్లకు సంబంధించి అనుమతించే సహాయకులు తప్పనిసరిగా 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని,ఓటింగ్ కంపార్ట్మెంట్లో ఓటు వేసేందుకు ఇచ్చే మార్క్ తప్ప ఇతర ఏ వస్తువులు ఉండకూడదని తెలిపారు. రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్ టి సంచాలకులు జి. రమేష్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,గృహనిర్మాణ శాఖ పిడి రాజకుమార్,డిఈఓ బిక్షపతి,మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం




దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ మండలంలోని కట్టకొమ్ముతండా గ్రామ పంచాయతీ ఎంజిఎన్ ఆర్ఈజిఎస్ నిధులు రూ. 10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండునాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళా సాధికారతకు వారి స్వయం ఉపాధి, సముహా బలోపేతానికి ఈ భవనం ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎంతటి భారానైనా మోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రాంసింగ్, సర్పంచ్ జ్యోతి పాండు, కవిత లచ్చిరాం, లక్ష్మి గోవింద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించండి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/చిట్యాల:** పట్టణ అభివృద్ధి కొరకు మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్‌కు అప్పగించాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. పట్టణ అభివృద్ధికి శాసనసభ్యునిగా తన వంతు కృషి చేస్తున్నానని, భవిష్యత్తులో కూడా పట్టణాన్ని అగ్రభాగంలో ఉంచడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదిస్తే పరిష్కరిస్తానని వీరేశం అన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాసులు, జడల చినమల్లయ్య, షేక్ ఇబ్రహీం ఉన్నారు.

## భూ అక్రమాలకు తావు లేకుండా భూభారతి సర్వే



**ప్రజాపక్షం/అర్వపల్లి :** పక్కాగా భూమి యొక్క నక్ష మ్యాప్ హద్దుల నిర్ణయం, పటిష్ఠంగా భూరికార్డులు, భూమి ఆక్రమణలకు తావులేకుండా భూభారతి భూ రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని సూర్యాపేట జిల్లా ఆర్ డిఓ వేణుమాధవ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో భూభారతి చట్టం భూముల రీ సర్వే కార్యక్రమం కోసం పైలెట్ గ్రామ పంచాయతీగా జాజిరెడ్డిగూడెం ఎంపిక అయిన సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యలు పరిష్కారం అవుతుందని తెలిపారు. భూభారతి సర్వే ముఖ్య ఉద్దేశ్యం రైతులకు పక్కాగా భూమి హద్దులు, భూమి యొక్క నక్ష మ్యాప్‌లో నిర్ణయం, పటిష్టమైన భూ రికార్డులు తయారు చేయడమేనన్నారు. ప్రతి కమతానికి రీ సర్వే చేసి రైతులకు భూతా గాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి శ్రీకాంత్, గ్రామ సర్పంచులు చిల్లంచర్ల విద్యాసాగర్, వివిధ శాఖల అధికారులు బింగి కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, హరి స్వరూపు, వెంకటేష్, జలంధర్, వెంకట్‌రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి బాధాకరం

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కోదాడలో జరిగిన కర్ల రాజేష్ లాకప్ డెత్‌లో ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి చాలా బాధాకరమని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎంఆర్‌పిఎస్, మాదిగ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మానవహార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా మాట్లాడారు. దమ్ముంటే కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే భవిష్యత్తులో తగిన రాజకీయ మూల్యం చెల్లించకతప్పదని మండిపడ్డారు. లాకప్ డెత్‌లో నింధితుడైన ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కాపాడుతూ జిల్లా ఎస్పి అనేక పొరపాటు చేస్తున్నారని, నేరస్తులను కాపాడే జిల్లా ఎస్పిపై అట్రాసిటి కేసు నమోదు చేసి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి నాగరాజు మాదిగ, ఇంజం వెంకట్ స్వామి మాదిగ, బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, రాజన్న మాదిగ, చింతలపాటి చిన్నశ్రీ రాములు మాదిగ, బొజ్జ సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బ్యాలెట్ బాక్స్‌ల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రమైన అవంతీపురం మార్కెట్ గోదాములను సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్‌అమిత్, డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అవసరమున్న చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకన్న, సీఐలు ప్రసాద్, నాగభూషణరావు, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన స్క్రూటీని..

ఐదు మున్సిపాలిటీలలో 1617 నామినేషన్లలో 5 తిరస్కరణ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల స్క్రూటీని శనివారం ముగిసింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటిల పరిధిలో మొత్తం 1617 నామినేషన్లు దాఖలు కాగా 5 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మున్సిపాలిటిలో 512 మంది అభ్యర్థులు 741 నామినేషన్లు దాఖలు చేయగా పత్రాలు సరిగ్గా లేకపోవడంతో 4 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 32వ వార్డు నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేసిన ధరావత్ వేణు ఓటు హక్కు లేనికారణంగా అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. దీంతో మొత్తం 5 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు అధికారులు ప్రకటించారు. కోదాడ మున్సిపాలిటిలో 256 మంది 333 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాలేదు. అలాగే హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో 238 మంది 293 నామినేషన్లు దాఖలు చేయగా అన్ని ఒకే అయ్యాయి. తిరుమలగిరి మున్సిపాలిటిలో 106 మంది అభ్యర్థులు 160 నామినేషన్లు దాఖలు చేయగా ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాలేదు. నేరేడుచర్ల మున్సిపాలిటిలో 82 మంది 90 నామినేషన్లు దాఖలు చేయగా అన్ని ఒకే అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మిగిలింది అభ్యంతరాల స్వీకరణ, నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా విడుదలే మిగిలింది. ఈ ప్రక్రియ మొత్తం ఫిబ్రవరి 3తో ముగియనుంది.

## మిర్యాలగూడలో నామినేషన్లు 505

తిరస్కరణకు గురైనవి రెండే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నామినేషన్ల పరిశీలనలో రెండు తిరస్కరణకు గురైనట్లు కమీషనర్ గణవేని శ్రీనివాస్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 48 వార్డులకుగాను 325 మంది అభ్యర్థులు 507 నామినేషన్లు సమర్పించగా అందులో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి అంశాలపై దృష్టి సారించామన్నారు. కాగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అధికారులు వెంకన్న, కోటయ్య, అంజయ్య, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలు

మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జిఎస్ పాండాదాస్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జిఎస్ పాండాదాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ విసి హాల్‌నందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లతో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రీకౌంటింగ్ అవసరమైనప్పుడు ఏవిధంగా అనుసరించాలో రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలని చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు, ఓటర్లను చైతన్యపరుచుటకు గాను ఓటు ఏ విధంగా వేయాలో అవగాహన వీడియోలు తయారుచేసి లోకల్‌కేబుల్ ఛానల్‌లో ప్రసారం చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలింగ్ రోజున ఓటింగ్ కంపార్టుమెంట్‌లలో వెలుతురు, లైటింగ్ స్పష్టంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమీషనర్లు హనుమంత్ రెడ్డి, రమాదేవి, డి శ్రీనివాస్, సిహెచ్ నాగరాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.



## త్రికూటలయాన్ని పరిరక్షించాలి

పురావస్తు పరిశోధకుడు సిఇఒ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రారం శివారులో నిర్లక్ష్యానికి గురై రోజురోజుకు శిధిలమవుతున్న కాకతీయుల త్రికూటలయాన్ని పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన మునగాల వెంకట్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు శనివారం శిధిల శివాలయాన్ని సందర్శించారు. ఈ ఆలయం మూడు గర్భాలయాలు, అర్థమండపాలు, ఒక రంగ మండపంతో తూర్పు వైపున ప్రధాన ద్వారంతో ఉండేదని, 13వ శతాబ్ధిలో కాకతీయ గణపతి దేవుని కాలంలో నిర్మించబడిన త్రికూట ఆలయం ఆలనాపాలన లేక ప్రధానాలయం తప్ప మిగతా రెండు ఆలయాలు కూలిపోయాయని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు సహకరిస్తే చుట్టు పడి ఉన్న ఆలయరాళ్లను పేర్చి పునర్మినిర్మించుకోని కాకతీయ త్రికూటలయానికి పూర్వ వైభవం తీసుకురావచ్చని, అందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరు పూనుకోవాలని, 800 సంవత్సరాల కళాఖండాన్ని కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలని ఆయన గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాకునూరు శ్రీనివాస్, మునగాల మట్టారెడ్డి, నామిరెడ్డి చంద్రారెడ్డి, బొడ్డు మల్లయ్య యాదవ్, పాతకోటి భిక్షం, చిట్యాల వెంకటేష్, గోవర్ధన్, మట్టపల్లి బంగారు, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపడతాం

ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ప్రభుత్వ సంస్థలను పరిశీలన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై జిల్లా కలెక్టర్,బి చంద్రశేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌లు శనివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ సంస్థలను పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న సెట్విన్ స్కిల్ సెంటర్ ను అలాగే తేలకంటి గూడెం దగ్గర ఉన్న రామనంద తీర్థ కళాశాల,గురుకుల బాలికల విద్యాలయం సెంటర్లను పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహణకు అనుకూలత, హాళ్ల సౌకర్యాలు,భద్రతా ఏర్పాట్లు,ప్రవేశనిష్క్రమణ మార్గాలు, విద్యుత్ సరఫరా,తదితర అంశాలను అన్నిటినీ దృష్టిలో ఉంచుకొని భవనాలను పరిశీలించారు.అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం తగిన స్థలాన్ని నిర్ణయిస్తామని జిల్లా కలెక్టర్, ఎస్పిలు తెలిపారు.మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపడతామని స్పష్టం చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం,చిట్యాల,చండూర్,దేవరకొండ మున్సిపల్ కమిషనర్లు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## బట్టీల్లో మగ్గుతున్న బాల్యం

పలుకలకు బదులు ఇటుకలు

వసివాడుతున్న బాల్యం

పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బాల కార్మిక వ్యవస్థ నియంత్రించేందుకు ఇన్ని చట్టాలు తీసుకువచ్చినా వారి బ్రతుకులు మాత్రం మారడం లేదు. మండలంలోని కాజీపేట, చీకటిమామిడి, ప్యారారం, కంచల తండా, తిమ్మాపురం, పర్వతాపురంతో పాటు మండల కేంద్రంలో సుమారు 100 ఇటుక బట్టిలు ఉంటాయి. దీంట్లో పనిచేస్తున్న ఓడిశా కార్మికుల పిల్లలు కూడా బట్టీల్లో పనిచేస్తున్నారు. పొట్టకూటికోసం వచ్చిన వారు తమ పిల్లలను కూడా పనిలో పెడుతున్నారు. వారికి తక్కువ వేతనాలు ఇస్తూ యజమానులు దండిగా బాల కార్మికులపై సంపాదిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా బాల కార్మిక వ్యవస్థ నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలు తప్ప ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ దివాళాకోరుతనమే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కెసిఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ ద్వారా నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరుతనమేనని మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఇది కేవలం సిఎం రేవంత్ రెడ్డి రాక్షసానందానికి నిదర్శనమని విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో ఫిర్యాదుదారులు లేరని, నష్టపోయిన వారు లేరని అన్నారు. ఎఫ్ఐఆర్ లేకుండానే విచారణ చేపట్టడం పనికిమాలిన చర్య అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిజెపిలు రెండు ఏకమై బిఆర్ఎస్‌ను ఎదుర్కోలేక మాజీ సిఎం కెసిఆర్ పై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై వస్తున్న ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకే ఈ విచారణ డ్రామా తెరమీదికి తెచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ స్కీమ్‌ల ప్రభుత్వం కాదని స్కామ్‌ల ప్రభుత్వమని అన్నారు. వాళ్ళ తప్పులను కప్పిపుచుకునేందుకే ఈ నోటీసుల డ్రామా అని కొట్టిపారేశారు. అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీలో కలిసినట్లే మాట్లాడుతున్నారని ఆత్మాభిమానం చంపుకొని కొంత మంది అధికారులు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. 65 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఎక్కడ కోరితే అక్కడికి వెళ్ళి విచారణ చేయాలనే చట్టంలో స్పష్టంగా ఉందని కెసిఆర్ విషయంలో సిట్ అధికారులు దానిని గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డిజిపి, సిపి, సిట్ అధికారులు ఎవరి ఒత్తిళ్ళకు లొంగి పనిచేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడికి నోటీసులు ఎప్పుడు ఇవ్వాలన్నది అధికారులకు తెలియదా అని నిలదీశారు. చట్టంపై కెసిఆర్‌కు అపారమైన గౌరవం ఉందని సిట్‌కు సహకరిస్తారని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యులు, సూర్యాపేట పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ట్రైకార్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రామచందర్ నాయక్, మాజీ జడ్పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, పెన్‌పహాడ్ మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, సూర్యాపేట మాజీ జడ్పిటిసి జీడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయండి : అడిషనల్ ఎస్పి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా యాదాద్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మి నారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని కారు మోటార్ వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. ప్రయాణం చేసేటప్పుడు ఎడమవైపు నుండి ఓవర్టేక్ చేయొద్దని కుడిపి నుండి వెళ్లాలని ఓవర్టేక్ చేసి ప్రమాదాలు గురి కావద్దని రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రయాణం చేయాలని కోరారు. యాదాద్రి టోల్ ప్లాజా జిఎం చంద్రమోహన్ మాట్లాడుతూ ఇంటిలో నుంచి తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములు ప్రయాణించేటప్పుడు పిల్లలు చిరునవ్వుతో డాడీ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయండి అని కోరాలని సురక్షితంగా ప్రయాణం చేసినప్పుడే కుటుంబము క్షేమంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రయాణికులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో లిటిల్ బర్డ్స్ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ డిఎస్పి ప్రభాకర్ రెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారి సాయి కృష్ణ, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ కీర్తి భరద్వాజ్, ట్రాఫిక్ సిఐ మధుసూదన్, ఎస్ఐలు లక్ష్మణ్, అమర్ సింగ్, టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరరావు, ట్రాఫిక్ అధికారి రవి, టీం లీడర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మల సేవలో పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో కొలువైన సమ్మక్క సారలమ్మలను శనివారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రెండేండ్లకు ఒకసారి జరిగే సమ్మక్క సారలమ్మ జాతర గత నాలుగు రోజులుగా సాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మలు ప్రజలను చల్లగా చూడాలని కోరారు. రైతులకు పాడిపంట సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ సొంటి ఆంజనేయులు, ఆలయ చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మామిడి వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

"హీరో శివాజీ, హీరోయిన్ లయ జంటగా నటిస్తున్న చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 12న డైరెక్ట్ ఈటీవి విన్ ఒటిటి వేదికగా ఈ సందర్భంగా మేకర్స్ డేట్ , సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు."

రీల్



## 'మై సౌతి దివ' క్యాలెండర్ ఆవిష్కరించిన తారలు

దక్షిణ భారతదేశంలోని ప్రముఖ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్, లైఫ్‌స్టైల్ ప్లాట్‌ఫామ్ మైసౌతిదివ ఎంతో ప్రతిష్టాత్మకమైన 9వ ఎడిషన్ 2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించింది. మీడియా9, భారతి సిమెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఫిల్మ్ నగర్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ ప్రత్యేక క్యాలెండర్‌లో దక్షిణాది సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటీమణులు శ్రియా శరణ్, అనన్య నాగళ్ల, రియా సచ్ దేవా, ఉల్క గుప్తా, పాలక్ అగర్వాల్, మనస్వి మంగై, చాందినీ కటారియా, సాక్షి మ్యాడ్లోల్కర్, సిమ్రత్ కౌర్, గెహ్నా సిప్పీ, రియా సుమన్, ఐశ్వర్య సాల్వి తదితరులు 12 నెలలకు గాను 12 మంది నటీమణులను ప్రచురించారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ నటీమణులు గెహ్నా సిప్పీ, రియా సచ్ దేవా, ఐశ్వర్య సాల్వి, ఉల్క గుప్తా, భారతి సిమెంట్స్ డీఎం రవీంద్ర రెడ్డి, సినీ నిర్మాతలు రమేష్ పుప్పాల, శ్యాంసుందర్ నేతి, మీడియా9 డైరెక్టర్ మనోజ్ కుమార్ హాజరయ్యారు.

## 'స్కై' ఫీల్ గుడ్ లవ్ స్టోరీ

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు.



'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'స్కై' సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను ప్రముఖ దర్శక నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ సినిమా ఇండస్ట్రీ మీద ప్యాషన్ తో చిన్న స్థాయి నుంచి మ్యూజిక్ డైరెక్టర్ గా ఎదిగాను. ఈ చిత్రానికి వర్క్ చేసే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల కి థ్యాంక్స్. ఆయన ఇచ్చిన సపోర్ట్ వల్లే ఈ సినిమాకు మంచి మ్యూజిక్ చేయగలిగాను. పాటలకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. అన్నారు.నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్ కు వచ్చే ముందు 'స్కై' సినిమా కంటెంట్, సాంగ్స్ చూశాను. ఆ కంటెంట్ చూస్తుంటే ఈ మూవీలో ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీ చూడబోతున్నామని తెలుస్తోంది. సాంగ్స్ చాలా బాగున్నాయి. రసూల్ ఎల్లోర్ విజువల్స్ బ్యూటిఫుల్ గా ఉన్నాయి. ఈ సినిమాకు పెట్టిన క్యాప్షన్ తోనే మూవీ ఎస్సెన్స్ తెలుస్తోంది. 'స్కై' సినిమా మంచి సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు.ప్రొడ్యూసర్ నాగిరెడ్డి గుంటక మాట్లాడుతూ - 'స్కై' సినిమాను మేమంతా ఎంతో ఇష్టపడి ప్రొడ్యూస్ చేశాం. టీమ్ అందరం ప్యాషనేట్ గా వర్క్ చేశాం. హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఉన్న ఒక కొత్త ప్రేమ కథను మా మూవీలో మీరంతా చూడబోతున్నారు. ఫిబ్రవరి 6న సినిమాను రిలీజ్ చేస్తున్నాం. అన్నారు.డైరెక్టర్ పృథ్వీ పెరిచెర్ల మాట్లాడుతూ - 'స్కై' సినిమా షూటింగ్ కు ముందే అన్ని సాంగ్స్ రెడీ చేసి పెట్టుకున్నాం. డీవోపీ రసూల్ ఇచ్చిన సజెషన్స్ తో సినిమాను అనుకున్న టైమ్ లో కంఫర్ట్ గా కంప్లీట్ చేయగలిగాం. ఆయన గైడెన్స్ మాకు చాలా ఉపయోగపడింది అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో మురళీ కృష్ణంరాజు, నటి కేవెల్ కే మణి బామ్మ, హీరోయిన్ శృతి శెట్టి, డీవోపీ రసూల్ ఎల్లోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ సంక్రాంతి ఏడు తరాలు గుర్తుండిపోద్ది



భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియో లో విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాత, టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు, ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇంతటి అద్భుతమైన చిత్రంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఈ వేడుకలో జ్ఞాపికలను అందజేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణులతో పాటు పంపిణీదారులకు జ్ఞాపికలను అందించడం జరిగింది.ప్రముఖ నిర్మాత, టిఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ గత సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో, ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'తో విజయాలు అందుకున్న మీనాక్షికి కంగ్రాట్స్. ఈ సినిమాలో నవీన్ వన్ మ్యాన్ షో చేశాడు. విడుదలకు ముందు రోజు ఈ సినిమా చూసినప్పుడే, ఈ చిత్రం ఘన విజయం సాధిస్తుందని నమ్మకం కలిగింది.. ఈ సినిమా ఇంతటి విజయం సాధించడానికి ప్రధాన కారణం నవీన్ అని ప్రతి ఒక్కరూ చెప్పడం సంతోషంగా ఉంది. సినిమా కోసం నవీన్ ప్రాణం పెడతాడు. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని చెప్పడానికి ఉదాహరణ ఈ అనగనగా ఒక రాజు.' అన్నారు.ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ.. 'టీమ్ బాగుంటే హీరో అవుతారు అంటుంటారు. కానీ టైమింగ్ బాగుంటే హీరో అయినవాడు నవీన్ పొలిశెట్టి. ఏదైనా క్రెడిట్ ఉంటే నవీన్ కే. పెద్ద యాక్సిడెంట్ అయ్యి, తీవ్ర గాయాలయ్యాయి. అప్పుడు కూడా నాతో మాట్లాడుతూ.. నాకు మంచి రచయితలు కావాలి, బ్లాక్ బస్టర్ కొట్టాలి అని అంటున్నాడు. సినిమా అంటే అంత తపన తనకు. తన టీంతో కలిసి మంచి కథను రాసుకొని, ఇలాంటి విజయం సాధించడం అంటే మామూలు విషయం కాదు. సినిమా చూస్తున్నప్పుడు నాకు అనిపించింది. ఒక్క ఫ్రేమ్ లో కూడా నవీన్ ఎనర్జీ వదల్లేదు. ఆ ఎనర్జీ వెనుక తన కష్టం, కసి ఉన్నాయి అని అన్నారు.నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. 'మా సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. దిల్ రాజు గారి పెళ్లి ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోద్ది. అలాగే ఈ సంక్రాంతి మా అందరికీ ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు గుర్తుండిపోతుంది. తెలుగు సినీ చరిత్రలోనే ఇది అరుదైన సంక్రాంతి. పెద్ద సినిమాలతో పాటు విడుదలై, మీ సినిమా నిలబడుతుందా అని ఎందరో సందేహం వ్యక్తం చేశారు. ఇంతటి పోటీలో కూడా మా సినిమా నిలబడి, ఘన విజయం సాధించిందంటే దానికి కారణం తెలుగు ప్రేక్షకులే. మీకు ఎంత కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువే అని చెప్పారు. కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. 'నాకు ఈ సంక్రాంతి మరింత ప్రత్యేకంగా మారింది. ప్రేక్షకులు మాపై ప్రేమను ఇలాగే కురిపించాలని కోరుకుంటున్నాను. మాకు ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులను, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు.' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ,దర్శకుడు మారి, రచయిత్రి చిన్మయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.



డైరెక్టర్ వి.సముద్ర చేతుల మీదుగా

## '1+1 ఆఫర్' సినిమా ట్రైలర్ లాంచ్

నిమ్మల శ్రీరామ్, మౌనిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా '1+1 ఆఫర్'. ఈ చిత్రంలో రాజేష్ భూపతి, రోహిత్, బాలాజీ, సురేష్ కుమార్ యాదవ్, జీవన్, రామ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు .ఈ చిత్రాన్ని త్రివేణి పిక్చర్స్ బ్యానర్ పై వి.వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు .ఏఎస్ఆర్ (శ్రీరామ్) దర్శకత్వం వహించారు. సరికొత్త కథా కథనాలతో కంటెంట్ ఓరియెంటెడ్ మూవీగా రూపొందిన '1+1 ఆఫర్' సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో దర్శకుడు వి. సముద్ర, నటుడు 30 ఇయర్స్ పృథ్వీ చేతుల మీదుగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విలన్ రాజేష్ మాట్లాడుతూ '1+1 ఆఫర్' చిత్ర ట్రైలర్ లాంఛ్ చేసేందుకు వచ్చిన సముద్ర కి, పృథ్వీ కి థ్యాంక్స్. ఒక కొత్త కాన్సెప్ట్ తో ఈ సినిమాను రూపొందించారు మా డైరెక్టర్ శ్రీరామ్. కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఎంజాయ్ చేస్తూనే ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులు ఈ సినిమాలో చూడబోతున్నారు. అన్నారు.హీరోయిన్ మౌనిక మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. ఈ చిత్రంలో నటిగా నా పర్ఫార్మెన్స్ కు పేరొస్తుందని నమ్ముతున్నాను అన్నారు.దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ '1+1 ఆఫర్' ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమాతో వన్ ప్లస్ హండ్రెడ్ అనేలా దర్శకుడు శ్రీరామ్ వంద సినిమాలు చేయాలి. విలన్ రాజేష్ ను చూస్తుంటే మన విలన్ అజయ్ లా కనిపిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ అందరికీ నచ్చేలా సినిమా చేసినట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. కంటెంట్ ఉంటే చిన్న సినిమాలను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఈ సినిమాను కూడా ప్రేక్షకులు సక్సెస్ చేస్తారు. అన్నారు.ఈ కార్యక్రమంలో దర్శకుడు ఏఎస్ఆర్( శ్రీరామ్), నిర్మాత వేణు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## 'అమరావతికి ఆహ్వానం' అంటున్న ఎస్తేర్



శివ కంఠమనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రిత, హరీష్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సినిమా 'అమరావతికి ఆహ్వానం'. ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ ఇతర కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి గారి నిర్మాణ సారథ్యంలో జి. రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేన్న కేఎస్ శంకరావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ సినిమాను నిర్మించారు. హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ ను ప్రఖ్యాత నిర్మాత నటులు మురళీ మోహన్ గారు రిలీజ్ చేశారు. 'అమరావతికి ఆహ్వానం' సినిమా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోప్రముఖ నటులు నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ 'అమరావతికి ఆహ్వానం' సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ మూవీ కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది. ఈ నిర్మాతలు గతంలో కూడా చిన్న బడ్జెట్ లో మంచి చిత్రాలు చేశారు. మా గురువు గారు దాసరి గారు చెప్పినట్లు చిన్న చిత్రాలే ఇండస్ట్రీకి ప్రాణం. కొత్త దర్శకుడిగైనా జీవీకే ప్రతిభావంతంగా సినిమాను చక్కగా తెరకెక్కించారు. టీజర్ తోనే భయం కలిగించారని అన్నారు.ప్రొడ్యూసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ''మాకు సినిమా ఇండస్ట్రీతో 30 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. సినిమాలు చేయాలంటే డబ్బులు కావాలని రియల్ ఎస్టేట్ మార్గాన్ని ఎంచుకున్నాం.



## తెలుగు, తమిళంలో 'కపుల్ ఫ్రెండ్లీ'

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.ఈ సినిమాను ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ధీరజ్ మొగిలినేని 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను కూడా తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, 'నాలో నేను..', 'గాబరా గాబరా..' లిరికల్ సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ లభించింది.

## కాల్పులు (మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. కాల్పుల్లో వ్యాపారి కాలుకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోధ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాల్పులకు తెగబడిన అంగతకులు బాధితుడి ద్విచక్ర వాహనంపైనే పరారయ్యారు. విషయం తెలియగానే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనరేట్లను అప్రమత్తం చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లిలోని జనతా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న కేరళ వాసి అబ్దుల్ రషీద్ (26) స్థానికంగా రెడిమెంట్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ప్రతిసారి మాదిరిగానే శనివారం ఉదయం 7 గంటలకు తన ద్విచక్ర వాహనంపై కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఎటిఎం సెంటర్‌లో డబ్బులు జమ చేసేందుకు వెళ్లాడు. అదే సమయంలో వెనకాల నుంచి వచ్చిన ఇద్దరు అంగతకులు అతన్ని కొట్టి క్యాష్ బ్యాగ్‌ను లాక్కునేందుకు విఫలయత్నం చేశారు. దీంతో అంగతకులు వ్యాపారిపై కాల్పులు జరిపి రూ.6 లక్షల నగదు కలిగిన బ్యాగ్‌ను లాక్కుని, బాధితుడి ద్విచక్ర వాహనం (టిఎస్08హెచ్‌ఎన్ 8582) పై అక్కడి నుంచి పారిపోయారు. కాలికి బుల్లెట్ గాయమైన సదరు వ్యాపారిని చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రికి పోలీసులు తరలించారు. సమాచారం అందుకున్న ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి ఘటనా స్థలానికి చేరుకుని ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఘటనపై కేసు నమోదు చేశాసిన పోలీసలు అగంతకులను పట్టుకునేందుకు ఐదు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. దీంతో పాటు చుట్టుపక్కల జిల్లాల పోలీసులను అప్రమత్తం చేశారు. దుండగులు చాదర్‌ఘాట్ సిగ్నల్ మీదుగా కాచిగూడ నింబోలియడ్డ ప్రాంతానికి చేరుకుని అక్కడ వాహనాన్ని వదిలేసి, దుస్తులు మార్చుకుని కాచిగూడ ఎక్స్ రోడ్స్ వైపు కాలినడకన పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అనుమానాస్పద సమాచారం ఉన్నవారు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు కమిషన్ విసి సజ్జనార్ తెలిపారు.

## ఆర్టీఐ చట్టాన్ని నీరుగార్చొద్దు

### ప్రధాని మోదీకి ఎంపి సందోశ్ కుమార్ లేఖ



**న్యూఢిల్లీ:** సమాచార హక్కు చట్టం 2005 గురించి ఆర్థిక సర్వే 2025–26 వైఖరిని సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. యూపీఏ1 హయాంలో వామపక్షాల నిర్ణయాత్మక మద్దతులో ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. వ్యవస్థాగత పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధ జవాబుదారీతనానికి హామీనిచ్చే విధంగా చారిత్రక చట్టం తెచ్చినట్లు వెల్లడించింది. పౌరులను సాధికారులుగా చేయడం, అవినీతిని అంతమొందించడమే కాకుండా పరిపాలనా వ్యవహారాలపై ప్రజా పరిశీలనకు అవకాశం కల్పిస్తూ రాజకీయ స్పృహతో 'ఆర్టీఐ' ఆచరణలోకి వచ్చిందని తెలిపారు. దీనిని నీరుగార్చే ఏ రకమైన ప్రయత్నం జరిగినా అది రాజ్యాంగబద్ధ పరిపాలనా స్ఫూర్తిపై ప్రత్యక్ష దాడే అవుతుందని సందోశ్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీఐ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నీరుగార్చవద్దని కోరుతూ ఆయన శనివారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. ఆర్టీఐ చట్టాన్ని పున:పరిశీలించాలన్న సిఫార్సును సంతోశ్‌కుమార్ తప్పుపట్టారు. ఆర్థిక సర్వే సిఫార్సుతో పరిపాలన సామర్థ్యం ముసుగులో తప్పును సమర్థించే... అవినీతిని చట్టబద్ధం చేసే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. దశాబ్ద కాలంలో ఆర్టీఐ కార్యాచరణ సంస్థాగతంగా బలహీనమైందన్నారు. 2019లో జరిగిన సవరణలతో సమాచార కమిషన్ల స్వయంప్రతిపత్తి దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. సమాచార కమిషనర్ల పదవీ కాలం, సర్వీస్ షరతులపై కేంద్రమే నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో జర్నలిస్టులు, ఆర్టీఐ కార్యకర్తలు, విజిల్ బ్లోయర్లు అవమానాలు, బెదిరింపులను, దాడులను ఎదుర్కొంటున్నారని, అవినీతిఅక్రమాల గుట్టు రట్టు చేసేవారికి సముచిత భద్రతే లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సర్వే అనుచరిస్తున్న పద్ధతి విద్యాపరమైనది కాకుండా రాజకీయ పరిణామాలకు దారితీసేదిగా ఉన్నట్లు సందోశ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆర్టీఐ చట్టాన్ని మరింత నీరుగారిస్తే విపత్తుకరంగా పరిణమిస్తుందని... ప్రజాస్వామ్యబద్ధ జవాబుదారీతనం ఉండదని, ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతారని హెచ్చరించారు. ఆర్థిక సర్వే నుంచి ఆర్టీఐకు సంబంధించిన అంశాలను తొలగించాలని, ఈ వైఖరిని మార్చుకోవాలని ప్రధాని మోదీని తన లేఖలో సందోశ్ కుమార్ కోరారు. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల సమాచార హక్కు విషయంలో తమ నిబద్ధతను సర్కారు స్పష్టం చేయడం ఎంతైనా అవసరమని సూచించారు.

**పీటీ ఉషకు పరామర్శ:** రాజ్యసభ ఎంపి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, ప్రముఖ క్రీడాకారిణి పీటీ ఉష భర్త వి.శ్రీనివాసన్ శుక్రవారం మరణించారు. దీంతో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ శనివారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

## కళను ఉద్యమంగా మార్చిన మహానుభావుడు

### గద్దర్ జయంతి ఉత్సవాల్లో వక్తలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళను ఉద్యమంగా మార్చిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గద్దర్ పాటలు వినోదం కోసం కాదు, చైతన్యం కోసమని, అవి ప్రజలను ఆలోచింపజేయడంతో పాటు పోరాటాలకు ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ 78వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు గద్దర్ వెన్నెల, ఎనుగు నర్సింహారెడ్డి, జె.బి.రాజ్, శాంతాసిన్హా, ప్రొఫెసర్ కాసీం, జయరాజ్, సూర్యం, ఏపూరి సోమన్న, పృథ్వీరాజ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గద్దర్ చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గద్దర్ జయంతి పురస్కరించుకొని ఆయన రచించిన 'సిరిమల్లె' అనే పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ ప్రజల గుండెల్లో నివసించిన నాయకుడు అని, ఆయన మాట కాదు పాట అని, ఆయుధం కాదు గానమనీ, పీడితుల బాధను తన స్వరంగా మార్చి సమాజాన్ని కదిలించిన విప్లవ కవి అని కొనియాడారు. సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే.నారాయణ మాట్లాడుతూ అణచివేతకు ఎదురు నిలిచిన ధైర్యవంతుడు గద్దర్ అని, భయాన్ని జయించి, అన్యాయాన్ని ప్రశ్నించడంతో పాటు ప్రజల పక్షాన నిలిచిన అసలైన ప్రజా యోధుడు అని చెప్పారు. ఎంఎల్‌సి, ప్రొఫెసర్ కొదండరాం మాట్లాడుతూ తన జీవితం మొత్తం ప్రజల కోసమే అర్పించిన నాయకుడు గద్దర్, ఆయన జీవితం ఒక సందేశం, ప్రజలే శక్తి, ప్రజలే చరిత్ర అని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. గద్దర్ కుమారుడు సూర్యం మాట్లాడుతూ గద్దర్ కల్చరల్ అండ్ మెమోరియల్ సెంటర్ కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని, తదుపరి భూమి కేటాయిస్తే నిర్మాణాన్ని చేపడతామని కోరారు. గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ గద్దర్ అనగానే ప్రజల గుండెల్లో ఒక ధైర్యం వస్తుందని, ప్రాణత్యాగం చేసే తెగింపు వస్తుందని చెప్పారు. ఎప్పటివరకు అయితే అణచివేత, దోపిడీ ఉంటుందో అప్పటివరకు గద్దరన్న పాట యుద్ధం చేస్తూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారులు ఆలపించిన గద్దర్ గేయాలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది.

## పత్రాలు విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**

పడ్డారని ఎప్‌స్టీన్ తన పత్రాల ఆధారాలలో ఆరోపించాడు. ఈ పత్రాలు బహిర్గతమైన తర్వాత బిల్‌గేట్స్ స్పందిస్తూ ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. ట్రంప్, బిల్‌గేట్స్‌సహా అనేకమంది ప్రముఖులపై లైంగిక ఆరోపణలు ఇందులో ఉన్నాయి. కాగా ఈ ఫైల్స్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు అనేక వందల సార్లు ప్రస్తావనకు వచ్చింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ దాచిపెట్టిన 30,00,000పత్రాలు, 1,80,000ఫొటోలు, 2,0000 వీడియోలు, ఫొటోలను బాహాటంగా విడుదల చేశారు. అమెరికా న్యాయవిభాగం విడుదల చేసింది. ఐతే ఈ వ్యవహారం ఇంతటితో ముగిసిందా? ఇక పూర్తిగా అన్ని పత్రాలూ, రహస్యాలూ బయట పడినట్టేనా? అనే విషయంపై ప్రజల్లో చాలా ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. ఎంతోమంది పెద్దలకు అభ్యంతరకరమైన అశ్లీల చిత్రాలు కూడా ఇందులో విడుదలయ్యాయి. అమెరికాలో పెద్దలకు సంబంధించిన ఈ–మెయిల్స్ కూడా అందులో ఉన్నాయి. ఇందులో చాలా ఈ–మెయిల్స్, పత్రాలన్నీ పది సంవత్సరాల క్రితం నాటివి. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాలన్నీ ప్రజలకు తెలియాలనీ, వాటిని బహిరంగంగా విడుదల చేయాలని డోనాల్డ్ ట్రంప్ ఒక ఫైలుపై సంతకం చేశారు. ఆయన విధించిన ఆరువారాల గడువుతేదీ దాటిపోయిన తర్వాత జస్టిస్ విభాగం వీటిని విడుదల చేసింది. ఈ విధంగా జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్య పత్రాల విడుదల బాహాటత్వాన్ని, ప్రజలకు ప్రభుత్వ జవాబుదారీతనాన్ని తెలియజేస్తుందని డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచే వ్యాఖ్యానించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఎంతకాలం జైలులో ఉన్నాడు? అతడి మానసిక పరిస్థితి ఏమిటి? అతడి మరణం, అందుకు దారితీసిన పరిస్థితులు వంటి నివేదికలను కూడా వీటితోపాటు కలిపే విడుదల చేశారు. ఎప్‌స్టీన్ సహచరుడు గిస్లెన్ మాక్సెల్వ్ కూడా జైలుపాలయ్యాడు. అతడు బాలికలను అక్రమ రవాణా చేశారు. ఎప్‌స్టీన్ ప్రాసిక్యూటర్లతో వివాదాస్పదమైన ఒప్పందాలకు వచ్చిన తర్వాత 14 ఏళ్ళ మైనరు బాలికతో లైంగిక అనుభవాన్ని కోరుకున్నాడన్న ఆరోపణపై అరెస్టుకు గురయ్యాడు. తర్వాత అతడి జాతకం మొత్తం బయటకు వచ్చింది. అమెరికాలో అనేకమంది పెద్దలతో సంబంధాలు పెట్టుకుని వారి అవసరాలకోసం మహిళలను సరఫరా చేసి ఆ చర్యలను వీడియోలు, ఫొటోలు తీసి ఎప్‌స్టీన్ ఆ జాతకాలను తనవద్ద సాక్ష్యాలుగా దాచిపెట్టుకున్నాడు. అవన్నీ ఈనాడు బయటకు వచ్చాయి. అందమైన రష్యా భామలతో గడపాలని కోరుతూ బ్రిటన్ యువరాజు (బహుశా ఆండ్రూ మౌంట్‌బాటన్ విండ్సన్) ను కూడా ఎప్‌స్టీన్ ఆహ్వానించాడని ఈ పత్రాలలో సమాచారం ఉంది. లార్డ్ పీటర్ మాండెల్సన్ భర్త అవిలా డసిల్వాకు 10 వేల పౌండ్లు ఎప్‌స్టీన్ పంపినట్లు సమాచారం ఉంది.

## రేపు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి ప్రదానం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొని జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి అవార్డును ప్రదానం చేస్తారని వారు వివరించారు. ఈ సందర్భంగా "భారత రాజ్యాంగం భావప్రకటన స్వేచ్ఛ" అనే అంశంపై స్మారకోపన్యాసం జస్టిస్ సుదర్శన్ రెడ్డి చేస్తారని తెలిపారు. సిపిఐ రాష్ట్రకార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు అవార్డుకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం భుక్తి కోసమే కాకుండా 200 ఏళ్లకు పైగా సాగిన నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు సాగిన మహోత్తర పోరాటమని తెలిపారు. ఈ పోరాటం ఫలితగానే హైదరాబాద్ సంస్థానం భారత్‌దేశంలో విలీనమైందన్నారు. ఆనాటి పోరాట యోధుల త్యాగాలను భావి తరాలకు అందించడమే లక్ష్యంగా రావి నారాయణరెడ్డి తెలంగాణ అమరవీరుల ట్రస్ట్‌కు అంకురార్పణ చేశారన్నారు. ఆయన మరణం అనంతరం ఆ ఆశయాలను కొనసాగించడమే లక్ష్యంగా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో 1999లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను స్మరించుకుంటూ స్మారకోపన్యాలు నిర్వహించడంతో పాటు రావి నారాయణరెడ్డి పేరుతో జాతీయ అవార్డు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇందులో భాగంగా 2000 సంవత్సరం నుంచి దేశంలో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి అవార్డును ట్రస్ట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఆర్థిక రంగ నిపుణులు బందోపాధ్యాయ, సిహెచ్.హనుమంతరావు, కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా, కేంద్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి చతురానన్ మిశ్రా, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శులు ఎ.బి.బర్ధన్, సురవరం సుధాకర్ రెడ్డి, ప్రముఖ దర్శకులు శ్యామ్ బెనగల్ లాంటి ప్రముఖులకు రావి నారాయణరెడ్డి స్మారక జాతీయ అవార్డును ప్రదానం చేశామని చెప్పారు. ఆ తర్వాత జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమం, కరోనా సమయంలో ఈ అవార్డులను ఇవ్వలేకపోయామని, తిరిగి 2026లో ఈ అవార్డును పునరుద్దరించామని చెప్పారు.

## వనప్రవేశం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆర్భాటంగా చేసిన ప్రకటనలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగానే మిగిలాయి. కోట్లాది రూపాయల ఖర్చు, హైటెక్ హంగులు, ఏఐ (ఏఐ) నిఘా అంటూ గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వ యంత్రాంగం.. ట్రాఫిక్ నియంత్రణలో ఘోరంగా విఫలమై చేతులెత్తేసింది. గంటల కొద్దీ చక్రబంధం.. నరకప్రాయం ప్రయాణంగా మారింది. మేడారం వెళ్లే దారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయి భారీ నరకాన్ని తలపిస్తున్నాయి. పస్రా నుంచి మేడారం చేరుకోవడానికి భక్తులకు ఏకంగా 10 గంటల సమయం పడుతుండటం అధికారుల వైఫల్యానికి పరాకాష్ట. పస్రా తాడ్వాయి మధ్య ఈ స్వల్ప దూరానికే 4 గంటల సమయం పడుతోంది. తాడ్వాయి మేడారం మధ్య మరో 4గంటల పాటు వాహనాలు అంగుళం కూడా కదలని పరిస్థితి. మేడారం నుంచి హనుమకొండ చేరుకోవడానికి 11 గంటల సమయం పట్టింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు మేడారం నుంచి బయలుదేరిన భక్తులు శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు హనుమకొండలో దిగారు. చిన్నారులు, వృద్ధులు ఆకలి దప్పులతో వాహనాల్లోనే అలమటిస్తుంటే, పోలీస్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఏఐ అంటే అంతే సంగతులా?**

ఈసారి జాతరలో ట్రాఫిక్ కష్టాలు ఉండవని, ఆధునిక సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పర్యవేక్షిస్తున్నామని చెప్పిన మాటలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్లు ఉన్నా.. ఎక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందో పసిగట్టి క్లియర్ చేయడంలో పోలీస్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది.

**రోడ్లపై రద్దీ.. క్యూలైన్లలో ఖాళీ!**

విచిత్రమేమిటంటే, ఒకవైపు కిలోమీటర్ల మేర రోడ్లపై భక్తులు చిక్కుకుపోగా, మేడారంలో క్యూలైన్లు మాత్రం వెలవెలబోతున్నాయి. భక్తులు గమ్యస్థానానికి చేరుకోలేక అడవి బాటలోనే ఆగిపోవడంతో గద్దెల వద్ద రద్దీ తగ్గింది. యంత్రాంగం మధ్య సమన్వయ లోపం భక్తుల పాలిట శాపంగా మారింది.

**నిట్టూరుస్తున్న భక్తులు :** 'మేము మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చామా లేక రోడ్లపై శిక్ష అనుభవించడానికి వచ్చామా?' అంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ట్రాఫిక్ క్లియర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com